
# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

గుంటూరు - శుక్రవారం 28 మార్చి 2025 | సంపుటి:9 | సంచిక:92 | పేజీలు:8+4 | వెల: రూ.5

GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA| HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM |


### ఇక నుంచి సర్కార్ ట్యాక్సీలు




2


### ఆహ్లాదకరమైన కశ్మీర్‌లో అందాల పూదోట



ఏడాదికి 20 రోజులు మాత్రమే చూడగలం 2

# శ్రీశైలంలో ఉగాది మహోత్సవాలు..

## యాగశాల ప్రవేశం - అంకురార్పణ ప్రత్యేక పూజలు




- లక్షలాదిగా తరలి వస్తున్న పాదచారులు
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు
- భృంగివాహనంపై ఆది దంపతుల వైభవం
- మహాలక్ష్మి అలంకారంలో భ్రామరీ అమ్మవారు

**శ్రీశైలం మార్చి 27మనం న్యూస్:** శ్రీశైల మహాక్షేత్రంలో ఉగాది మహోత్సవాలు శాస్త్రోక్తంగా ఆరంభమయ్యాయి. గురువారం ఉదయం ఈవో శ్రీనివాసరావు దంపతులు, శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామిఅమ్మవార్లను దర్శించుకుని అర్చక వేద పండితులతో కలిసి స్వామివారి యాగశాల ప్రవేశం చెయ్యడంతో ఐదు రోజులపాటు జరిగే ఉత్సవాలుప్రారంభమైనట్లు ప్రధాన అర్చకులు తెలిపారు. స్థానాచార్యులు లోక కళ్యాణం కోసం శివసంకల్పాన్ని పఠించిన వేదపండితులు అతివృష్టి అనావృష్టి నివారించబడి పంటలు బాగా పండి రైతాంగం సుభిక్షంగా ఉండాలని ఋత్వికలు శివసంకల్పాన్ని పఠించారు. గణపతిపూజ అఖండ దీప కళశస్థాపన, వేదస్వస్థి, రుత్విగ్వరణం, పుణ్యాహ్వచనం, చండీశ్వర పూజ,రుద్రపారాయణం, రుద్ర కళశస్థాపన, కంకణపూజ, కంకణధారణ జరిపించబడ్డాయి. అనంతరం శ్రీ భ్రమరాంబ అమ్మవారికి విశేషకుంకుమార్చన, నవావరణార్చన, చండీ హోమాలనునిర్వహించారు. సాయంత్రం అంకురార్పణలో భాగంగా ఆలయ ప్రాంగణంలోని నిర్ణీత ప్రదేశంలోని మట్టిని తీసుకుని 9 పాలికలలో వేసి నవధాన్యాలను అంకురారోపింజేసే ...మిగతా 2లో



### ఉగాది మహోత్సవాలలో ట్రాఫిక్ అంతరాయం లేకుండా ప్రత్యేక చర్యలు

ఎస్పి అది రాజ్ సింగ్ రాణా



2

## కొన్నింటిపై సుంకాలు తగిస్తం

అయితే, అమెరికా ఒత్తిడికి తలొగ్గే కాదు.. మన దేశ ప్రయోజనాల కోసమేనని కేంద్రం ప్రకటన

ఏప్రిల్ 2 నుంచి కొత్త సుంకాలు అమలు చేయనున్న అగ్రరాజ్యం



**ఢిల్లీ, మార్చి 27:** అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అధికారంలోకి వచ్చిన దగ్గరినుంచి పలు దేశాలపై సుంకాలను పెంచుతున్నారు. ఏప్రిల్ 2 నుంచి అమలయ్యే ప్రతీకార సుంకాలను తప్పించుకునేందుకు అమెరికా దిగుమతులపై టారిఫ్ కోతల వైపు భారత్ మొగ్గుచూపుతోంది. ఈక్రమంలో రెండు దేశాల మధ్య మొదలైన ట్రేడ్ అండ్ టారిఫ్ చర్చల్లో భారత్ ధృఢవైఖరిని ప్రదర్శిస్తోంది. కొన్ని వస్తువులపై ...మిగతా 2లో

### రోడ్డు ప్రమాదాల నివారణకు..

## నాలుగు లైన్ల రహదారులుగా 25 వేల కిమీ రోడ్డు

రూ.10 లక్షల కోట్లతో మారుస్తామని కేంద్ర మంత్రి గడ్కరీ వెల్లడి



2

## నందీశ్వరునికి త్రయోదశి పూజలు



**శ్రీశైలం మర్చి 27 మనం న్యూస్:** శ్రీశైల మహా క్షేత్రంలో గురువారం త్రయోదశిని పురస్కరించుకొని నందీశ్వరునికి ప్రత్యేక పూజలు చేసినట్లు ఈవో శ్రీనివాస రావు తెలిపారు. నందిమండపంలో కొలువైన నందీశ్వరునికి పంచామృతాభిషేకాలు, గంగోదకం, కుంకుమొదకం, బస్మోదకం రుద్రాక్షోదకం, బిల్వోదకం పుష్పోదకం, ఫలోదకాలు మల్లికా గుండంలోని శుద్ధ జలాలతో విశేష అభిషేకాలు నిర్వహించారు. అనంతరం విశేష అర్చనలు, వృషభ సూక్తం పురుష సూక్తం మొదలైన వేదమంత్రాలతో పూజలు చేశారు. తర్వాత నందీశ్వరునికి నూతన వస్త్రం సమర్పించి, శనగలు నైవేద్యంగా నివేదించారు.

# ఇఫ్తార్ విందులో సీఎం కీలక వ్యాఖ్యలు



**విజయవాడ:** తెలుగుదేశం పార్టీ మొదటి నుంచి మైనార్టీలకు అండగా ఉందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. వారి సంక్షేమం కోసం అనేక పథకాలు అమలు చేస్తున్నామని ఆయన తెలిపారు. గురువారం సాయంత్రం విజయవాడలో ముస్లిం సోదరులకు ప్రభుత్వం ఇఫ్తార్ విందు ఇచ్చింది. ఈ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు నాయుడు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పేదలతో తానుండాలనేదే తన జీవితాశమయని ఆయన పేర్కొన్నారు. నూటికి నూరు శాతం పేదల్నిపైకి తీసుకొచ్చేందుకే పీ4ను మార్చి 30వ తేదీ నుంచి చేపడుతున్నామని ఆయన వివరించారు.

పేదరికంలో ఉన్న ప్రతీ ముస్లిం కుటుంబాన్ని ఆర్థికంగాపైకి తీసుకొస్తామన్నారు. అలాగే వక్ఫ్ బోర్డు ఆస్తులని కాపాడతామని ఈ సందర్భంగా ముస్లిం సోదరులకు సీఎం చంద్రబాబు భరోసా ఇచ్చారు. మత సామరస్యాన్ని కాపాడుతూ.. ముస్లిం మైనార్టీలను అన్ని విధాలాపైకి తీసుకొస్తామని తెలిపారు. ముస్లిం మైనార్టీలతో తెలుగుదేశం పార్టీకి మొదటి నుంచీ అనుబంధం ఉందని ఈ సందర్భంగా ఆయన ...మిగతా 2లో




## రైతుకు కన్నీళ్ళు మిగిలిస్తున్న టమాటా

**హైదరాబాద్, మార్చి 27:** టమాటా ధరలు భారీగా పడిపోవడంతో కనీస గిట్టుబాటు ధర కూడా రాకపోవడంతో రైతులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. హోల్ సేల్ గా కిలో రూ. 3 మాత్రమే పలుకుతుండటంతో మార్కెట్లో అమ్మడానికి వచ్చిన రైతులు టమాటాను చేసేదేమి లేక రోడ్ల పక్కన పారేసి వెళ్తున్నారు. రంగారెడ్డి జిల్లా కొందుర్తికి చెందిన ఓ రైతు ఒక్కోటి 30 కేజీల 56 టమాటా పెట్టెలను మహబూబ్ నగర్ రైతు బజార్ కు తీసుకు వెళ్ళగా దళారులు 39 పెట్టెలకు కేవలం రూ.3900 ...మిగతా 2లో

## సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండండి

### ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి




**కుప్పం, మార్చి 27 మనం న్యూస్:** మహిళల అభివృద్ధి కి పలు సంక్షేమ పథకాలను ప్రభుత్వం అందిస్తున్నదని, ...మిగతా 2లో

## ఆ ఒక్క మెసేజ్తో రంగంలోకి దిగిన మంత్రి నారా లోకేష్



**గుంటూరు జిల్లా:** ఆంధ్రప్రదేశ్ ఐటీ, విద్యాశాఖల మంత్రి నారా లోకేశ్ మరోసారి మానవత్వం చాటుకున్నారు. సోషల్ మీడియాలో తన దృష్టికి వచ్చిన సమస్యలపై వేగంగా స్పందిస్తున్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సాయం చేస్తున్నారు. లోకేష్ సేవాగుణంపై ప్రజలు ప్రశంసలు కురిపిస్తున్నారు. తాజాగా.. లోకేశ్ క్షణాల్లో స్పందించడంతో ఒకరికి అవయవ దానం, మరొకరికి ప్రాణదానం జరుగనుంది. గుంటూరులోని రమేష్ ఆస్పత్రిలో తీవ్ర అనారోగ్యంతో చేరిన చెరుకూరి సుష్మ బ్రెయిన్ డెడ్కు గురి అయ్యారు. దీంతో సుష్మ కుటుంబ సభ్యులు ఆమె అవయవాలను దానం చేయడానికి నిర్ణయించుకున్నారు. సుష్మ అవయవదానంతో తిరుపతిలో మరొకరికి ప్రాణదానం జరుగనుంది. సుష్మ గుండెను ...మిగతా 2లో

## వైసీపీ హయాంలో బడా స్కాం

### మంత్రి కొల్లు రవీంద్ర వార్నింగ్




**కృష్ణా:** నాటుసారా రహిత రాష్ట్రంగా ఏపీని తీర్చిదిద్దేందుకు 2016లో తొలిసారిగా నవోదయం కార్యక్రమాన్ని ప్రారంభించామని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా కృష్ణాజిల్లా కలెక్టరేట్లో సంబంధిత శాఖాధికారులతో ఇవాళ మంత్రి కొల్లు రవీంద్ర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి కొల్లు రవీంద్ర మీడియాతో మాట్లాడుతూ.. ఆరు నెలల్లో నాటుసారాను పూర్తిగా నిర్మూలించాలన్న ఉద్దేశంతో నవోదయం 2.0 కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. మే 1వ తేదీ నాటికి రాష్ట్రాన్ని నాటుసారా ...మిగతా 2లో




## నందిని పాల ధర పెంపు

**బెంగళూరు, మార్చి 27:** కర్ణాటక ప్రభుత్వం నందిని పాల ఉత్పత్తుల ధరలను పెంచింది. లీటరుకు రూ.4 చొప్పున పెంచినట్లు ప్రకటించింది. పాలతో పాటు పెరుగుపై కూడా అంతే పెంచినట్లు ఆ రాష్ట్ర పశుసంవర్ధక శాఖ వెల్లడించింది. పాడి పరిశ్రమ అభివృద్ధి కోసమే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య నేతృత్వంలో ...మిగతా 2లో




## పుతిన్ త్వరలో చనిపోతాడు.. యుద్ధం ముగిసిపోతుంది

### ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్ స్కీ వ్యాఖ్యలు



**కీవ్, మార్చి 27:** రష్యా అధ్యక్షుడు పుతిన్ త్వరలో చనిపోతాడు.. యుద్ధం ముగుస్తుంది అని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్ స్కీవ్యాఖ్యానించారు. ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్ తో సమావేశం అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో జెలెన్ స్కీ ఈ వ్యాఖ్యలు చేశారు. పుతిన్ త్వరలో చనిపోతాడు. అది వాస్తవం. దీంతో ఇరుదేశాల మధ్య జరుగుతున్న ...మిగతా 2లో

## ఏపీ-గేట్స్ ఫౌండేషన్ మధ్య ఒప్పందం.. అమలుకు టాస్క్ ఫోర్స్

**అమరావతి:** ఏపీ-బిల్‌గేట్స్ ఫౌండేషన్ మధ్య ఒప్పందం అమలుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు టాస్క్ ఫోర్స్ చేసింది. సుపరిపాలన, సాగులో ఏఐ సాంకేతికత, వైద్యారోగ్యం, జీవన ప్రమాణాల పెంపుపై ఏపీ ప్రభుత్వం గేట్స్ ఫౌండేషన్తో ఇటీవల ఒప్పందం చేసుకున్న సంగతి తెలిసిందే. దీని అమలుపై మొత్తం 26 మంది అధికారులతో తాజాగా టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేసింది. మానవ వనరుల అభివృద్ధి, సాధారణ పరిపాలన శాఖతోపాటు, గ్రామవార్డు సచివాలయశాఖ కార్యదర్శులు ఇందులో సభ్యులుగా ఉంటారు. ఎంవోయూ కుదుర్చుకున్న అంశాల అమలును పర్యవేక్షించాల్సిందిగా టాస్క్ ఫోర్స్‌ను రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది.

# శ్రీశైలంలో ఉగాది మహోత్సవాలు..

(మొదటి పేజీ తరువాయి)

క్రతువును ఘనంగా చేశారు.

**భృంగివాహనంపై ఆది దంపతుల వైభవం**

ఆలయ ప్రాంగణంలోని అక్కమహాదేవి అలంకార మండపంలో స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులనుభృంగి వాహనంపై అధిష్టింపజేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.భృంగి వాహానాధీశులైన స్వామి అమ్మవార్లను దర్శించుకోవడం వలన పనులలో ఏకాగ్రత లభించి, సర్వపాపాలు హరించ బడుతాయని పురాణాల్లో చెప్పబడింది.

**మహాలక్ష్మీ అలంకారంలో భ్రామరీ అమ్మవారు**

కన్నడిగుల ఇలవేల్పు శ్రీ భ్రమరాంబ అమ్మవారు మహాలక్ష్మి అవతారంలో విశేష పూజలు నిర్వహించారు. చతుర్భుజాలు కలిగిన ఈదేవి పై రెండు చేతులల్లో పద్మాలు, కుడివైపు అభయ హస్తం, ఎడమవైపు వరముద్రతో భక్తాధులకు దర్శనమిచ్చింది. ఈ అమ్మవారిని దర్శించడం వలన శత్రుభాధలు నివారించబడి సకల శుభాలు కలుగుతాయని భక్తుల నమ్మకం. వాహన పూజల అనంతరం స్వామిఅమ్మవార్లను ఆలయ ప్రధాన రాజగోపురం ద్వారా గంగాధర మండపం నుండి నంది మండపం వరకు, నందిమండపం నుండి బయలు వీరభద్రస్వామి వరకు గ్రామోత్సవం కన్నుల పండగగా సాగింది. గ్రామోత్సవంలో కోలాటం, జానపద పగటి వేషాలు, కేరళచండీమేళం, గొరువ నృత్యం, తప్పెట చిందు, కర్ణాటక జాంజ్, కొమ్ము వాయిద్యం, జానపదడోలు, నందికోలుసేవ, కంచుడోలు విన్యాసాలు భక్తులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఈవో శ్రీనివాసరావుతో పాటు చీఫ్

సెక్యూరిటీ ఆఫీసర్అయ్యన్న, పిఆర్వో శ్రీనివాసరావు, శ్రీశైల ప్రభ సంపాదకులు అనిల్ కుమార్, ఏఈఓలు హరిదాస్,స్వాములు సూపరింటెండెంట్ హర్యానాయక్, ఆలయ పర్యావేక్షకులు అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఉగాది మహోత్సవాలలో ట్రాఫిక్ అంతరాయం లేకుండా ప్రత్యేక చర్యలు

శ్రీశైలం మార్చి 27మనం న్యూస్: శ్రీశైలంలో ఉగాది మహోత్సవాల సంధర్భంగా శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి వారి దర్శనం కోసం వచ్చే భక్తులకు భక్తులకు ఎలాంటి ట్రాఫిక్ అంతరాయం లేకుండా చూసేందుకు ఎస్పీ అదిరాజ్ సింగ్ రాణా ఆదేశాలమేరకు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా పోలీస్ అధికారులకు జిల్లా ఎస్పీ దిశా నిర్దేశం చేశారు. శిఖరం వద్ద నుండి వద్ద నుండి ముఖద్వారం, సాక్షి గణపతి, హటకేశ్వరం,రామయ్య టర్నింగ్ టోల్గేట్ మరియు శ్రీశైలం లోని పరిసర ప్రాంతాలలో ట్రాఫిక్ అంతరాయం కలగకుండా 15 బ్లూ కోర్ట్ వాహనాలను మరియు 10 రక్షక్ వాహనాలను ఏర్పాటు చేశారు. ఈ వాహనాలు నిరంతరం మూవింగ్ చేస్తూ ఎక్కడ ట్రాఫిక్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకుంటున్నారు. ఎక్కడ ఎలాంటి ట్రాఫిక్ అంతరాయం మరియు ఇతర అవాంఛనీయ సంఘటనలు జరగకుండా డ్రోన్ కెమెరాలతో నిఘా ఏర్పాటుతో పాటుముఖ్యమైన కూడళ్ల యందు పికెట్స్ లను ఏర్పాటు చేసి ట్రాఫిక్ నియంత్రణ కొరకు సిబ్బందిని ఏర్పాటు చేశారు. ట్రాఫిక్ నియంత్రణకు సరిపడా సిబ్బందితోపాటు ఇద్దరు డిఎస్పీ లతోపాటు 12 మంది ఇన్స్పెక్టర్లను అందుబాటులో ఉంచినట్లు ఎస్పీ తెలిపారు.

## ఆ ఒక్క మెసేజ్తో రంగంలోకి దిగిన మంత్రి నారా లోకేష్

(మొదటి పేజీ తరువాయి)

తిరుపతిలోని మరొకరికి అమర్చనున్నారు. గుంటూరు నుంచి తిరుపతికి గుండెను తరలించడానికి సొంత ఖర్చులతో మంత్రి లోకేశ్ ప్రత్యేక విమానం ఏర్పాటు చేశారు. ఇవాళ(గురువారం) రాత్రి 7 గంటలకు గ్రీన్ ఛానెల్ ద్వారా గుండెను గుంటూరు రమేష్ ఆస్పత్రి సిబ్బంది తిరుపతికి తరలించనున్నారు. దీంతో గుండె మార్పిడి విజయవంతం చేయడానికి వైద్యులు యుద్ధ ప్రాతిపదికన ఏర్పాట్లు చేస్తున్నారు. సకాలంలో స్పందించిన మంత్రి నారా లోకేశ్ సుష్మ కుటుంబ సభ్యులు, రమేశ్ హాస్పిటల్స్ వైద్యులు కృతజ్ఞతలు తెలిపారు.

# ఇఫ్తార్ విందులో సీఎం కీలక వ్యాఖ్యలు

(మొదటి పేజీ తరువాయి)

గుర్తు చేసుకొన్నారు. సమైఖ్య ఆంధ్రలోనైనా.. నవ్యాంధ్రలోనైనా ముస్లింలకు న్యాయం చేసింది తెలుగుదేశం పార్టీ మాత్రమేనని గుర్తు చేశారు. ఉర్దూని రెండో భాషగా గుర్తించటంతో పాటు వక్ఫ్ బోర్డు ఆస్తుల్ని కాపాడుతూ వచ్చామని సీఎం చంద్రబాబు నాయుడు వివరించారు.అలాగే హైదరాబాద్, కర్నూల్లో ఉర్దూ విశ్వవిద్యాలయాలు తీసుకొచ్చామన్నారు. ఇక హైదరాబాద్, కర్నూల్, విజయవాడల్లో హజ్ హౌస్ నిర్మాణాలు చేపట్టామని తెలిపారు. రంజాన్ పండగ సందర్భంగా తోఫా ఇవ్వటంతో పాటు ఇమామ్లు, మౌజమ్లను ఆదుకుంది తెలుగుదేశం పార్టీనేనని ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు గుర్తు చేశారు. రాష్ట్ర బడ్జెట్లో గతంలో కంటే ఈ సారి రూ. 1,300 కోట్లు అదనంగా మైనార్టీలకు కేటాయించామన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో ప్రతీ పేదవాడినిపైకి తీసుకొచ్చే కార్యక్రమమే పీ4 అని ఆయన అభివర్ణించారు.రంజాన్ మాసంలో ఈ రోజు మీ అందరికి కలవడం తన అదృష్టంగా భావిస్తున్నానన్నారు. ఈ సందర్భంగా అందరికి సీఎం చంద్రబాబు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. గత 40 ఏళ్లుగా తాను సైతం రంజాన్ మాసంలో భాగస్వామ్యం అవుతున్నానన్నారు. క్రమ శిక్షణ, దాతృత్వంతోపాటు ధార్మికచింతన కూడికే రంజాన్ మాసమని ఆయన పేర్కొన్నారు.ఉదయం నుంచి ఖురాన్ చదవడం.. ఇతరలుకు సహాయం చేయడం వంటి మంచి పనులు చేస్తున్నారంటూ ముస్లిం సోదరులపై ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు ప్రశంసల జల్లు కురిపించారు. పాజిటీవ్ ఆలోచనలతో.. అందరూ బాగుండాలని పని చేస్తున్నారని తెలిపారు. ఖురాన్ నేర్పించిన మంచి గుణం.. డబ్బులున్నవాళ్లు పేదలకు సాయం చేయడమన్నారు. ఈ ఇఫ్తార్ విందులో మైనార్టీ శాఖ మంత్రి ఎన్.ఎండీ ఫరూక్ పాల్గొన్నారు. అంతకుముందు ముస్లిం సోదరులతో కలిసి సీఎం చంద్రబాబు నమాజ్ చేశారు.



## సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండండి

(మొదటి పేజీ తరువాయి)

స్వయం సహాయక సంఘ మహిళలకు బ్యాంకు రుణాలను అందించి వ్యాపారవేత్తలుగా ఎదగడానికి అన్ని విధాలా సహకారం అందిస్తున్నదని ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి తెలిపారు.గురువారం కుప్పం లో డి ఆర్ డి ఏ, మెప్మా ద్వారా స్వయం సహాయక సంఘ మహిళలకు సేవలను అందించడం లో భాగంగా ఇండియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో మైక్రో సెట్ శాఖ ను ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ మాట్లాడుతూ మహిళా శక్తి యొక్క ప్రాధాన్యత ను వివరించారు. మహిళలు బ్యాంకు రుణాలను సద్వినియోగం చేసుకొని మంచి వ్యాపారవేత్తలుగా ఎదిగి వారి కుటుంబాలను ఆర్థికంగా అభివృద్ధి లోకి తీసుకెళ్లాలని కోరారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని కోరారు. ప్రతి మహిళ పొదుపును పెంచుకోవటానికి బ్యాంకు ఖాతాలను ఉపయోగించుకోవాలని సూచించారు. ఎఫ్ జి ఎం రాజేశ్వర రెడ్డి మాట్లాడుతూ మైక్రో సెట్ శాఖ ద్వారా స్వయం సహాయక సంఘాల కు, సంఘ సభ్యులకు ముద్రా రుణాలు, లఖ్ పతి దీదీ రుణాలు, బంగారు నగల పై రుణాలు పొందే అవకాశం ఉందన్నారు.ఈ సందర్భంగా160 సంఘాలకు గానూ రూ.30 కోట్లు మరియు ఇండియన్ బ్యాంక్ తిరుపతి జోన్ ద్వారా రూ.330.కోట్లు నారా భువనేశ్వరి చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి డి జి ఎం ఇండియన్ బ్యాంకు,జోనల్ మేనేజర్,తిరుపతి సెల్వరాజ్,డి జడ్ ఎం ,ఇండియన్ బ్యాంకు, జోనల్ ఆఫీస్, తిరుపతి, బాలచంద్ర మోహన్, ఎల్ డి ఎం హరీష్, తదితరులు పాల్గొన్నారు.

## రైతుకు కన్నీళ్ళు మిగిలిస్తున్న టమాటా

(మొదటి పేజీ తరువాయి)

చెల్లించారు. మిగతావి కొనకపోవడంతో రోడ్డు పక్కన పారవేశాడు. కనీసం రవాణా ఛార్జీలు కూడా రాలేదని రైతు కన్నీళ్ళు పెట్టుకున్నాడు. ఏపీ నుంచి అత్యధికంగా టమాటా దిగుమతి అవుతుండటంతో తెలంగాణలో టమాటా రేట్లు దారుణంగా పడిపోయి.. ఇక్కడి రైతుల వద్ద కొనేవారు కరువయ్యారు.

## వైసీపీ హయాంలో బడా స్కాం

(మొదటి పేజీ తరువాయి)

రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దుతామని మంత్రి కొల్లు రవీంద్ర స్పష్టం చేశారు.

గత జగన్ ప్రభుత్వంలో కల్తీ మద్యంతో ప్రజల ప్రాణాలను హరించారని మంత్రి కొల్లు రవీంద్ర ఆరోపించారు. గత వైసీపీ ప్రభుత్వంలో అవినీతిమయమైన ఎక్సైజ్ శాఖను ప్రక్షాళన చేస్తున్నామని చెప్పారు. మద్యం కుంభకోణంలో పాత్రధారులు, సూత్రధారులను గుర్తించి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏపీలో మద్యం కుంభకోణం అతి పెద్ద స్కాం అన్నారు. ఢిల్లీలో కన్నా ఏపీలోనే మద్యం స్కాం ఎక్కువ అని టీడీపీ ఎంపీ శ్రీ కృష్ణదేవరాయలు పార్లమెంటులో చెప్పారని మంత్రి కొల్లు రవీంద్ర గుర్తుచేశారు.

జగనే కసిరెడ్డి రాజశేఖర్ రెడ్డిని నడిపించారని విజయసాయి రెడ్డి చెప్పారని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. మద్యం తయారీ నుంచి అమ్మకం వరకు అన్నింటిలో అవినీతి జరిగిందని ఆరోపించారు. జగన్ తన ఆదాయం పెంచుకుని... రాష్ట్ర ఆదాయం తగ్గించారని మండిపడ్డారు. నాసిరకం మద్యం ద్వారా ప్రజల ప్రాణాలతో ఆడుకున్నారని విమర్శించారు. అసలు మద్యం అమ్మకాలు, వచ్చిన ఆదాయంపై విచారణ జరుగుతుందని చెప్పారు. సిట్ వేసిన సాయంత్రమే ఫైళ్లను తగులపెట్టారన్నారు. అన్నీ విచారణ పూర్తి అయ్యాక తప్పకుండా చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. బియ్యం కేసు ఇంకా మూయలేదు... తమపై అనవసరంగా మాట్లాడే వైసీపీ నేతలు నోరు అదుపులో పెట్టుకుంటే మంచిదని మంత్రి కొల్లు రవీంద్ర హెచ్చరించారు.

# కొన్నింటిపై సుంకాలు తగిస్తాం

(మొదటి పేజీ తరువాయి)

టారిఫ్ కోతలకు అంగీకరించినప్పటికీ.. దేశ ప్రయోజనాలకే ప్రథమ ప్రాధాన్యం ఇస్తోంది. ''సుంకాలు తగ్గించినంత మాత్రాన అమెరికా ఒత్తిడికి లొంగిపోయినట్లు కాదు'' అని కేంద్ర ప్రభుత్వ ఉన్నతస్థాయి అధికారి జాతీయ మీడియాతో మాట్లాడారు.

'వ్యవసాయ ఉత్పత్తులైన వాల్ నట్స్, యాపిల్, బాదం వంటి వాటిపై తగ్గింపునకు సిద్ధంగా ఉన్నాం. కానీ భారత్లో వ్యవసాయరంగ పరిస్థితులను దృష్టిలోఉంచుకొని గోధుమ, మొక్కజొన్న వంటివాటిపై రాయితీకి అవకాశం లేదు'' అని తెలిపారు. ఇక.. విదేశాల్లో తయారై అమెరికాకు దిగుమతయ్యే కార్లపై 25 శాతం సుంకం విధిస్తున్నట్లు ట్రంప్ ప్రకటించారు. వచ్చేవారం ఈ చర్యలు అమల్లోకి వస్తాయని స్పష్టంచేశారు. ఇది శాశ్వతమైన చర్యగా పేర్కొన్న ఆయన అమెరికాలో తయారయ్యే వాటిపై మాత్రం ఎలాంటి సుంకం ఉండదని పేర్కొన్నారు. 'ట్రంప్ నిర్ణయం భారత ఆటోమొబైల్ పరిశ్రమపై గణనీయంగా ఉంటుంది. కానీ ద్విచక్రవాహనాలు, చిన్నపాటి కార్లపై కొన్ని సుంకాలు తగ్గించేందుకు సిద్ధంగా ఉన్నాం' అని ఆ అధికారి వెల్లడించారు.

అమెరికా నుంచి మన దేశంలోకి వస్తున్న ఉత్పత్తులపై ఇక్కడ ఎంత సుంకం విధిస్తే, ఇక్కడినుంచి అమెరికాకు చేరుతున్న అదేతరహా ఉత్పత్తులపై సమాన సుంకాన్ని ఏప్రిల్ 2 నుంచి అవలుచేస్తామని అమెరికా అధ్యక్షుడు ప్రకటించారు. ప్రపంచ వాణిజ్య సంస్థ ప్రకారం.. భారత ఉత్పత్తులపై అమెరికా సగటున 2.2% సుంకం విధిస్తుండగా.. అమెరికా ఉత్పత్తులపై భారత్ సుంకం సగటు 12 శాతంగా ఉంది.

## నందిని పాల ధర పెంపు

(మొదటి పేజీ తరువాయి)

జరిగిన సమావేశంలో పాల ధరలను పెంచే అంశంపై చర్చినట్లు మంత్రి కె. వెంకటేష్ వెల్లడించారు. 'కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో పాడి పరిశ్రమను ప్రోత్సహించడమే లక్ష్యంగా పెట్టుకుంది. లీటర్ పాలు, కేజీ పెరుగుపై రూ.4 పెంచేందుకు నిర్ణయించాం. ఏప్రిల్ 1 నుంచి ఈ ధరలు అమల్లోకి రానున్నాయి. ఇకపై రాష్ట్రంలోని పాల ఉత్పత్తిదారులకు కొత్త రేట్లు నేరుగా ప్రభుత్వం నుంచి అందేలా చర్యలు తీసుకుంటాం.

## ఇక నుంచి సర్కార్ ట్యాక్సీలు

(మనం న్యూస్): ఓలా, ఉబర్కు పోటీగా మరో కొత్త యాప్ అందుబాటులోకి రానుంది. అలాగని ఏ ప్రైవేటు సంస్థో కాదు.. కేంద్ర ప్రభుత్వమే స్వయంగా దీన్ని తీసుకురానుంది. 'సహకార్ ట్యాక్సీ' పేరిట దీన్ని తీసుకురానున్నట్లు కేంద్ర సహకార మంత్రి అమిత్షా ప్రకటించారు. సహకార సంఘాల మాదిరిగా ఇది పనిచేస్తుంది. దీంతో ఇందులో నమోదు చేసుకున్న డ్రైవర్లకు మేలు చేకూరుతుంది. త్వరలో ఓలా, ఉబర్, ర్యాపిడో వంటి ప్రైవేటు సంస్థలకు ప్రభుత్వం నుంచే పోటీ ఎదురుకానుందన్నమాట.

టూవీలర్, ఆటోలు, ఫోర్ వీలర్లు సహకార్ ట్యాక్సీలో భాగంగా సేవలందిస్తాయని అమిత్ షా చెప్పారు. ఇందులోని లాభాలన్నీ ఏ ఒక్క కంపెనీకో పరిమితం కాకుండా.. డ్రైవర్లకు లబ్ధి చేకూరుతుందని వివరించారు. రానున్న కొన్ని నెలల్లో సహకార్ ట్యాక్సీని తీసుకురానున్నట్లు చెప్పారు. ఇప్పటికే పశ్చిమ బెంగాల్లో యాత్రి సాథీ పేరిట మమతా బెనర్జీ ప్రభుత్వం అందిస్తోంది. తొలుత కోల్కతాలో అందుబాటులోకి తెచ్చారు. తర్వాత సిలిగుడి, అసన్సోల్, దుర్గాపూర్కు సేవలు విస్తరించారు. కర్ణాటకలో ఆటో, క్యాబ్ యూనియన్లు కలిసి నమ్మ యాత్రి పేరిట ఓ యాప్ను తీసుకొచ్చాయి. ఇందులోని లాభాలు డ్రైవర్లకే చెందుతాయి. సహకార్ ట్యాక్స్ కూడా ఇలానే పనిచేయనుంది.

# నాలుగు లైన్ల రహదారులుగా 25 వేల కిమీ రోడ్లు

ఢిల్లీ, మార్చి 27: దేశంలో 25 వేల కిలోమీటర్ల మేర రెండు లైన్ల జాతీయ రహదారులను నాలుగు లైన్లుగా మారుస్తామని కేంద్ర ఉపరితల రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరీ పేర్కొన్నారు. రూ.10 లక్షల కోట్ల వ్యయంతో ఈ పనులు చేపడతామని, తద్వారా రోడ్డు ప్రమాదాలు గణనీయంగా తగుతాయన్నారు. మంత్రి గురువారం లోక్ సభలో మాట్లాడుతూ.. రూ.6లక్షల కోట్లతో 16వేల కి.మీ జాతీయ రహదారులను ఆరు లైన్లుగా మారుస్తామన్నారు. రూ.10లక్షల కోట్లతో 25వేల కి.మీ మేర రెండు లైన్ల జాతీయ రహదారులను నాలుగు లైన్లుగా మార్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. వీటికి సంబంధించి డీపీఆర్లు సిద్ధమవుతున్నాయి. రెండేళ్లలో పనులు పూర్తవుతాయని భావిస్తున్నాం'' అని నితిన్ గడ్కరీ పేర్కొన్నారు. ఈ రోడ్లు పూర్తైన తర్వాత రోడ్డు ప్రమాదాలు గణనీయంగా తగ్గుతాయని వెల్లడించారు.

భారత దేశంలో ఏటా 4.8లక్షల ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని గడ్కరీ ఇటీవల వెల్లడించిన విషయం విదితమే.వీటిలో 18 నుంచి 45 ఏళ్ల వయసు కలిగిన 1.88లక్షల మంది ప్రాణాలు కోల్పోతున్నారని చెప్పారు. ఈ ప్రమాదాల కారణంగా దేశ జీడీపీ ఏటా 3 శాతం నష్టపోతోందన్నారు. 2030 నాటికి ఈ ప్రమాదాల సంఖ్యను సగానికి తగ్గించే లక్ష్యంతో ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు.

## 'పోలవరం' ఎప్పుడో పూర్తి కావాల్సింది.. జగన్ పక్కన పెట్టారు: సీఎం చంద్రబాబు

**పోలవరం:** జగన్ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పోలవరం నిర్వాసితులకు రూ.10 లక్షల పరిహారం ఇస్తానన్నారని.. అధికారంలోకి వచ్చాక పైసా కూడా విదల్చలేదని ఏపీ సీఎం చంద్రబాబు విమర్శించారు. పోలవరం ప్రాజెక్టు సందర్శనలో భాగంగా నిర్వాసితులతో ఆయన ముఖాముఖి నిర్వహించారు. వారి సమస్యలను సీఎం అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అంతకుముందు ఏరియల్ వ్యూ ద్వారా ప్రాజెక్టు ప్రాంతాన్ని చంద్రబాబు పరిశీలించారు. ''వరదలు వచ్చినప్పుడు అప్పటి సీఎం జగన్ పట్టించుకోలేదు. రైతులు త్యాగం చేసి పోలవరం కోసం భూములు ఇచ్చారు. వారిలో కొందరికి మొదట్లో చాలా తక్కువ పరిహారం ఇచ్చారు. నిన్నమొన్నటి వరకూ నిర్వాసితులను పట్టించుకున్న నాథుడు లేడు. వీళ్లైనంత త్వరగా పరిహారం ఇచ్చే ప్రయత్నం చేస్తాం. కేంద్రాన్ని ఒప్పించి 7 మండలాలను ఏపీలో విలీనం చేశాం. ఎప్పుడో పూర్తి కావాల్సిన పోలవరం ప్రాజెక్టును జగన్ పక్కన పెట్టారు. ఈ ప్రాజెక్టు సొమ్మును ఇతర పథకాలకు మళ్లించారు.రూ.829 కోట్లు నేరుగా నిర్వాసితుల ఖాతాలో వేసిన ఘనత మా ప్రభుత్వానిది. పోలవరంలో నీళ్లు వదిలే ముందే.. 2027 నవంబర్ నాటికి పునరావాసం పూర్తిచేస్తాం. దళారులు, మోసగాళ్లకు అవకాశం లేకుండా చర్యలు తీసుకుంటాం. నిర్మాణంలో ఆలస్యం వల్ల హైడల్ ప్రాజెక్టు వ్యయం భారీగా పెరిగింది. 2027 డిసెంబర్ నాటికి ప్రాజెక్టును పూర్తిచేస్తాం. మన ఎన్డీయే ప్రభుత్వం వచ్చింది.. సకాలంలో ప్రాజెక్టును పూర్తిచేసుకుందాం'' అని చంద్రబాబు అన్నారు.

## పుతిన్ త్వరలో చనిపోతాడు.. యుద్ధం ముగిసిపోతుంది

(మొదటి పేజీ తరువాయి)

యుద్ధం ముగిసిపోతోంది. ఈ యుద్ధం కొనసాగాలని రష్యా కోరుకుంటోంది. ఇది ముగిసేలా ఆ దేశంపై ఒత్తిడి తీసుకురావాలి' అని పేర్కొన్నారు. ఇటీవల పుతిన్ ఆరోగ్యంపై వచ్చిన ఊహాగానాల నేపథ్యంలోనే ఆయన ఈ వ్యాఖ్యలు చేసినట్లు తెలుస్తోంది. పుతిన్ దగ్గుతున్నట్లు, అతని కాళ్లు, చేతులు వణుకుతున్నట్లు ఉన్న వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. దీంతో ఆయన అనారోగ్యంతో బాధ పడుతున్నారనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. అయితే, ఆ వీడియోలో ఉన్న దృశ్యాలు 2022 నాటివని సమాచారం. గతంలోనూ పుతిన్ ఆరోగ్య పరిస్థితులపై మీడియాల్లో అనేక కథనాలు వెలువడ్డాయి. ఆయన డూప్ ను సైతం ఉపయోగిస్తున్నారంటూ ఆరోపణలు వినిపించాయి. పుతిన్ అప్పుడే వీటిని ఖండించారు. రష్యా అధ్యక్షుడి అనారోగ్య పరిస్థితులపై మీడియాలో వస్తున్న కథనాలను క్రెమ్లిన్ ఎప్పటికప్పుడూ ఖండిస్తూ వచ్చింది. అయితే, ఇప్పుడు జెలెన్ స్కీ చేసిన వ్యాఖ్యలపై ఇప్పటివరకు ఎవరూ ఎలాంటి ప్రకటన చేయలేదు. మరోవైపు.. రష్యా-ఉక్రెయిన్ల మధ్య యుద్ధాన్ని ఆపేందుకు 30 రోజుల తాత్కాలిక కాల్పుల విరమణ పాటించాలంటూ అమెరికా చేసిన ప్రతిపాదనకు ఇప్పటికే కీవ్ అంగీకరించిన సంగతి తెలిసిందే. దీనిపై మాస్కోను ఒప్పించేందుకు అగ్రరాజ్యం చర్చలు ప్రారంభించింది. సౌదీ వేదికగా రష్యాతో అమెరికా అధికారులు భేటీలు కొనసాగిస్తున్నారు. ఇందులోభాగంగానే నల్ల సముద్రంలో దాడులను నిలిపివేసేందుకు ఇరుదేశాల మధ్య అంగీకారం కుదిరినట్లు అమెరికా అధ్యక్ష కార్యాలయం ప్రకటించింది.

## ఆహ్లాదకరమైన కశ్మీర్లో అందాల పూదోట

కశ్మీర్: ఆహ్లాదకరమైన కశ్మీర్లో అందాల పూదోట ఉంది. దాని పేరే ఇందిరాగాంధీ తులిప్ గార్డెన్. ఆసియాలోనే అతిపెద్ద తులిప్ పూల తోట అయిన ఇది సంవత్సరం మొత్తంలో వేసవిలో 20 నుంచి 30 రోజులు మాత్రమే తెరిచి ఉంటుంది. నిన్నటి నుంచి ఇది సందర్శకులకు అందుబాటులోకి వచ్చింది. అ అరుదైన వీక్షణం కోసం పర్యాటకులు కశ్మీర్ కు తరలి వస్తున్నారట.




# గత పాలకుల అహంభావంతో పోలవరానికి తీవ్ర నష్టం

**పోలవరం:** గత పాలకుల అహంభావం, తెలియనితనం, రాజకీయ వివక్షతో పోలవరం ప్రాజెక్టుకు నష్టం వాటిల్లిందని సీఎం చంద్రబాబు విమర్శించారు. గోదావరి జలాల్లో 2 వేల టీఎంసీలు సముద్రంలోకి వెళ్తున్నాయని, అందులో 400 టీఎంసీలను వాడుకుంటే ఏపీని కరవు రహితం చేయవచ్చని అన్నారు. దీని కోసం ప్రాజెక్టు కట్టాలని 1941లోనే ప్రణాళికలు సిద్ధమయ్యాయని, అప్పుడు కట్టలేక ధవళేశ్వరం బ్యారేజీ కట్టారని గుర్తు చేశారు. గురువారం పోలవరం ప్రాజెక్టును సందర్శించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు.

''విభజన చట్టంలో పోలవరాన్ని జాతీయ ప్రాజెక్టుగా పెట్టారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రెండు రాష్ట్రాలుగా ఏర్పడటానికి జూన్ 2 డెడ్లైన్గా ఉంది. ఏడు మండలాలు తెలంగాణలో ఉంటే ప్రాజెక్టు పూర్తికాదు. జూన్ 2 దాటితే రెండు రాష్ట్రాలు బిల్లును ఆమోదించాలి. ఆ ఏడు మండలాలను ఏపీకి ఇవ్వడం ప్రాజెక్టుకు దోహదమైంది. ప్రాజెక్టును పూర్తి చేయగలమనే ధీమాతో ముందుకెళ్లాం. పోలవరం ప్రాజెక్టును 73 శాతం పూర్తి చేశాం. పోలవరంపై 82 సార్లు వర్చువల్గా సమీక్షించాను. ప్రాజెక్టు ఆలస్యమవుతుందని పట్టిసీమ నిర్మాణం చేపట్టాం. ఎడమ ప్రధాన కాలువ పనులు కూడా వేగవంతం చేశాం. వైకాపా హయాంలో జరిగిన తప్పు.. చరిత్ర క్షమించరాని నేరం. జాతీయ ప్రాజెక్టు, ప్రజల ఆస్తిని నాశనం చేసే హక్కు ఎవరికీ లేదు.

గతంలో డయాఫ్రమ్ వాల్ దెబ్బతిన్న సంగతి కూడా ఎవరికీ తెలియదు. కాఫర్డ్యామ్ సకాలంలో పని చేసి ఉంటే ఇంత నష్టం జరిగేది కాదు. ఊహించని నష్టం జరిగింది. ఐదేళ్లు ఏమీ చేయలేని పరిస్థితి. పీపీఏ అథారిటీ, కేంద్ర ప్రభుత్వం ముందే చెప్పినా అప్పటి ప్రభుత్వం పట్టించుకోలేదు. ఒకసారి ఓట్లేసినందుకు రాష్ట్రానికి జీవనాడి లాంటి ప్రాజెక్టు దెబ్బతినే పరిస్థితి తీసుకొచ్చారు. పోలవరం విషయంలో నిపుణుల కమిటీ పరిశీలించింది. దెబ్బతిన్న డయాఫ్రమ్ వాల్ మళ్లీ నిర్మించాలని నిర్ణయించాం. రాజకీయ కక్షలతో రివర్స్ టెండర్ల పేరుతో ప్రాజెక్టుపై కక్ష తీర్చుకున్నారు. డయాఫ్రమ్వాల్ నిర్మాణానికి రూ.990 కోట్లు ఖర్చవుతోంది. 2020లో పూర్తి కావాల్సిన ప్రాజెక్టు 2027 డిసెంబర్కు పూర్తయ్యే పరిస్థితి ఏర్పడింది'' అని చంద్రబాబు అన్నారు.



## సూర్యలంక బీచ్ అభివృద్ధికి రూ.97.52 కోట్లు విడుదల

**అమరావతి:** బాపట్ల జిల్లా సూర్యలంక బీచ్ అభివృద్ధికి కేంద్రం రూ.97.52 కోట్లు విడుదల చేసినట్లు ఏపీ పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేశ్ వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన స్వదేశీ దర్శన్ స్కీమ్ 2.0 కింద బీచ్కు నిధులు మంజూరు చేసినట్లు ఆయన వెల్లడించారు. త్వరలోనే అంతర్జాతీయ ప్రమాణాలతో బీచ్ను అభివృద్ధి చేస్తామన్నారు. ఇటీవల దిల్లీ పర్యటనకు వెళ్లిన దుర్గేశ్.. కేంద్ర పర్యాటక శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ను కలిసి బీచ్ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాల్సిందిగా కోరారు. ఇచ్చిన మాటను నిలబెట్టుకొని నిధులు మంజూరు చేసినందుకు కేంద్ర మంత్రికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. పర్యాటకాభివృద్ధిని ప్రోత్సహిస్తున్న సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్కు దుర్గేశ్ కృతజ్ఞతలు తెలిపారు.

# స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ప్రక్రియను ఉపసంహరించుకోవాలని సీపీఐ డిమాండ్

- గతంలో ఇచ్చిన హామీ మేరకు చంద్రబాబు, లోకేష్ స్పందించాలి
- అదానీ విషయంలో జగన్, చంద్రబాబుల వైఖరి దొందూ దొందేనా..
- మీటర్ రీడర్స్ కు న్యాయం జరిగే వరకూ పోరు ఆగదు
- తిరుపతిలో మీటర్ రీడర్స్ నిరసన కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

**తిరుపతి, మార్చి 27 మనం న్యూస్ :** ఆంధ్ర సర్కార్ అదానీతో కుదుర్చుకున్న స్మార్ట్ మీటర్ల అగ్రిమెంటును రద్దు చేయాలని, గత సీఎం జగన్ కుదుర్చుకున్న ఒప్పందాన్ని చంద్రబాబు వెంటనే రద్దు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. గతంలో చంద్రబాబు, లోకేష్ ఇచ్చిన హామీ ప్రకారం స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ప్రక్రియను వెంటనే నిలుపుదల చేయాలని కోరారు. తిరుపతి నగరంలో గురువారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మీటర్ రీడర్స్ నిరసన కార్యక్రమం జరిగింది. ముందుగా బైరాగిపట్టెడలోని గంధమనేని శివయ్య భవన్ నుంచి ఏఐటీయూసీ, మీటర్ రీడర్స్ కార్మికులు ఏపీఎస్పీడీసీఎల్ కార్యాలయం వరకు పెద్దఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ముఖ్య అతిధిగా హాజరైయ్యారు. ముందుగా కార్యక్రమాన్ని ఉద్దేశించి స్మార్ట్ మీటర్ల సమస్యలను, ఇబ్బందులను డిమాండ్లను ఏపీ ఎలక్ట్రిసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.శివయ్య వివరించారు. అనంతరం నిరసన కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ అదానీతో గత సీఎం జగన్ చేసుకున్న అగ్రిమెంట్ ను చంద్రబాబు సీఎం అయ్యాక రద్దు చేయాల్సింది పోయి, మోడీకి భయపడి స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు సహకరిస్తున్నారని మండిపడ్డారు. గతంలో ప్రతిపక్షంలో ఉన్నప్పుడు చంద్రబాబు, లోకేష్ లు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తే.. పీకి పడేస్తామంటూ ఉపన్యాసాలు ఇచ్చి నమ్మబలికారని అధికారంలోకి వచ్చాక ఆ మాట ఏమైందని ప్రశ్నించారు. లక్ష పదివేల కోట్ల రూపాయల భారం రాష్ట్ర ప్రజలకు 20ఏళ్ల పాటు పడుతుందని తెలిసినప్పటికీ స్మార్ట్ మీటర్ల ప్రక్రియకు సహకరిస్తుండడం శోచనీయం అన్నారు. గతంలోనే తాను హైకోర్టులో పిటీషన్ వేసిన నెల రోజులకు అప్పటి పిఐసి ఛైర్మన్, (ప్రస్తుత ఆర్థిక శాఖ మంత్రి)గా ఉన్నపయ్యావుల కేశవ్ పిటీషన్ ఫైల్ చేశారన్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు.




సోలార్ విద్యుత్ ఉత్పత్తిని ఆంధ్ర రాష్ట్రంలో చేపట్టకుండా రాజస్థాన్ లో చేపడుతున్నారని, దీంతో ఆ రాష్ట్రానికి రూ.8వేల కోట్ల పన్ను వస్తోందని, 14వేల మందికి ఉద్యోగాలు వస్తున్నాయని, దీంతో ఆంధ్రకు రావలసిన పన్నులు కూడా నష్టపోయే పరిస్థితి వచ్చిందని అసహనం వ్యక్తం చేశారు. సుమారు పదేళ్లకు పైగా మీటర్ రీడర్లు పనిచేస్తుంటే వారికి ఉద్యోగ భద్రత కల్పించకుండా, కేవలం అదానీ స్మార్ట్ మీటర్ల వల్ల వారి కార్మికుల కడుపుకొట్టే పరిస్థితిని తీసుకొచ్చారన్నారు. వెంటనే మీటర్ల రీడర్స్ కు తగిన ఉపాధి చూపి ఎస్క్రో ద్వారా వేతనాలు చెల్లింపులు జరిగేలా చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ విషయంగా త్వరలో ఏపీ సీఎస్ విజయానంద్ ను కలిసి వినతి పత్రం అందించడం జరుగుతుందని, అప్పటికీ ప్రభుత్వం నుంచి స్పందన రాకుంటే మీటర్ రీడర్స్ కు న్యాయం జరిగే వరకు సీపీఐ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. అనంతరం ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్య మండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిన్నం పెంచులయ్య బృందం అభ్యుదయ పాటలతో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళి, నగర కార్యదర్శి విశ్వనాథ్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి రాధాకృష్ణ, ఏపీ ఎలక్ట్రిసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ ఏపీఎస్పీడీసీఎల్ అధ్యక్ష కార్యదర్శులు పి.సురేష్ బాబు, జయమని, మీటర్ రీడర్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హజరత్ వళి, కోశాధికారి రమేష్ బాబు, వర్కింగ్ ప్రసిడెంట్ ఆర్.కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# మహిళలు ఆర్థికంగా బలంగా ఉండాలన్నదే సీఎం చంద్రబాబు ఆశయం : నారా భువనేశ్వరి

**కుప్పం,మార్చి 27 మనం న్యూస్ :** ఏపీ ప్రజలకు మళ్లీ ఐదేళ్ల తర్వాత స్వాతంత్ర్యం లభించిందని, కూటమి ప్రభుత్వంలో ప్రజలందరికీ మేలు జరుగుతుందని నారా భువనేశ్వరి అన్నారు. చంద్రబాబు గారి పాలనా సామర్థ్యం గురించి రాష్ట్ర ప్రజలకు తాను ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదన్నారు. పారిశ్రామికవేత్తలు ఏపీలో పెద్దఎత్తున పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొస్తున్నారంటే అందుకు చంద్రబాబు గారిపై ఉన్న నమ్మకమే కారణమన్నారు. 2వ రోజు కుప్పం నియోజకవర్గ పర్యటనలో భాగంగా మోడల్ కాలనీ, కృష్ణదాసపల్లి, జరుగు గ్రామాల్లో నారా భువనేశ్వరి పర్యటించారు. గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం మహిళలతో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమాల్లో నారా భువనేశ్వరి పాల్గొన్నారు.



మహిళలు తమపై తాము నమ్మకం పెట్టుకుని ధైర్యంగా ముందడుగు వేయాలని సూచించారు. ఎన్నికల్లో గెలుపు కోసం కొందరు సాధ్యం కాని హామీలు ఇస్తారు. కానీ చంద్రబాబు చెప్పారంటే చేతల్లో చేసి చూపిస్తారు. ప్రజలు కాస్త ఓపిక పట్టాలి. సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందుతాయి. ఒక ఇండస్ట్రీ తీసుకురావాలంటే అంత ఆషామాషీ కాదు. 2019 తర్వాత చంద్రబాబు అధికారంలోకి వచ్చి ఉంటే ఈపాటికి దేశంలోనే నెంబర్ వన్ రాష్ట్రంగా ఏపీ నిలిచేది. పోలవరం పూర్తయ్యేది. రాష్ట్రాన్ని చంద్రబాబు గారు నిలబెడతారు. రాష్ట్రమంతటా అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ముఖ్యంగా కుప్పం నియోజకవర్గంలో ప్రతి ఇంటికి కుళాయి ద్వారా సురక్షిత నీరు, సోలార్ ప్యానల్స్ ఏర్పాటు సహా అన్ని చర్యలు తీసుకుంటున్నారు. ఇక్కడ నీటి సమస్య తీర్చేందుకు వీలైనంత త్వరగా హంద్రీనీవా పూర్తిచేసి అందరికీ నీరు అందిస్తారు. గత ప్రభుత్వం ఐదేళ్లలో ఏం చేసిందో ప్రజలు,పారిశ్రామివేత్తలకు తెలుసు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గంజాయిపై ఉక్కుపాదం మోపారు.

**డ్వాక్రాతో మహిళల జీవితాల్లో వెలుగులు**

ఇక్కడికి వచ్చిన మహిళలందరికీ ఉగాది, రంజాన్ శుభాకాంక్షలు. మహిళలు ఒకసారి చెబితే చాలు చక్కగా వింటారు. మహిళల్లో నాయకత్వ లక్షణాలు ఉండబట్టే కుటుంబాన్ని తీర్చిదిద్దుతున్నారు. మహిళల కోసం సీఎం చంద్రబాబు అనేక పథకాలు అమలు చేశారు. మహిళలు అన్ని రంగాల్లో మగవారిని మించి విజయాలు సాధించాలని చంద్రబాబు గారు కోరుకుంటూ ఉంటారు. మహిళలు డబ్బు కోసం ఇబ్బంది పడకూడదని, వారు ఆర్థికంగా బలంగా ఉండాలనే ఉద్దేశంతోనే డ్వాక్రా సంఘాలు స్థాపించారు.

ఒకప్పుడు వందా , రెండు వందల కోసం ఇతరులపై ఆధారపడిన స్త్రీలు నేడు బ్యాంకు లావాదేవీలు స్వయంగా చూసుకునే స్థాయికి చేరారంటే అది చంద్రబాబు గారు తీసుకొచ్చిన డ్వాక్రాతోనే సాధ్యమైంది. మగవాళ్లతో సమానంగా ఉద్యోగాలు చేస్తూనే ఇంటి బాధ్యతలు విజయవంతంగా నిర్వర్తిస్తున్నారు. పిల్లల చదువులు చూసుకుంటున్నారు. వ్యాపారంలోకి రాకముందు నేను ఇంటి నుంచి బయటకు రావాలంటేనే సిగ్గుపడేదాన్ని. వచ్చాక నేను ఏమైనా చేయగలను అనే ధైర్యం బిజినెస్ లోకి అడుగుపెట్టాకే వచ్చింది. మీ గౌరవం కోసం మీరు పనిచేయండి. మహిళలు తమ సంపాదనను ముందుగా వారి అవసరాలకు వినియోగించుకోవాలని నారా భువనేశ్వరి అన్నారు.

# తిరుపతి పార్లమెంటు రహదారి సమస్యలకి పరిష్కారం చూపండి

- కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీతో తిరుపతి ఎంపీ గురుమూర్తి బేటీ
- త్వరలోనే తిరుపతి ఇంట్రా మోడల్ బస్ స్టేషన్ నిర్మాణ పనులు ప్రారంభం – గడ్కరీ హామీ

**తిరుపతి, మార్చి 27 మనం న్యూస్ :** తిరుపతి పార్లమెంటు పరిధిలోని జాతీయ రహదారులకు సంబంధించిన సమస్యలు, ఇంట్రా మోడల్ బస్ స్టేషన్ నిర్మాణ పనులు వేగవంతం చేయాలని కోరుతూ తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ మాత్యులు నితిన్ గడ్కరీతో బేటీ అయ్యారు. ఈ సందర్భంగా నాయుడుపేట, తూర్పు కనుపూరు జాతీయ రహదారి -71లో ప్యాకేజ్ 4, వరగలి క్రాస్, తూర్పు కనుపూరు జాతీయ రహదారి-516 డబ్ల్యూ ప్యాకేజ్ 2లో సర్వీస్ రోడ్లు, వెహికల్ అండర్ పాస్ లు మంజూరు చేసి సరైన మౌలిక సదుపాయాలు కల్పించాలని ఎంపీ కోరారు. ఈ రహదారుల్లో రూపొందించిన అండర్ పాస్ ల డిజైన్ కారణంగా ప్రజలకు ఇబ్బందికరంగా ఉందని, ముఖ్యంగా వ్యవసాయ ఉత్పత్తుల రవాణా విషయంలో సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. రైతుల పొలాలలో రహదారులు నిర్మిస్తున్నందున వారికి కనీస మౌళిక సదుపాయాలు కల్పించాలని మంత్రిని కోరారు. రైతులు ప్రదానంగా రహదారికి ఒక వైపు నుంచి మరో వైపుకు తమ వ్యవసాయ ఉత్పత్తులను తరలిచేందుకు, వ్యవసాయ సామగ్రిని తీసుకెళ్లేందుకు అనువుగా సర్వీస్ రోడ్లు, వెహికల్ అండర్ పాస్ లు అవసరం అని ఆయనకి వివరించారు. ఆయా ప్రాంతాలలో రైతులు చేపట్టిన ఆంధోళన కార్యక్రమాల విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. సర్వీసు రోడ్లు, అండర్ పాస్ లు కావాలని రైతులు అందించిన వినతి పత్రాలతోపాటుగా సమగ్రమైన వివరాలను ఆయనకు అందజేశారు. ఈ అంశంపై సానుకూలంగా స్పందించిన గడ్కరీ ఈ రహదారులకు సంబందించి మరోసారి పరిశీలన చేసి సమగ్ర నివేదిక ఇవ్వాలని అదికారులను ఆదేశించారు. తిరుపతి ఇంట్రా మోడల్ బస్ స్టేషన్ నిర్మాణ పనులు ప్రారంభానికి చర్యలు తీసుకోవాలని మంత్రిని కోరగా డిజైన్ లలో స్వల్ప మార్పుల కారణంగా ఆలస్యమైనదని త్వరలో నిర్మాణ పనులు ప్రారంభం అయ్యేలా చర్యలు తీసుకొంటామని ఆయన హామీ ఇచ్చారని ఎంపీ తెలియజేశారు. రేణిగుంట, నాయుడుపేట మధ్య జాతీయ రహదారిపై నుండి సర్వీసు రోడ్లకు ప్రవేశం లేదని, ప్రస్తుత డిజైన్ స్థానిక ప్రజలకు అసౌకర్యంగా ఉందని ఆయనకి వివరించారు. అలాగే ఈ రహదారిపై శ్రీకాళహస్తి నుండి ముచ్చువోలు, వెంకటగిరిల రోడ్డును కలిపేందుకు యాక్సెస్ రోడ్డు, చావలి నుం



# వేగంగా వైజాగ్-చెన్నై- బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్ పెండింగ్ పనులు



- జిల్లా జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ ఆదేశాలు

**తిరుపతి,మార్చి 27 మనం న్యూస్ :** వైజాగ్ చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్, సిబిఐసి అభివృద్ధి పనులకు సంబంధించిన పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక కలెక్టర్ లోని సమావేశ మందిరం నందు జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ డిఆర్ఓ నరసింహులు సంబంధిత అధికారులతో కలిసి వైజాగ్ చెన్నైఇండస్ట్రియల్ కారిడార్ అభివృద్ధి పనులలో భాగమైన పలు ఇండస్ట్రియల్ కారిడార్ నీటి సరఫరా పనులు, రోడ్లు, విషయాలు తదితర అంశాలపై విసిఐసి, రెవెన్యూ, నీటిపారుదల, తదితర శాఖల వారితో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ.. వైజాగ్ చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ అభివృద్ధి పనులకు సంబంధించిన వాటర్ పైప్ లైన్ పెండింగ్ పనులు త్వరిత గతిన పూర్తి చేయాలని ఆదేశించారు. చెన్నై బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్ ప్రాజెక్ట్స్ కు సంబంధించి భూసేకరణ సదరు అంశాలపై అధికారులు దృష్టి పెట్టి త్వరిత గతిన పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గూడూరు సబ్ కలెక్టర్ రాఘువేంద్ర మీనా, సూళ్లూరుపేట ఆర్డీఓ కిరణ్మయి, తిరుపతి ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ విజయ్ భరత్ రెడ్డి సంబంధిత మండలాల తాసిల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

# ఒంటిమిట్ట బ్రహ్మోత్సవాలకు విస్తృత ఏర్పాట్లు

- టిటిడి అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి

**తిరుపతి, మార్చి 27 మనం న్యూస్ :** ఒంటిమిట్టలో శ్రీకోదండరామస్వామివారి ఆలయం వార్షిక బ్రహ్మోత్సవాలకు విస్తృత ఏర్పాట్లు జరుగుతున్నాయని టిటిడి అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి వెల్లడించారు. ఒంటిమిట్టలో జరుగుతున్న పనులను టిటిడి జేఈవో వి. వీరబ్రహ్మంతో కలిసి గురువారం ఆయన పరిశీలించారు.

ఈ సందర్భంగా అదనపు ఈవో మాట్లాడుతూ, ఏప్రిల్ 5వ తేదీ నుండి 15 వ తేదీ వరకు జరగనున్న శ్రీకోదండరామస్వామి వారి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలకు 5వ తేదీ అంకురార్పణ జరగనుందని తెలియజేశారు. ఏప్రిల్ 6వ తేదీ శ్రీరామ నవమి జరగనుండగా, 11వ తేదీ శ్రీసీతారాముల కల్యాణోత్సవం జరగనుందన్నారు. భక్తుల రద్దీ, గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని జిల్లా యంత్రాంగంతో సమన్వయం చేసుకుని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

టిటిడిలోని వివిధ విభాగాల అధికారులు ప్రణాళిక బద్దంగా పనులు చేస్తున్నారని వివరించారు. 2015 నుండి ఒంటిమిట్టలో శ్రీ సీతారాముల కల్యాణం రాష్ట్ర ప్రభుత్వ పండుగగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్వహిస్తోందని, ఏప్రిల్ 11వ తేదీన ముఖ్యమంత్రివర్యులు శ్రీ నారా చంద్రబాబు నాయుడు రాష్ట్ర ప్రభుత్వం తరుపున శ్రీసీతారాముల వారికి పట్టువస్త్రాలను సమర్పిస్తారన్నారు.



కల్యాణ వేదిక వద్ద భక్తుల ప్రవేశ, నిష్క్రమణ మార్గాలలోను, ఆలయ పరిసర ప్రాంతాలలో మరింతగా ఆకట్టుకునేలా పుష్పాలంకరణ, విద్యుత్ అలంకరణలు, భక్తులు వీక్షించేలా ఎల్ ఈడీ స్క్రీన్ లను, అన్నప్రసాదాల పంపిణి, భక్తులకు స్వామివారి తలంబ్రాలు, శ్రీవారి లడ్డూ ప్రసాదం, తాగునీరు, మజ్జిగ అందించేందుకు వీలుగా పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

శ్రీసీతారాముల కల్యాణోత్సవానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేపట్టినట్లు తెలియజేశారు. అంతకుముందు అదనపు ఈవోకు ఆలయ అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. అటు తర్వాత ముఖ్యమంత్రివర్యులు వచ్చే మార్గాలను, ఆలయ పరిసరాలు, కల్యాణవేదిక, క్యూలైన్లు, భక్తులకు ఏర్పాటు చేసిన కౌంటర్లను పరిశీలించారు. అటు తర్వాత జరుగుతున్న అభివృద్ధి పనులను అధికారులతో చర్చించారు.

ఈ కార్యక్రమంలో సిఈ సత్యనారాయణ, ఎస్ఈ (ఎలక్ట్రికల్) వెంకటేశ్వర్లు, ట్రాన్స్ ఫోర్ట్ జీఎం శేషా రెడ్డి, విజిఓలు శ్రీ రామ్ కుమార్, సదాలక్ష్మి, అన్నప్రసాద విభాగం ప్రత్యేకాధికారి జీవిఎల్ ఎన్ శాస్త్రీ, ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

**బ్రహ్మోత్సవాలలో వాహన సేవలు**

06.04.2025 (శ్రీరామ నవమి) - వృషభ లగ్నంలో ఉ. 9.30 - 10.15 గం.ల మధ్య ధ్వజారోహణం, సా.7 గం.లకు శేష వాహనం

07-04-2025 వేణుగాన అలంకారం హంస వాహనం

08-04-2025 వటపత్రసాయి అలంకారం సింహ వాహనం

09-04-2025 నవనీతకృష్ణ అలంకారం హనుమంత వాహనం

10-04-2025 మోహినీ అలంకారం గరుడసేవ

11-04-2025 శివధనుర్భాణ అలంకారం శ్రీ సీతారాముల కల్యాణం (రా 8.30 గంలకు), గజవాహనం.

12.-04-2025 రథోత్సవం

13-04-2025 కాళీయమర్ధన అలంకారం అశ్వవాహనం

14-04-2025 చక్రస్నానం ధ్వజావరోహణం(రా 7 గం)

15-04-2025 --- పుష్పయాగం (సా 6 గం).

# టీటీడీకి రూ.2.45 కోట్లు విరాళం

**తిరుమల,మార్చి 27(మనం న్యూస్):** టీటీడీ నిర్వహిస్తున్న వివిధ పథకాలకు గురువారం రూ.2.45 కోట్లు విరాళంగా అందింది. చెన్నైకు చెందిన జినేశ్వర్ ఇన్ ఫ్రా వెంచర్స్ సంస్థ టీటీడీ ఎస్ వి అన్న ప్రసాదం



ట్రస్టుకు రూ.కోటి విరాళంగా అందించగా, శ్రీలంకకు చెందిన ఓ దాత అన్న ప్రసాదం ట్రస్టుకు మరో రూ.కోటి విరాళంగా అందించారు. నోయిడాకు చెందిన పసిఫిక్ బీపీవో ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ శ్రీ వేంకటేశ్వర ప్రాణదాన ట్రస్టుకు రూ.45 లక్షలు విరాళంగా అందించింది. ఈ మేరకు దాతలు శ్రీవారి ఆలయంలోని రంగనాయకుల మండపంలో టీటీడీ చైర్మన్ బీ.ఆర్.నాయుడు, అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరికి విరాళం డీడీలను అందజేశారు.

# రామ్ చరణ్ మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

- ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

**తిరుపతి, మార్చి 27 మనం న్యూస్:** గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ జన్మదినం సందర్భంగా రుయా ఆస్పత్రి ఆవరణలో తిరుపతి రామ్ చరణ్ యువశక్తి సభ్యులు గురువారం మధ్యాహ్నం అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పేదలకు అన్నదానం పంపిణీ చేశారు. రామ్ చరణ్ ఆయురారోగ్యాలతో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కలియుగదైవం శ్రీవేంకటేశ్వర స్వామిని ప్రార్థించినట్లు ఎమ్మెల్యే ఆరణి తెలిపారు. ఈ కార్యక్రమంలో పగడాల మురళీ, రాజారెడ్డి, బాబ్జీ, కెఎంకే లోకేష్, జీవకోన సుధా, సాయి, వేణు, త్రిలోక్, రుద్రకిషోర్, వెంకీ, తులసి, హేమంత్ కుమార్, రాజేష్ ఆచ్చారి, ఆముదాల తులసి, ప్రభాకర్ రెడ్డి తదితరలు పాల్గొన్నారు.



## కుట్ర

అడవిలో చెట్ల మీద
యధేచ్ఛగా సాగుతున్న వేట
కారణమేంటని రాజ్యాన్ని ప్రశ్నిస్తే...
ఆయుధాలున్నాయన్న అనుమానమంది

ఆయుధాలేవి? అని ప్రశ్నిస్తే....
నేల రాలిన చెట్లను చూపుతున్న రాజ్యం
ఆయుధాలేవని మరోసారి గట్టిగా ప్రశ్నిస్తే



వాటిలోపటున్నాయేమోననే....
మొదల్లకు నరికి వాటిని చీల్చి వేతుకుతున్నామనే
దురుసు సమాధానం

ఏళ్ళు గడిచాయి
చెట్లు నేలరాలిన ప్రాంతంలోనే
తవ్వకాలు చేస్తున్న రాజ్యపు ప్రేమికుడు
అడవినెందుకు తవ్వుతున్నారంటే...
అడవెక్కడుందని ఎదురు ప్రశ్న?
ఆంతరంగికుడికి వంతపాడిన రాజ్యం

ఇద్దరు కలిసిచేస్తున్న గేలి వికట్టహాసానికి
అడవంత ప్రశ్న నా మొఖాన మొలిస్తే...
లోలోనంత గింగిరాలు తిరుగుతున్న సమాధానం
కుట్ర... కుట్ర... కుట్ర... కుట్ర... కుట్ర... కుట్ర

- దిలీప్.వి
8464030808

# ప్లాస్టిక్ కాలుష్యంలో మన వాటా ఎంత!



ప్రపంచ పర్యావరణానికి ప్రజారోగ్యానికి ప్లాస్టిక్ తీవ్ర హాని కల్పిస్తుంది.జీవజాతి మనుగడనే ప్రశ్నార్థకంలోకి నెట్టేస్తున్న ప్లాస్టిక్ భూతం,మానవ జీవితాల్లోకి శరవేగంగా చొచ్చుకొస్తుంది.

ఇంగ్లాండులోని లీడ్స్ యూనివర్సిటీ పరిశోధకులు గత సంవత్సర అధ్యయనం ప్రకారం ప్రపంచంలో ఏటా 25.1 కోట్ల టన్నుల ప్లాస్టిక్ తయారవుతుంది.ఇలా పుట్టుకొచ్చిన ప్లాస్టిక్ వ్యర్థాల నియంత్రణ,సమర్థ నిర్వహణకు ప్రభుత్వాలు చిత్తశుద్ధితో కంకణబద్ధం కావలసిన సమయం ఆసన్నమైంది.ప్రపంచాన్ని ప్లాస్టిక్ కాలుష్యంతో ముంచి వేయటంలో అనేక దేశాల కంటే మన భారతదేశం ప్రపంచంలో మొదటి స్థానంలో ఉంది!. అని ప్రఖ్యాత నేచర్ జర్నల్ తాజా అధ్యయనం తేల్చింది. ఇలా మన తర్వాత స్థానాల్లో నైజీరియా, ఇండోనేషియా, చైనాలు ఆ పాపాన్ని పంచుకుంటున్నాయని,ఈ అధ్యయనాన్ని నిర్వహించిన లీడ్స్ విశ్వవిద్యాలయం పరిశోధకులు వెల్లడించారు.మానవాళికే కాకుండా ఇతర జంతు జాలానికీ, పర్యావరణానికి పెనుముప్పుగా పరిణమిస్తుంది. ఈ పాపంలో మన వాటా ఎక్కువగా ఉన్నందున తగ్గించుకోవడానికి మనం ఏం చేయాలో ఆలోచించుకోవాల్సిన తరుణమిది.ఈ అధ్యయనం మేరకు ఏటా ఉత్పత్తి అవుతున్న ప్లాస్టిక్ లో 5.2 కోట్ల టన్నులకు పైగా సరైన నిర్వహణ లేక బహిరంగ ప్రదేశాల్లో కాల్చివేయటం లాంటి చర్యల ద్వారా వాతావరణంలో కలిసిపోతుంది.ఇలా అనాలోచితంగా బహిరంగ ప్రదేశాల్లో ప్లాస్టిక్ ను కాల్చడంతో విషతుల్యమైన కార్బన్ మోనాక్సైడ్ లాంటి వాయువులు గాలిలో కలుస్తున్నాయి. ఇవి గుండె జబ్బులకు, శ్వాసకోశ వ్యాధులకు, క్యాన్సర్ లాంటి ప్రాణాంతకాలకు, నరాల సమస్యలకు దారితీస్తున్నాయి.అలాగే మితి మీరిన ప్లాస్టిక్ వినియోగంతో మనకు తెలియకుండానే సూక్ష్మ ప్లాస్టిక్ రేణువులు (మైక్రో ప్లాస్టిక్స్) మనల్ని అన్ని వైపులా ఆవహిస్తున్నాయి. పర్వతాలు, అడవులు,రిజర్వాయర్లు,నదులు, సముద్రాల్లో ఇవి చేరిపోతున్నాయి.ఇలా మనం తినే తిండి నుంచి పీల్చే గాలిలో, తాగే నీటిలోనూ ఉంటున్నాయి.

ప్రతి గంటకు సగటున మనం గాలి ద్వారా 11.3 ప్లాస్టిక్ సూక్ష్మ రేణువులు పీల్చుకునే ప్రమాదంలో ఉన్నాము. అంతే కాకుండా పర్యావరణంలోకి ప్రవేశించే ప్లాస్టిక్ కాలుష్య భూతం అత్యంత



ఎత్తైన ఎవరెస్టు నుంచి అత్యంత లోతైన మరియానా ట్రెంచ్ దాకా ప్రతి చోటును ఆవహిస్తోంది. గమ్మత్తేమంటే ప్రపంచంలో అత్యంత అధికంగా ప్లాస్టిక్ ఉత్పత్తి చేసేవి ధనిక దేశాలు.కానీ వాటిలో ఒక్కటి కూడా టాప్ 90 కాలుష్యకారక దేశాల జాబితాలో లేవు. సుమారు 69శాతం ప్రపంచ ప్లాస్టిక్ కాలుష్యం కేవలం 20 దేశాల నుంచి వస్తోంది.ఇవన్నీ అభివృద్ధి చెందుతున్న,పేద దేశాలే కావడం గమనార్హం!.ధనిక దేశాల్లో ప్లాస్టిక్ వ్యర్థాల సేకరణ వాటి నిర్వహణ సమర్థంగా సాగుతుండటమే ఇందుకు కారణంగా అధ్యయనం అభిప్రాయపడుతుంది.భారత దేశంలో ఏటా 58 లక్షల టన్నుల ప్లాస్టిక్ ను కాలుస్తున్నాం. మరో 35 లక్షల టన్నుల ప్లాస్టిక్కు పర్యావరణంలోకి (భూమి,నీరు,గాలిలోకి)వదులుతున్నాం. మొత్తంగా ఏడాదిలో సుమారు 90 లక్షల టన్నులకు పైగా ప్లాస్టిక్ భూతాన్ని ఈప్రపంచంమీదికి వదులుతున్నాం.నైజీరియా(35 లక్షల టన్నులు),ఇండోనేషియా(34 లక్షల టన్నులు), చైనా (28 లక్షల టన్నులు) మన తర్వాత స్థానాల్లో ఉన్నాయి. ప్రపంచంలోనే మిగిలిన రంగాల మాదిరిగానే ప్లాస్టిక్ కాలుష్యంపై కూడా ధనిక దేశాలు, అభివృద్ధి చెందుతున్న దేశాల వాదన భిన్నంగా ఉంది.ప్లాస్టిక్ వ్యర్థాల నియంత్రణ, నిర్వహణ సరిగ్గా చేయడం ప్రధానమని ధనిక దేశాలు వాదిస్తుండగా.. ప్లాస్టిక్ ఉత్పత్తిని,వినియోగాన్ని తగ్గించి ప్రత్యామ్నాయాలు వెతకాలని అభివృద్ధి చెందుతున్న దేశాలు అంటున్నాయి.ఆ మధ్య మన దేశ అత్యున్నత న్యాయస్థానం ఆవేదన వ్యక్తపరచినట్లు.. మనం ప్రస్తుతం ₹ప్లాస్టిక్ బాంబుపై₹ కూర్చున్నాం!.ఆ మహమ్మారిని కట్టడిచేయడంలో విఫలమైతే అణ్వస్త్రాలను మించిన ముప్పును భావితరాలు ఎదుర్కోక తప్పదు.ఇంతటి దుర్భర దుస్థితి దాపురించ కూడదంటే? ఎవరికి వారు ప్లాస్టిక్ వినియోగాన్ని వీలైనంత మేరకు తగ్గించాలి.సంబంధిత వ్యర్థాల సద్వినియోగం పట్ల పాలకులు ప్రతి ఒక్కరూ నేను సైతం అంటూ సామాజిక బాధ్యతతో శ్రద్ధ వహించాలి. ప్రపంచాన్ని వణికిస్తున్న ఈ తీవ్రత దృష్ట్యా ప్లాస్టిక్ భూతానికి ముగింపు పలికేందుకు జరిగిన అంతర్జాతీయ ఒప్పంద రూపకల్పనకు 170 కి పైగా దేశాలు చర్చలు జరిపాయి.

కానీ ఏకాభిప్రాయం కుదరలేదు?.ఆ ఒడంబడిక చిత్తశుద్ధితో ఎంత త్వరగా సాకారమైతే ప్రపంచ జీవజాతుల,మానవ మనుగడకు అంత మంచిది. ప్రమాదకర ప్లాస్టిక్ ప్రత్యామ్నాయాలపై పరిశోధనలకు చేయూతనివ్వాలి. ప్లాస్టిక్ వ్యర్థాలతో రోడ్ల నిర్మాణం ద్వారా ఖర్చు తగ్గిస్తూనే, నాణ్యతను పెంచవచ్చనే విదేశాల అనుభవాలతో పాఠం నేర్చుకోవాలి.ప్లాస్టిక్ వ్యర్థాలతో డీజిల్ ఉత్పత్తిని ప్రోత్సహిస్తే, వ్యర్థాలను సంపద సృష్టికి వినియోగించుకోవచ్చు.ఇలా ప్లాస్టిక్ నియంత్రణ నియమాలన్నీ సక్రమంగా అమలయ్యేలా చేస్తూ దాని వాడకం వల్ల కలిగే సమస్యలపై ప్రజల్లో అవగాహన పెంచాలి.ప్రపంచ,దేశీయ పాలకులు,పాలితులు చిత్తశుద్ధితో కంకణ బద్ధులైతేనే మెరుగైన ఫలితాలు సాధ్యమవుతాయి. అంతే కాదు సాధ్యమైన మేరకు ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించడం, ప్లాస్టిక్ వ్యర్థాలను బహిరంగంగా పారేయకుండా సరియైన నిర్వహణకు అందజేయటం ప్రతి ఒక్కరి బాధ్యత.ఇలా భావితరాల నెత్తిన ప్లాస్టిక్ బాంబు నుండి ప్రభుత్వాలు రక్షణ కల్పించడానికి ప్లాస్టిక్ వ్యర్థాల నియంత్రణ,సమర్థ నిర్వహణకు ప్రభుత్వాలు ఇన్నాళ్ల నిర్లక్ష్యం వీడి చిత్తశుద్ధితో శీఘ్రమే కంకణ బద్ధం కావలసిన తరుణమిది. పొంచి ఉన్న ప్రమాదాన్ని గ్రహించి అవగాహన, చైతన్యం పెంచుకొని ప్రజలు కూడా మేము సైతం అంటూ బాధ్యతగా వ్యవహరించాల్సిందే..

- మేకిరి దామోదర్
9573666650

# సామాన్యుల చెంతకు సంతోషం చేరేనా...!?

ఈ సంవత్సరం వివిధ దేశాలకు ప్రపంచ సంతోష ర్యాంకులు ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ లోని వెల్ బీయింగ్ రిసెర్చ్ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వ హించిన సర్వేలో మన భారతదేశం 118వ స్థానం లో ఉంది. మన స్థాయి ప్రపంచానికి తెలిసింది. మనం ఎంతో అభివృద్ధి సాధించేసేమని,త్వరలో 500 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా రూపాంతరం చెందు తుంది అని తెలుపుతున్న నేటి పాలకుల మాటలకు అర్థాలే వేరులే అన్నట్లు ఈ సంతోష సూచిక ఒక మేలుకొలుపుగా నిలిచింది. మనకు స్వాతంత్ర్యం వచ్చి, సుమారు 78 సంవత్సరాలు పూర్తి అవుతున్నా నేటికీ అందరికీ విద్య, నాణ్య మైన విద్య ఆమడదూరంలో ఉంది. కుల వివక్షత కొనసాగుతూనే ఉంది. ఆర్థిక అసమానతలు రోజు రోజుకు పెరుగుతున్నాయి. మహిళలు పట్ల చిన్న చూపు కొనసాగుతూనే ఉంది. అందుచేతనే మనం గతం కంటే కొన్ని విషయాల్లో మెరుగ్గా ఉన్నా , చాలా విషయాల్లో వెనుకబడి ఉండడం వల్ల సంతోష సూచికలో చాలా వెనుకబడి ఉన్నామని అని తేటతెల్లంఅయ్యింది.

ఆదాయవ్యయాలు, వృద్ధి, వ్యక్తుల మధ్య సంబంధబాంధవ్యాలు, పరస్పర నమ్మకం, ఆత్మ సంతృప్తి, ఆయురారోగ్యాలు, సామాజిక మద్దతు, స్వేచ్ఛ సమానత్వం సౌభ్రాతృత్వం, దానగుణం, అవినీతి స్థాయి వంటి వివిధ అంశాలను పరిగణనలోకి తీసుకుని సంతోష సూచికలు కేటా యిస్తారు...ఈ క్రమంలో మనం 118వ స్థానంలో నిలిచింది. మనకంటే పెద్ద దేశం అయిన చైనా 68వ స్థానంలో నిలిచింది. గొప్పగా చెప్పుకునే అమెరికా 24వ స్థానంలో ఉండుట గమనించ దగిన విషయం. ఇక ప్రపంచంలోనే సంతోష సూచికలో మొదటి స్థానంలో‘ ఫిన్లాండ్‘ నిలువగా, తరువాత స్థానాల్లో డెన్మార్క్, ఐస్ లాండ్, స్వీడన్ నార్వే వంటి దేశాలు ఉన్నాయి. దీనికి ప్రధాన కారణం ఆయా దేశాల్లో విద్యా వైద్యానికి, నైతిక విలువలకు ప్రాధాన్యత ఇవ్వడం తోపాటు ప్రభుత్వాలు ప్రత్యేక నిధులు, శ్రద్ధ వహిస్తారు. దురదృష్టవశాత్తూ మనదేశంలో ఈ విద్యా వైద్య రంగాలను ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేయడం, అర కొరనిధులు మంజూరు చేయడం, లాభసాటి వ్యాపారంగా మార్చివేసి ప్రైవేటీకరణ ప్రోత్స హించడం వలనే మనం ఆర్థిక సామాజిక రాజ కీయ రంగాల్లో వెనుకబడి ఉంటున్నాము.. అంకెలు సంఖ్యలు ర్యాంకులు చూసి మురిసి పోవ డం తప్పా, వాస్తవిక దృష్టితో చూడటం లేదు. ఇక మన ప్రభుత్వాల ప్రాధాన్యత మారాలి. ఎన్నాళ్ళు




ఈ ఉచిత పథకాలు పెంచుకుంటూ పోతారు...!? అధికార కైవసం కోసమే నేటి పాలకులు పనిచేస్తున్నారు తప్ప, ప్రజలను స్వయం సమృద్ధి సాధించేందుకు కృషి చేయడం లేదు. స్వాతంత్ర్యం వచ్చి 77 సంవత్సరాల అయినా, రోజు రోజుకు పేదరికం, నిరుద్యోగం పెరుగుతుంది. దిగుమతు లు పెరగడం సర్వసాధారణం అయిపోయింది. కేవలం దేశంలో ఉన్న కార్పోరేట్ వ్యక్తులు, సంస్థలను పెంచి పోషించేందుకు ఈ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పనిచేస్తున్నాయి. లక్షల కోట్ల రూపా యలు మాఫీ చేయడం జరుగుతుంది. ప్రజల సంపద దోచిపెడుతున్న పరిస్థితి... ఇటు వంటి పరిస్థితుల్లో మన సంతోష సూచికలో మొదటి వరుసలో ఎలా చేరుకుంటాం అనే ప్రశ్నకు ఇకనైన సమాధానం వెతకాలి.

ముఖ్యంగా మన దేశంలో ఉన్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విద్యా వైద్య రంగాలకు ప్రాధాన్యత ఇవ్వాలి. రాజ్యాంగ ఆశయాలు లక్ష్యాలు చేరుకు నేందుకు ప్రయత్నాలు చేయాలి. అవినీతి పై ఉక్కు పాదం మోపాలి. పర్యావరణాన్ని రక్షించాలి. ప్రకృతి వనరుల దోపిడికి అడ్డుకట్ట వేయాలి. సెక్యులర్ భావనతో పాలన చేయాలి. సామ్యవాద వ్యవస్థ ఏర్పాటు చేయడానికి సన్నాహాలు చేయాలి. మతోన్మాద శక్తులను నియంత్రించాలి. అందరికీ సమాన అవకాశాలు కల్పించేందుకు కృషి చేయాలి. ప్రజల్లో సమభావం కల్పించాలి. ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకోవడం కోసం పరితపించాలి. పార్యాంశాల్లో నైతిక, మానవ విలువలు జోడించాలి. అక్రమాలను అరికట్టాలి. ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలి. ఓటు బ్యాంకు రాజకీయాలకు స్వస్తి పలకాలి. కనీస అవసరాలు తీర్చే ప్రయత్నం చేయాలి. నేటికీ ముఖ్యంగా గిరిజన ప్రాంతాల్లో విద్యా వైద్య సౌకర్యాలు లేవు. త్రాగునీరు లేదు. రహదారులు లేవు. విద్యుత్, రవాణా సౌకర్యాలు లేవు అంటే అతిశయోక్తికాదు. ఇటువంటి పరిస్థితుల్లో‘ సంతోషం అందరికీ ఎలా చేరువవుతుంది. దాదాపు యనభై కోట్ల మందికి సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. అయినా పేదరికం వెంటాడుతూనే ఉంది..కనీసం మూడు పూటలా తిండి తినే పరిస్థితి నేటి పాలకులు అందించే విధంగా చర్యలు చేపట్టాలి. అంతేగానీ, అధికారం కోసం పాకులాడే పథకాలు అమలు చేస్తూ కాలం గడపరాదు.డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ చెప్పినట్లు అభివృద్ధి అంటే అద్దాల మేడలు, నాలుగు రహదారులు, ఆరు భవ నాలు కాదు అని ఇకనైనా పాలకులు గ్రహించాలి. ప్రజలు అందరికీ విద్య వైద్యం, కనీస అవసరాలు లభించేలా చేయడం ద్వారానే సంతోషం మన సొంతం అవుతుంది అని గ్రహించాలి... ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించి, ప్రజలు స్వయం సమృద్ధి సాధించేందుకు ప్రభుత్వాలు ప్రయత్నాలు ముమ్మరం చేయాలి. వివక్షతలు, అసమానతలు లేని సమాజ స్థాపనకు నేటి పాలకులు శ్రీకారం చుట్టాలి. అప్పుడు మాత్రమే ‘ సర్వేజనా సుఖినో భవంతు’ అనే నానుడి నిజంచేస్తూ, సకల జనులు సంతోషంగా ఉండగలరు...

- ఐ. ప్రసాదరావు
9948272919

# విశ్వానికి మార్గం చూపిన న్యూటన్

‘నేను చీకట్లో కూర్చొని,చీకటిని తిట్టుకోవడం కన్నా,చిన్న దీపం వెలిగించే ప్రయత్నం చేస్తాను.విజయం నన్ను తప్పక వరిస్తుందనే’ విషయాన్ని నమ్మి,తన కష్టాలను లెక్కచేయకుండా ఎంతో శ్రమపడి, నేడు ప్రపంచం గర్వించదగ్గ శాస్త్రవేత్తగా ‘సర్ ఐజాక్ న్యూటన్‘ ఎదిగాడు. ప్రపంచానికి విశ్వ రహస్యాలను విప్పి చెప్పిన ‘సర్ ఐజాక్ న్యూటన్‘ ఒక భౌతిక, గణిత, ఖగోళ శాస్త్రవేత్త మరియు తత్వవేత్త. ప్రకృతి సిద్ధమైన తత్వశాస్త్రం సైన్సుగా ఎలా పరిణామం చెందిందన్న అంశంపై చేసిన ఎనలేని కృషికిగానూ ఆధునిక ప్రపంచం అంతా ఆయనను ‘సైన్సు పితామహుడి’ని చేసింది. 1643వ సంవత్సరంలో జనవరి 4 వ తేదీన నవమాసాలు నిండ కుండానే జన్మించిన చిన్నారి, పెరిగి పెద్దయి ప్రపంచంలోనే మేటి శాస్త్రవేత్తల్లో ఒకరిగా పేరు తెచ్చుకున్నారు. ఆ బక్కచిక్కిన చిన్నారే ‘సర్ ఐజాక్ న్యూటన్‘. ఈ రోజు అంతరిక్షంలోకి రాకెట్లలో వెలుచున్న, శాస్త్రపరిజ్ఞానంలో అన్ని విషయాలు తెలుసుకో గలుగుతున్నామంటే అందుకు ముఖ్యంగా ‘న్యూటన్ గమన నియమాలు‘ ఆధారం. విశ్వ రహస్యాలను మానవాళికి విశ్లేషించి చెప్పిన న్యూటన్ ఇంగ్లండుక్కు దగ్గర్లోగల ‘ఉల్తోప్‘ అనే గ్రామంలో ఒక రైతు కుటుంబంలో జన్మించాడు. న్యూటన్ జన్మించిన సమయంలో అతను నెలలు నిండక మునుపే పుట్టడం వలన పసికందుగా ఉన్నపుడు న్యూటన్ చాలా బరువు తక్కువగాను, బలహీనంగాను ఉండేవాడు. చూసినవాళ్లంతా అసలీ శిశువు బ్రతుకుతాడా లేదా అనుకున్నారు. న్యూటన్ తండ్రి, న్యూటన్ జననానికి మూడు నెలల ముందు మరణించడం,న్యూటన్ తన తల్లి దగ్గర 3 సంవత్సరాల వయస్సు వరకు పెరగడం, తరువాత ఆమె ‘బార్ స్మిత్‘ అనే వ్యక్తిని రెండవ వివాహం చేసుకోవడం వల్ల న్యూటన్ తన చిన్నతనంలో తన తల్లితండ్రుల ప్రేమ కోల్పోయి తన అమ్మమ్మ-తాతల వద్ద పెరగవలసి వచ్చింది. న్యూటన్ తన బలహీనమైన ఆరోగ్యం వలన ఆటల వైపు ఎక్కువగా ఆసక్తి చూపించక, చాలా తక్కువగా మాట్లాడుచు, ఎక్కువగా ఆలోచించే వాడు.న్యూటన్ చిన్నప్పుడు తరగతి గది చదువుకంటే ఇతర సైన్సు పుస్తకాలు చదవటం, పెద్ద వస్తువుల్ని చూసి వాటినే చిన్న సైజులో తయారు చేస్తూ చిన్న చిన్న మిషన్లు , నీటి గడియారం, ఎండలో పనిచేసే గడియారంలాంటివి కూడా ఆయన తయారు చేశాడు. ఆయన చేతిలో రూపుదిద్దుకున్న ఈ వస్తువులన్నీ ఇప్పటికీ ‘లండన్ రాయల్ సొసైటీ మ్యూజియంలో‘ ఉన్నాయి.



ఉన్నత చదువుల కొరకు స్కాలర్షిప్ అవసరమని గ్రహించిన న్యూటన్,స్కాలర్ షిప్ కోసం ఎంత ప్రయత్నించినా, మార్కులు తక్కువ వచ్చిన కారణంగా స్కాలర్షిప్ పొందలేక పోయాడు. అయినప్పటికి యూనివర్సిటీ బోర్డు సభ్యులు ఆయనకు నాలుగు సంవత్సరముల వరకు స్కాలర్షిప్ ఇచ్చి,తనకు నచ్చిన అంశాలపై పరిశోధించడం కోసం ప్రోత్సాహం వచ్చినందున చాలా సంతోషించాడు. ఈ వచ్చిన అవకాశాన్నివీలైనంత సద్వినియోగం చేసుకోవాలని న్యూటన్ నిశ్చయించుకొని, పూర్తి సమయం ‘లెక్కలు మరియు భౌతిక శాస్త్రం‘ అభ్యాసానికే వినియోగించాడు. న్యూటన్ యూనివర్సిటీలో గ్రీకు, లాటిన్, హిబ్రు భాషలను, లాజిక్, జ్యామితి మరియు త్రికోణమితి లాంటి విషయాలను నేర్చుకుంటూ , గొప్ప శాస్త్రవేత్తల గురించి బాగా చదివేవాడు.

న్యూటన్ 1661 లో ఉన్నత విద్య కోసం కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయంలో చేరి గణిత, భౌతిక, ఖగోళ శాస్త్ర పరిశోధనలపై ఉన్న మక్కువతో అక్కడే ప్రొఫెసర్గా నియమితుడయ్యాడు. 1667లో ‘పరావర్తన దూరదర్శినిని‘ నిర్మించి సంచలనం సృష్టించి, చిన్నతనంలో చెట్టు నుంచి రాలిన యాపిల్ను గమనించిన న్యూటన్ అందుకు కారణాన్ని అన్వేషించే క్రమంలో ‘గురుత్వాకర్షణ సిద్ధాంతాన్ని‘ ప్రతిపాదించి, ‘న్యూటన్ మూడు గమన నియమాలుగా‘ ప్రసిద్ధిగాంచిన గొప్ప విషయాలను కూడా ప్రపంచానికి అందించి,భౌతిక శాస్త్ర భావనలను వివరిస్తూ ‘ప్రిన్సిపియా మేథమేటికా‘ అనే గ్రంథాన్ని కూడా రచించాడు. న్యూటన్ 1969లో ట్రినిటీ కాలేజిలో ఉండే సమయంలో తన ఆలోచనలను రాసుకున్న పుస్తకాలను పరిశీలిస్తే, ఆ పుస్తకాలు ఇప్పటికీ ఎంతో ముఖ్యమైనవిగా గుర్తించబడ్డాయి. న్యూటన్ 1665 లో ‘కేంబ్రిడ్జి యూనివర్సిటీ‘ నుండి ‘బాచిలర్ డిగ్రీ‘ పొంది, ప్లేగు వ్యాధి వలన కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయం రెండు సంవత్సరాల పాటు మూసివేసినందున, న్యూటన్ ‘ఊల్స్ తోర్ప్‘ కు తిరిగి వచ్చి భౌతిక మరియు గణిత శాస్త్ర అధ్యయనంలో రెండు సంవత్సరాల కాలం గడిపారు. ఈ కాలంలో, రకరకాల పరిశోధనలు చేశాడు. అదే సంవత్సరంలో న్యూటన్ ‘ప్రిన్సిపియా‘ అని ఒక సంకలనం తయారు చేశారు. అది న్యూటన్ యొక్క మహత్తర పుస్తకంగా, 1687 లో ప్రచురించబడినది.న్యూటన్ కు 1672లో ‘రాయల్ సొసైటీ ఫెలోషిప్‘ లభించింది. అప్పటి వరకూ ప్రకృతి శాస్త్రంలో ఒక భాగంగా ఉన్న భౌతిక శాస్త్రాన్ని న్యూటన్ ఆవిష్కరణలు, సిద్ధాంతాల వల్ల ప్రత్యేక శాస్త్రంగా గుర్తించారు. అందుకే న్యూటన్ను ‘భౌతిక శాస్త్ర పితామహుడు‘ అంటారు. 1705లో బ్రిటిష్ ప్రభుత్వం ‘సర్‘ అని బిరుదునిచ్చి సత్కరించింది. ఇక అప్పటినుంచి ఐజాక్ న్యూటన్ , ‘సర్ ఐజాక్ న్యూటన్గా‘ మారిపోయారు. అనేక సందర్భాలలో అతను ఇరవై నాలుగు గంటలలో పద్దెనిమిది లేదా పందొమ్మిది గంటలు అధ్యయనంలో గడిపేవారు. రాయల్ సొసైటీ అధ్యక్షుడు ‘రాబర్ట్ హుక్‘ 1703 లో మరణించినందున అప్పుడు ప్రొఫెసర్ న్యూటన్ నూతన అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. న్యూటన్ అద్భుతమైన రచయిత, అతను అనేక శాస్త్రీయ మరియు అశాస్త్రీయ విషయాల మీద ఎన్నో పుస్తకాలను రాశాడు.ప్రొఫెసర్ న్యూటన్ జీవితం మొత్తం భౌతిక శాస్త్రం మరియు గణిత శాస్త్ర సేవలకే అంకితం చేశారు. లక్ష్యం వైపు ప్రయాణం చేస్తున్నప్పుడు మధ్యలో ఎన్ని అడ్డంకులు వచ్చిన,కష్టాలు వచ్చిన మార్గం మరియు గమ్యం మార్చకూడదనే నియమాన్ని నమ్మి నేడు విశ్వవ్యాప్తంగా వెలుగొందుచున్న సర్ ఐజాక్ న్యూటన్ ‘మార్చి 20, 1727’న మనలను విడనాడి వెళ్లిపోయాడు. ఆయన కృషి ... న్యూటన్ జీవితం,న్యూటన్ ప్రయోగాలు మానవ మనుగడ ఉన్నన్నాళ్లు సజీవం..ఆదర్శం.

- గడప రఘుపతిరావు
9963499282

# తెలంగాణ ఆహార సంస్కృతి



కోటి విద్యలు కూటి కొరకే అంటారు. మని షి శరీర పోషణకు ఆహారం ఎంతో ఆవశ్యకం. మనిషి యొక్క ఆరోగ్యం కూడా తీసుకునే తాము తీసుకునే ఆహారం పైనే ఆధార పడి ఉంటుంది. అయితే ఆహా రానికి సంస్కృతికి అవినాభావ సంబంధం ఉంటుంది. ఒక ప్రాంతం యొక్క భౌగోళిక పరిస్థితులపై ఆహార ఉత్పత్తి, ఆహారపు అలవాట్లు ఆధారపడి ఉంటాయి. ఉత్తర భారతదేశం లోని ఆహార పదార్థాలకు గోధుమ ముఖ్యమైనది. అయితే దక్షిణ భారతదేశంలోని ఆహారాలకు వరి ముఖ్య మయినది. అందులోనూ తెలంగాణా ప్రాంతం యొక్క ఆహార సంస్కృతి, వంటకాలు ప్రత్యేకమై నవి. పూర్వీకుల నుండి వస్తున్న సాంప్రదాయ వంటకాలను పరిశీలిస్తే అందులో మొదటిది సర్వపిండి. బియ్యంపిండి, పల్లీలు, పప్పు, నువ్వు లు, కరివేపాకు, ఉప్పు, కారం మొదలైనవి వేసి తక్కువ నూనె ఉపయోగించి చేస్తారు. ఇది మంచి పౌష్టకాహారం. తెలంగాణలో వంట పాత్రలను ‘సరవ’ అంటారు. ఈ సరవలకు పిండి పెట్టి చేస్తారు కాబట్టే సర్వపిండి అని అంటారు. దీనిని గిన్నెపిండి అని కూడా అంటారు. ఇక ఉప్మాను పోలి ఉండే మరొక వంటకం ఉప్పుడు పిండి. ఉప్పిట్టు అనే కన్నడ పదం నుండి ఉప్పిడి పిండి అనే పదం



రూపాంతరం చెందింది. ఇడ్లీని పోలి ఉండే వంటకం కుడుములు. నువ్వులు,ˊఎల్లీలు, కుడుక, ఏవైనా గింజ ధాన్యాలు ఏవైనా వేసి వెరైటీలు చేస్తారు. ఆవిరి మీద ఉడికిస్తారు కాబట్టి సులభంగా జీర్ణం అవుతుంది. తెలంగాణకు చెందిన సాంప్రదాయ చిరుతిండి రైల్ పలారం. బియ్యం పిండిని నీటితో మెత్తగా కలిపి నూనెలో వేయించి, పప్పు, ఉల్లిపాయ, కొబ్బరి, ఉప్పు, కారం వేసి బాగా కలిపి చిన్న చిన్న బాల్స్ చేసి ఆవిరిపై ఉడికిస్తారు. దీనిని రైలు ప్రయాణం చేసేటపుడు తీసుకువెళ్లే వారు కాబట్టి రైల్ పలారం అనే పేరు వచ్చింది అని అంటారు. వడ్లతో తయారయ్యే ప్యాలాలు (మురమురాలు) మరో ప్రత్యేకం. ఉత్తర తెలంగాణ లో వేయించిన ప్యాలాలు చిరుతిండి అయితే దక్షిణ తెలంగాణలో పచ్చి ప్యాలాలు (ఉగ్గని)- పూర్వపు మహబూబ్ నగర్ ప్రాంతం ప్రజలు అల్పాహారంగా తీసుకుంటారు. అటుకులు - పోహా చేసినట్లు ఉగ్గానీ తయారు చేస్తారు. పొద్దున నాష్టాకు తయారు చేసే వంటకం అట్లు. వీటిని కూడా బియ్యం పిండితోనే తయారు చేస్తారు. ఇవి చూస్తేనే నోరూరిస్తూ ఎంతో రుచికరంగా ఉంటాయి. వీటితో పాటు సూక్ష్మ పోషకాలైన సజ్జలు,రాగులు,మక్కలతో రొట్టెలు చేస్తారు. ఏ కూర వేసుకొని తిన్నా రుచికరంగా ఉంటుంది. ఇక పండుగలు వస్తే చేసే అప్పాల గురించి చెప్పాల్సిన అవసరం లేదు. సకినాలు,గారెలు,అరిసెలు,కారప్పూస,గరిజెలు,లడ్డాలు,మురుకులు అన్నీ వేటికవే సాటి. ఇక ఎంత చిన్న దావత్ అయినా గూడాలు (గుగ్గిళ్ళు) ఉండాల్సిందే. మక్క గుడాలు, బొబ్బర్ల గుడాలు మొదలైనవి. చికెన్,మటన్,బోటి వేసి చేసిన గుడాలు మాంసప్రియులు బాగా ఇష్టపడుతారు. అంటు పులుసు, పచ్చిపులుసు,సల్ల చారు జీర్ణ క్రియను మెరుగు పరుస్తాయి. వర్షాకాలం మొదలైతు న్నపుడు చేసుకునే మక్క గారెలు మరో అద్భుతమైన వంటకం. కారం గారెలు, తీపి గారెలుగా రెండు రకాలుగా చేసుకోవచ్చు. తెలంగాణాలో అతి పెద్ద పండుగ అయిన బతుకమ్మ పండుగకు వివిధ రకాలైన ధాన్యాలతో సత్తు పిండి చేస్తుంటాము. వీటి వల్ల శరీరానికి సూక్ష్మ పోషకాలు అందుతాయి. పండుగ ఏదైనా పాశం వండుకోవడం పరిపాటి బెల్లం,పాలు,నెయ్యి వేసి చేసే పాశపన్నం అమృత సమానం. మల్లన్న బోనాలు, శివరాత్రి ఒక్క పొద్దు విచినపుడు అన్ని కూరగాయలు కలిపి వండే కల్లెగూర (కల్లెగలపుల కూర) ఎంతో రుచికరంగా ఉండడమే కాకుండా ఆరోగ్య దాయకం. ఇలా చెప్పుకుంటూ పోతే మన తెలంగాణ రుచులు ఎన్నో ..ఎన్నెన్నో!

- బొల్లం బాలకృష్ణ
9989735216

## శాంతి పూల వసంతం.!!



రమజాన్ మాసం రాకడతో
మనస్సు వెలుగు పూలు
పూసింది
ఆత్మానందంతో పాటు
పరిశుద్ధతా పరిమళం
వెదజల్లింది.
ధ్యానంతో ఆత్మబలం పెరిగి,
విశ్వాసం పురివిప్పి
నాట్యమాడింది
శాంతి ప్రేమ కరుణ జాలి
దయ
ప్రవాహంలా పరుగులు
తీసింది.

హృదయాల్లో భక్తి భావం
మొలకెత్తి,
మస్తిష్కాల్లో చిగుర్లు తొడిగింది.
మాటల్లోని మంచితనం
చేతలలో నిరూపితమైంది.
రమజాన్ పుణ్య కాలంలో
విస్తారమవుతున్న ప్రేమ
రమజాన్ కాని కాలంలోనూ
కరుణతో తొణికిసలాడాలి
హృదయ సీమ.
పవిత్రతకు ప్రాధాన్యమిచ్చి,
అనైతికతకు వీడ్కోలు పలకాలి
క్రోధాన్ని నివారించి
సమాధానంగా జీవించాలి.
ప్రేమ, సహనం, మంచీ,
మానవత
ఇదే రమజాన్ సారం
కాంతిలా శాంతితో మన
జీవితం



సాగిపోవాలి కలకాలం.
మనదారిలో ఆధ్యాత్మికత
మన ప్రేమలో మానవత
ప్రవక్తల పథం మనకు ప్రేరణ
రమజాన్ శిక్షణ మనకు ధారణ
సదఖ, ఫిత్రా, జకాతులతో
నిరుపేద గాయాలకు మలాం
సమాజంలో మానవీయ
పరిమళాలు వెదజల్లే
రమజాన్ దివ్య మాసమా నీకు
సలాం!!

- యండి. ఉస్మాన్ ఖాన్

ఎడిట్ పేజీ కోసం మీ సామాజిక విశ్లేషణలు, సాహిత్య వ్యాసాలు
manamlekhalu@ gmail.com మెయిల్ అడ్రస్‌కు పంపగలరు. – ఎడిటర్

# అడ్మిషన్లు ఫుల్ సిబ్బంది నీల్



**కర్నూలు, మార్చి 27 (మనం న్యూస్) :** ప్రభుత్వ నిబంధనలు పాటించని బీఈడీ కాలేజీలను సీజ్ చేయాలి ఏఐవైఎఫ్ రాయలసీమ యూనివర్సిటీకి అనుబంధంగా ఉన్న బీఈడీ కళాశాలలో అడ్మిషన్లు ఫుల్, సిబ్బంది నీల్ అన్ని చందంగా ఉన్నాయని ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హత కలిగిన లెక్చలర్ నియమించుకొని వారికి ఆన్లైన్లో జీతాలు చెల్లించాలని నిబంధన ఉన్నప్పటికీ కేవలం పేపర్లలో మాత్రమే సిబ్బందిని చూపిస్తూ నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించకుండా లక్షలకు లక్షలు ఫీజులు దండుకుంటున్న బీఈడీ కాలేజీ యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని అఖిల భారత యువజన సమాఖ్య ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో రాయలసీమ విశ్వవిద్యాలయ రిజిస్టర్ విజయ్ కుమార్ గారికి వినతిపత్రం సమర్పించారు ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కె శ్రీనివాసులు, నగర కార్యదర్శి బిసన్న మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలు ప్రకారం ప్రవేట్ బిఈడి కాలేజీలకు అనుమతి ప్రభుత్వ నిబంధన ప్రకారం నడుచుకుంటామని ప్రభుత్వం నుండి అనుమతి తీసుకొని ప్రభుత్వం నిబంధనలు తుంగలో తొక్కుతూ ఇష్టా రాజ్యాంగ వ్యవహరిస్తూ ఉన్న యూనివర్సిటీ అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు ప్రభుత్వ నిబంధనల ప్రకారం 100 విద్యార్థులు ఉన్న ప్రతి బీఈడీ కాలేజీ 16 మంది లెక్చలర్స్ ను నియమించుకొని వారికి ఆన్లైన్లోనే జీతాలు చెల్లించాలని నిబంధన ఉన్నప్పటికీ కేవలం పేపర్ల పైన సిబ్బందిని ఏర్పాటు చేసుకొని వెరిఫికేషన్ సమయంలో పేపర్లలపైన ఉన్నవారిని కాలేజీకి తెలుసుకొని వారికి 10,వేలు రూపాయలు మాత్రమే చెల్లించి వెరిఫికేషన్ అయిపోయిన తర్వాత వారిని గాలికి వదిలేస్తున్నారు అన్నారు రాయలసీమ యూనివర్సిటీకి అనుబంధంగా ఉన్న 45 ప్రైవేట్ బిఈడి కళాశాలలో ప్రభుత్వ నిబంధన పగడ్బందీగా అమలు చేస్తే జిల్లాలో దాదాపు 1,000 మంది నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు దొరుకుతాయని, కానీ యూనివర్సిటీ అధికారుల పర్యవేక్షణ లోపం వల్ల బీఈడీ కాలేజీల యాజమాన్యం అధ్యాపకులను నియ మించు కోకుండా ఇష్ట రాజ్యాంగం వివరిస్తున్నాయని బీఈడీ కాలేజీ యాజమాన్యాలు స్పాట్ అడ్మిషన్ల పేరుతో వేరే రాష్ట్రాల విద్యార్థులను జాయిన్ చేసుకుంటూ వారు కళాశాలకు రాకున్నా, అటెండెన్స్ లేకున్నా, రికార్డులు రాయకున్నా, బ్లాక్ టీచింగ్ చెప్పకపోయినా పర్వాలేదు యాజమాన్యం అడిగినంత డబ్బు చెల్లిస్తే వారు పాస్ అయిపోతున్నారని యూనివర్సిటీ అధికారులు ప్రవేట్ బిఈడి కాలేజీ యాజమాన్యాలు చెబుతున్న ప్రకారం నడుచుకోవడం వల్ల ఇంకా అధ్యాపకులతో అవసరంలేదు అన్నట్టుగా ప్రవేట్ బీఈడీ కాలేజీ యాజమాన్యాలు వ్యవహరిస్తున్నాయి అన్నారు ప్రతి బీఈడీ కాలేజీలో 16 మంది అధ్యాపకులను నియమించుకొని వారికి ఆన్లైన్లోనే జీతాలు చెల్లించే విధంగా చర్యలు తీసుకుంటే దాదాపు 1000 మంది నిరుద్యోగులకు జిల్లాలో ఉపాధి అవకాశాలు దొరుకుతాయని యూనివర్సిటీ అధికారులు ఆ వైపున చర్యలు తీసుకోవాలని అధ్యాపకులు లేని ప్రవేట్ బిఈడి కాలేజీలను వెంటనే సీజ్ చేయాలని వారు డిమాండ్ చేశారు లేనిపక్షంలో ఏఐవైఎఫ్ గా యూనివర్సిటీ అధికారుల నిర్లక్ష్యానికి వ్యతిరేకంగా ప్రభుత్వ నిబంధనలు అమలు చేయలేని బీఈడీ కళాశాల యాజమాన్యాలకు వ్యతిరేకంగా ఉద్యమిస్తామని వారు హెచ్చరించారు కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నగర నాయకులు. అఖిల్ శివ తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టులకు టోపీలు పంపిణీ




**కర్నూలు మార్చి 27(మనం న్యూస్) :** కర్నూలు :కర్నూలు కలెక్టర్ కార్యాలయంలోని సమాచార భవన్ నందు అల్ వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జర్నలిస్టులకు టోపీలు పంపిణీ చేసిన అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బి ఆనంద్ కుమార్. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జర్నలిస్టులు ఎండా నాక వాననక న్యూస్ కవరేజ్ నిమిత్తం ఆరోగ్యాన్ని కూడా లెక్క చేయకుండా న్యూస్ కవరేజ్ నిమిత్తం జర్నలిస్ట్ లు వెళ్తుంటారని, ఈ వేసవికాలంలో ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉం డటం వలన జర్నలిస్టులు వడదెబ్బ తగలకుండా ఉండాలనే ఆలోచనతో మా ఆల్ వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో టోపీలు పంపిణీ చేయడం జరిగిందన్నారు. కర్నూలు జిల్లాలోనే కాకుండా మిగతా నియోజకవర్గాల్లో కూడా పంపిణీ చేస్తామని ఆయన అన్నారు. అనంతరం సీనియర్ జర్నలిస్టులు మీసాల రామస్వామి, మాట్లాడుతూ ఈ వేసవి కాలంలో జర్నలిస్ట్ అల్ వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షులు బి ఆనంద్ కుమార్ జర్నలిస్ట్ లకు టోపీలు పంపిణి చెయ్యడం చాలా శుభ పరిణామమని, ఈ సం దర్భంగా అసోసియేషన్ వారికి శుభాకాంక్షలు తెలి యజేశారు.రవి, వలి, రంగస్వామి, శివశంకర్, సురేష్, రమేష్,తదితర జర్నలిస్టులు పాల్గొన్నారు.

## జామియా మసీదులో ఇఫ్తార్ విందులో పాల్గొన్న మంత్రి టీజీ భరత్



**కర్నూలు మార్చి 27(మనం న్యూస్):** కర్నూలు నగరంలోని గడియారం ఆస్పత్రి సమీపంలో ఉన్న జామియా మసీదులో రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా ఆయన ముస్లిం సోదరులతో కలిసి మసీదుకు వెళ్లారు. రోజా ఉపవాస దీక్షలు చేస్తున్న ముస్లిం సోదరులకు పండ్లు తినిపించి ఉపవాస దీక్ష విరమింప చేశారు. అనంతరం నిర్వహించిన ప్రార్థనలో ఆయన పాల్గొన్నారు. రంజాన్ నెల ముస్లింలకు ఎంతో పవిత్రమైనదన్నారు. ముస్లిం సోదర సోదరీమణులు రంజాన్ పండుగను సంతోషంగా జరుపుకోవాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు మంత్రి చెప్పారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు. అనంతరం గడ్డ వీధిలో టిడిపి నాయకులు ఏర్పాటుచేసిన ఇఫ్తార్ విందులో మంత్రి పాల్గొన్నారు.

## వైసిపి అభ్యర్థి ఉప సర్పంచ్‌గా ఏకగ్రీవ ఎన్నిక



**గడివేముల, మార్చి 27(మనం న్యూస్):** గడివేముల మండలంలోని పెసరవాయి గ్రామంలో గురువారం నాడు ఈవో ఆర్ డి మహేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఉప సర్పంచ్ ఎన్నిక నిర్వహించారు. గ్రామపంచాయతీలో జరిగిన ఉపసర్పంచ్ ఎన్నికలలో రెండో వార్డుకు చెందిన మంజుల వెంకటసుబ్బయ్యకు ఉప సర్పంచ్ గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 9వ వార్డు సభ్యురాలు కురువ తిరుమలమ్మ ప్రతిపాదించగా నాలుగో వార్డు సభ్యుడు శ్రీకాంత్ రెడ్డి బలపరిచారు. వైసిపి చెందిన అభ్యర్థి మంజుల వెంకటసుబ్బయ్య ఉప సర్పంచ్ గా ఏకగ్రీవంగా ఎన్నుకోవడంతో ఈవోఆర్డి మహేందర్ రెడ్డి డిక్లరేషన్ ఫారం అందించారు. గత ఉపసర్పంచ్ సాయి సుధా రాజీనామా చేయడంతో ఈ ఎన్నిక నిర్వహించినట్లు ఈ ఓ ఆర్ డి మహేందర్ రెడ్డి తెలిపారు. ఉప సర్పంచ్ గా ఏకగ్రీవంగా ఎన్నికైన మంజుల వెంకటసుబ్బయ్యకు వైసిపి నాయకులు శ్రీకాంత్ రెడ్డి అభినందించారు. ఈ ఎన్నికలలో ఎక్కడ ఎటువంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా పాణ్యం సీఐ కిరణ్ కుమార్ రెడ్డి గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

## 4 పార్కింగ్ ప్రదేశాలకు బహిరంగ వేలంపాట

- నగరపాలకకు రూ.16.03 లక్షల ఆదాయం
- అనివార్య కారణాలతో 2 ప్రదేశాల వేలంపాట వాయిదా



**కర్నూలు మార్చి 27 (మనం న్యూస్):** నగరంలో వివిధ ప్రాంతాల్లో వాహనాల పార్కింగ్ ప్రదేశాలకు నగరపాలక కమిషనర్ యస్.రవీంద్ర బాబు అధ్వర్యంలో గురువారం బహిరంగ వేలంపాట నిర్వహించారు. స్థానిక ఎస్బిఐ ఎంప్లాయిస్ కాలనీలోని కౌన్సిల్ హాల్లో ప్రశాంతంగా వేలంపాటలు ముగిసాయి. మొత్తం 6 పార్కింగ్ ప్రదేశాలకు బహిరంగ వేలంపాట నిర్వహించాల్సి ఉండగా, అనివార్య కారణాల వల్ల రెండింటికీ వాయిదా పడ్డాయి. వినాయక ఘాట్ పార్కింగ్ ప్రదేశానికి ఎవరు పాట పాడటానికి ముందుకు రాకపోగా, నగరపాలక సంస్థ కార్యాలయంలోని పార్కింగ్ ప్రదేశానికి అనివార్య కారణాలతో వాయిదా వేశారు. మిగిలిన 4 పార్కింగ్ ప్రదేశాల వేలంపాట ద్వారా నగరపాలకకు రూ.16.03 లక్షల ఆదాయం సమకూరింది. కార్యక్రమంలో అదనపు కమిషనర్ ఆర్.జి.వి. క్రిష్ణ, ఆర్ఓ జునైద్, సూపరింటెండెంట్ వాజిద్, ఆర్ఐలు తిప్పన్న, ఖలీల్, సుహైల్, డిపిఓ వినోద్, వందన, తదితరులు పాల్గొన్నారు.

ప్రదేశాలను దక్కించుకున్న లీజుదారులు..

1. కింగ్ మార్కెట్ కూరగాయల మార్కెట్ పార్కింగ్ ప్రదేశానికి ధరవత్తు రూ.6.35 లక్షలు నిర్ణయించగా, అత్యధికంగా పాట పాడి జి.యం.డి. ఖాజిం హుస్సేన్ రూ.6.80 లక్షలతో పార్కింగ్ ప్రదేశాన్ని దక్కించుకున్నారు.

2. కింగ్ మార్కెట్ పక్కనున్న చేపల మార్కెట్ పార్కింగ్ ప్రదేశానికి ధరవత్తు రూ.1.35 లక్షలు నిర్ణయించగా, అత్యధికంగా పాట పాడి టి.జి. రమేష్ బాబు రూ.1.45 లక్షలతో పార్కింగ్ ప్రదేశాన్ని దక్కించుకున్నారు.

3. కిడ్స్ వరల్ పార్కింగ్ ప్రదేశానికి ధరవత్తు రూ.3.95 లక్షలు నిర్ణయించగా, అత్యధికంగా పాట పాడి వై.రామ్చరణ్ రూ.4.15 లక్షలతో పార్కింగ్ ప్రదేశాన్ని దక్కించుకున్నారు.

4. శ్రీనివాస క్లాత్ మార్కెట్ వద్ద పార్కింగ్ ప్రదేశానికి ధరవత్తు రూ.3.24 లక్షలు నిర్ణయించగా, అత్యధికంగా పాట పాడి వై.రామ్చరణ్ రూ.3.63 లక్షలతో పార్కింగ్ ప్రదేశాన్ని దక్కించుకున్నారు.

## అక్రమ కలప రవాణ పై కొరడ

- కలప వ్యాపారులకు దడ
- రాజకీయ నాయకులకు భయపడని ఫారెస్ట్ అధికారి




**నవాబుపేట, మార్చి 27 (మనం న్యూస్):** తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా చెట్ల పెంపకం పై కోట్లాది రూపాయలు ఖర్చు చేసి గ్రామాలలో చెట్లు మొక్కల పెంపకం పై ప్రజలకు అవగాహన కల్పిస్తూ భవిష్యత్తు తరాలకు భవిష్యత్తు అవసరాలకు, అనుగుణంగా చెట్లను పెంచాలని దృఢ సంకల్పంతో వృక్షో రక్షితి రక్షితః అనే నానుడిని ప్రజలకు తెలియజేస్తూ చెట్ల పెంపకం పై అవగాహన కల్పిస్తున్నారు. మహబూబ్ నగర్ జిల్లాలో ఇయన పేరు వింటే కలప మాఫియాకు దడ పుట్టిస్తున్నారు.ఇయనే ఎఫ్ ఆర్ వో చంద్రయ్య 2018 మార్చి మహబూబ్ నగర్ జిల్లాకు బదిలీపై వచ్చారు. గతంలో మాజీ మంత్రి అండదండలతో కొంతమంది కలప వ్యాపారులు విచ్చలవిడిగా కలపను రవాణా చేస్తుంటే,ఎఫ్ ఆర్ ఓ కల్పను అడ్డుకొని కేసులు నమోదు చేశారు. ఎన్నో రాజకీయాల ఒత్తిడి వల్ల ఆ అధికారిని ట్రాన్స్ఫర్ చేయాలని ఉద్దేశంతో కొంతమంది అధికారులు కుమ్మక్కై చాలా ఇబ్బందులకు గురి చేశారని తెలిసింది. ఎంతటి రాజకీయ నాయకుల ఒత్తిళ్లకు లొంగకుండా తిరిగి మహబూబ్ నగర్ ఫారెస్ట్ లోనే ఎఫ్.ఆర్.వో గా విధులు నిర్వహిస్తున్నారు. అనంతరం 2018 మార్చి నుండి 2025 మార్చి వరకు ఒక కోటి 60 లక్షల కేసులు నమోదు చేశానని ఆయన గురువారం మన న్యూస్ కు తెలిపారు . జిల్లాలో అనుమతి లేకుండా అక్రమ కలపను రవాణా చేస్తుంటే, సమాచారం మేరకు వాటిని అడ్డుకొని కేసులు నమోదు చేశారు. అక్రమ కలప వ్యాపారుల దగ్గర డబ్బులు తీసుకుని కలపను వదిలేస్తున్నారని ఒక పత్రికలో వచ్చిన కథనానికి వాస్తవం లేదని అన్నారు. తనను బ్లాక్ మెయిల్ చేస్తూ ఒక పత్రిక రిపోర్టర్ డబ్బులు డిమాండ్ చేశారని, ఇవ్వని ఎడల తనపై పత్రికల్లో కించపరిచే విధంగా అవాస్తవాలుగా వార్తలు రాశారని ఆరోపించారు. మహమ్మదాబాద్ పరిధిలో అక్రమంగా కలప రవాణ జరిగితే చర్యలు తీసుకోవాలి. మహబూబ్ నగర్ ఫారెస్ట్ ఆఫీస్ ఫోటో వేసి తమను బ్లాక్ మెయిల్ శారని తెలిపారు. 34 ఏళ్ల సర్వీస్ లో నేను చేసిన మంచి పనులను ఓర్వలేక ఇబ్బందులకు గురి చేస్తున్నారని తెలిపారు. ఒక పత్రికలో చంద్రయ్య వాటా ఎంత? అని రాశారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. నా వాటా ఎంత ఉందో నిరూపించాలని ఆయన ఘాటుగా ప్రశ్నించారు. ప్రతి మండలానికి ఒక బీట్ ఆఫీసర్, ఒక సెక్షన్ ఆఫీసర్ ఉంటారు కానీ, క్షేత్ర స్థాయిలో పని చేసే అధికారులతో పూర్తి గా సమాచారం తీసుకోకుండానే రేంజ్ ఆఫీసర్ పై వార్తలు రాశారని, వాస్తవాలు నిరూపించకపోతే వారిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తానని తెలిపారు. ఏదైనా వార్తలు రాసే ముందు సంబంధిత అధికారులతో వివరాలు తెలుసుకోవాలని అన్నారు. బ్లాక్ మెయిల్ చేస్తూ అధికారులను గురి చేస్తే చట్ట పరమైన చర్యలకు నిర్ణయాలు తీసుకుంటాని అన్నారు.

## 50శాతం వడ్డీ రాయితీకి విశేష స్పందన

- నగరపాలక అదనపు కమిషనర్ ఆర్జీవి కృష్ణ వెల్లడి
- రెండు రోజుల్లో రూ.3.80 కోట్లు పన్ను వసూళ్లు
- వడ్డీ రాయితీ వినియోగానికి మిగిలింది మూడు రోజులే
- శివారు ప్రాంతాల ప్రజల సౌకర్యార్థం ప్రత్యేక కౌంటర్లు



**కర్నూలు, మార్చి 27 (మనం న్యూస్) :** రాష్ట్ర ప్రభుత్వం ఆస్తి పన్నుపై వన్టైమ్ సెటిల్మెంట్కు కల్పించిన 50% వడ్డీ రాయితీ అవకాశానికి నగర ప్రజలు పెద్దసంఖ్యలో సద్వినియోగం చేసుకుంటున్నారని, గడిచిన రెండు రోజులుగా నగర ప్రజల నుండి విశేష స్పందన లభిస్తోందని నగరపాలక అదనపు కమిషనర్ ఆర్.జి.వి. క్రిష్ణ వెల్లడించారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక పత్రిక ప్రకటన విడుదల చేశారు. ఆస్తి పన్ను మొత్తం రూ.66.39 కోట్లు వసూలు అవ్వగా, కేవలం బుధ, గురువారాల్లో ఆస్తి, ఖాళీ స్థలాల పన్నులు, తాగునీటి కొళాయి చార్జీలు రూ.4 కోట్లు వసూలు అయిందన్నారు. జనవరి 19 నుండి మార్చి 24 వరకు విస్తృతంగా నిర్వహించిన స్పెషల్ డ్రైవ్ ద్వారా రూ.15.58 కోట్లు వసూలు చేశామని, 50శాతం రాయితీ రెండు రెండు రోజుల్లో రూ.3.80 కోట్లు వసూలు అవ్వడం సరికొత్త రికార్డు నమోదు చేసిందన్నారు. నగరాభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తున్న ప్రజల బాధ్యతాయుతం అభినందనీయమన్నారు. పన్ను చెల్లింపునకు ప్రజలు నగరపాలక కార్యాలయానికే కాకుండా ఇంటి నుంచైనా చెల్లించవచ్చని, స్థానిక సచివాలయం, ప్రత్యేక కౌంటర్లు, మీ సేవ, ఆన్లైన్ కేంద్రాల్లో సైతం పన్నులను చెల్లించవచ్చని అదనపు కమిషనర్ సూచించారు.

## కౌతాళంలో ముగిసిన వేలంపాట



**కౌతాళం, మర్చి 27 (మనం న్యూస్):** కౌతాళం కేంద్రమైన పంచాయతీకి రికార్డు స్థాయిలో ఆదాయం వచ్చింది. వేలంల్లో గత ఏడాది పంచాయతీకి రూ.3,31,750లక్షలు ఆదాయం రాగా, ఈ ఏడాది రూ.11,70,000లక్షలు ఆదాయం ఎక్కువగా వచ్చినట్లు గ్రామ సర్పంచ్ పాల్ దివాకర్,డీఎల్పీవో నూర్జహాన్, ఈఆర్డి యోగేశ్వర్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి ప్రకాశం,శివప్ప తెలిపారు.గురువారం మేజర్ పంచాయతీ కార్యాలయంలో వేలాలు నిర్వహించారు. బండి మెట్టను సంకబేరి రాజు రూ.11,70,000లక్షలకు,కబేళాను ఏరిగేరి సబిమ్మ రూ.10,5000, దినసరి మార్కెట్ ఏరిగేరి సబిమ్మ 15,000దక్కించుకున్నట్లు డీఎల్పీవో నూర్జహాన్ తెలిపారు.ఈ ఏడాది కౌతాళం మేజర్ పంచాయతీకి రికార్డు స్థాయిలో రూ.11,70,000లక్షలు ఆదాయం వచ్చినట్లు తెలిపారు. పంచాయతీ వేలాల్లో టీడీపీ, వైసీపీ, ఇతరు నాయకులు పోటీగా పాల్గొన్నారు.ఎలాంటి అవాం ఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ అశోక్ కుమార్,గట్టిబందోబస్తు నిర్వహించారు.

## ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

**భీంగల్, మార్చి 27 (మనంన్యూస్):** నిజామాబాద్ జిల్లా భీంగల్ మండలం లోని బడా భీంగల్ గ్రామంలో ఉదయం 6 గంటల, ప్రాంతంలో బడా భీంగల్ శివారులో కప్పల వాగు నుండి అక్రమంగా ఇసుక తరలిస్తునారు. నమ్మదగిన సమాచారం మేరకు భీంగల్ పోలీస్ వారు అక్కడికి వెళ్ళగా పోలీసులను చూసి పారిపోతున్నా ట్రాక్టర్లను ఎల్లమ్మ గుడి దగ్గర మొత్తం 4-ట్రాక్టర్లను పట్టుకొని వారి దగ్గర వివరాలు అడుగగా ఎలాంటి పత్రాలు లేకుండా అక్రమంగా తరలిస్తునారని ట్రాక్టర్ లను సీజ్ చేసి పోలీస్ స్టేషన్ కి తరలించారు.కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించడంజరిగిందని ఎస్ఐ మహేష్ తెలిపారు.

## జుక్కల్ లో పదవ తరగతి క్వశ్చన్ పేపర్ లీక్

- మాల్ ప్రాక్టీస్ యత్నం కేసులో ఎనిమిది మంది అరెస్ట్
- అరెస్ట్ అయినా వారిలో ఇద్దరు విలేకరులు
- పరారీలో మరో ముగ్గురు
- వివరాలు వెల్లడించిన జిల్లా ఎస్పీ




**కామారెడ్డి, మార్చి 28 ( మనంప్రతినిధి):** గణితంలో వెనుకబడి ఉన్న తన కొడుకును ఎలాగైనా పాస్ చేయించాలనుకున్న తండ్రి ఆరాటం కొడుకుతో పాటు పలువురిని కటకటాల పాలు చేసింది. కామారెడ్డి జిల్లాలో ఈ ఘటన చోటు చేసుకుంది. కామారెడ్డి జిల్లా జుక్కల్‌లో మాల్ ప్రాక్టీస్‌కు యత్నించిన ఘటనలో 11 మందిపై కేసు నమోదైంది. వీరిలో ముగ్గురు పరారీలో ఉన్నారు. అరెస్టు చేసిన ఎనిమిది మందిలో ఇద్దరు విలేకరులు కూడా ఉన్నారు. కేసుకు సంబంధించిన వివరాలను ఎస్పీ రాజేష్ చంద్ర గురువారం మీడియాకు వివరాలు వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. జుక్కల్ జిల్లా పరిషత్ పాఠశాల పరీక్ష కేంద్రంలో గణితం పరీక్ష రాస్తున్న ఓ విద్యార్థికి సబ్జెక్టు సరిగ్గా రాదు. దీంతో విద్యార్థి తండ్రి పాఠశాలలో వాటర్ సప్లయ్ చేస్తున్న ఓ వ్యక్తితో మాటలతో మచ్చిక చేసుకుని.. అతనికి ఓ తెల్ల కాగితం ఇచ్చి తన కొడుకు వివరాలు చెప్పి ప్రశ్నలను రాసుకుని రావాలని పంపించాడు. తెల్ల కాగితాన్ని సదరు వ్యక్తి విద్యార్థికి ఇచ్చాడు. కాసేపటికి 5 ప్రశ్నలతో కూడిన కాగితాన్ని ఆ విద్యార్థి సదరు వ్యక్తి అందించాడు.

అతను ఆ కాగితాన్ని తిరిగి విద్యార్థి తండ్రికి ఇచ్చాడు. అనంతరం విద్యార్థి తండ్రి ఆ పేపర్‌ను గ్రామ పంచాయతీ కారోబార్‌కు ఇచ్చి జవాబులు తేవాలని చెప్పాడు. ఆ పేపర్‌ను ఫొటో తీసుకున్న కారోబార్ అక్కడే ఉన్న విలేకరికి పంపించాడు. అలాగే ఆ పేపర్ కారోబార్ నుంచి ఓ యూట్యూబ్ రిపోర్టర్‌కు చేరగా అతని నుంచి మరో రిపోర్టర్‌కు వాట్సాప్‌లో పంపారు. సదరు విలేకరి ఆ పేపర్‌ను ఓ క్లిప్పింగ్ తయారు చేసి లోకల్‌గా ఉన్న డిజిటల్ మీడియా గ్రూపులో షేర్ చేశాడు.

తర్వాత ఓ మైనర్ బాలుడు పరీక్ష కేంద్రానికి వెళ్లి మరొక మైనర్ బాలుడి ఫోన్ నుంచి ప్రశ్నలతో కూడిన పేపర్‌ను ఫొటో తీసి కారోబార్‌కు పంపించి డిలీట్ చేశారు. పోలీసులు ఈ విషయాన్ని గుర్తించి ప్రశ్నలు బయటకు వెళ్లకుండా విచారణ చేపట్టి ఆరుగురు నిందితులను అరెస్ట్ చేశారు. కాగా.. ఓ యూట్యూబ్ ఛానల్ విలేకరితో పాటు వాట్సప్ గ్రూప్ అడ్మిన్, మరో మైనర్ పరారీలో ఉన్నారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ నర్సింహారెడ్డి, ఎస్బీ సీఐ తిరుపతి పాల్గొన్నారు.

## ఆర్టీసీ డిప్యూటీ రీజినల్ మేనేజర్‌గా మధుసూదన్



**నిజామాబాద్, మార్చి 27(మనంన్యూస్):** నిజామాబాద్ ఆర్టీసీ డిప్యూటీ రీజినల్ మేనేజర్ గా బాధ్యతలు నిర్వర్తించిన డిప్యూటీ రీజినల్ మేనేజర్ ఎన్. సరస్వతి బదిలీపై రంగారెడ్డి రీజియన్, హైదరాబాద్ మరియు డిప్యూటి రీజినల్ మేనేజర్ (ఎం). వి. శంకర్ బదిలీపై హైదరాబాద్ రీజియన్ వెళ్లగా వారి స్థానంలో నూతన నిజామాబాద్ ఆర్టీసీ డిప్యూటీ రీజినల్ మేనేజర్, గా .ఎస్. మధుసూదన్ బాధ్యతలు స్వీకరించారు. దీంతో జిల్లాలోని డిపో మేనేజర్లు తోపాటు కార్యాలయం సిబ్బంది డిప్యూటీ రీజినల్ మేనేజర్ గా బాధ్యతలు చేపట్టిన మధుసూదన్ కు శుభాకాంక్షలు తెలియజేశారు.

# పేరుకే పెద్ద డాక్టర్లు...

## ఇలా వస్తారు అలా వెళ్ళిపోతారు

- **విధులు నిర్వహించేది మాత్రం మెడికో విద్యార్థులు,ఎస్సార్లే..**

నిజామాబాద్, మార్చి 26(మనంప్రతినిధి): నిజామాబాద్ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి కోట్లాది రూపాయలు వెచ్చించి ప్రైవేట్ ఆస్పత్రికి దీటుగా 7ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో మెరుగైన వైద్య సేవలు అందించాలని నిర్మాణం చేపట్టారు. ప్రతిరోజు ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి వేల సంఖ్యలో రోగులు చికిత్స నిమిత్తం తెలంగాణ మహారాష్ట్ర తో పాటు కర్ణాటకలోని జిల్లాకు ఆనుకుని ఉన్న ఆసుపత్రికి ఎంతో నమ్మకంతో మెరుగైన వైద్యం కోసం వస్తున్నారు. ముఖ్యంగా అన్ని రకాల సంబంధించిన పెద్ద పెద్ద డాక్టర్లు నిజామాబాద్ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ఉంటారని ఎంతో నమ్మకంతో వస్తే మాత్రం ఇక్కడ పేరుకే పెద్ద డాక్టర్లు ఇలా వస్తున్నారు అలా వెళ్ళిపోతున్నారు. దిక్కుతోచక ఇక్కడ వైద్యులు చెప్పే విధంగానే సర్దుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని రోగులు రోగి బంధువులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిజానికి గతంలో ఉన్న సూపర్డెంట్ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలోనీ అన్ని విభాగాలకు సంబంధించిన హెచ్వోడి... ఆర్ ఎం ఓ... తోపాటు ఫిజీషియన్, సర్జన్, పీడియాట్రిక్, గైనకాలజిస్ట్, పలమాలజిస్ట్, సైకియాట్రిస్ట్, ఆర్థోపెడిక్ న్యూరాలజిస్ట్, రేడియాలజిస్ట్, పాతలోజిస్ట్ తో పాటు వివిధ విభాగాల సంబంధించిన వైద్యులతో ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేసుకొని ఈ విభాగాలకు సంబంధించిన రోగులు చికిత్స నిమిత్తం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి వస్తే తక్షణమే మెరుగైన వైద్య సేవలు అందించాలని ప్రత్యేకంగా సలహాలు సూచనలు ఇవ్వడం జరిగింది. కానీ నూతనంగా ప్రభుత్వ జనరల్ గా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలోని ఏ ఒక్క పెద్ద





ముఖ్యంగా నిజామాబాద్ మెడికల్ కళాశాలలో ప్రొఫెసర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ అసోసియేట్ ప్రొఫెసర్ వంటి పెద్ద పెద్ద హోదాలో పెద్ద డాక్టర్లు అని చెప్పుకుంటూ బోర్డు ప్రతి విభాగంలో తమ వంతు కేటాయించుకున్నారు. ఏ ఒక్కరోజు కూడా వారికి కేటాయించిన పెద్ద డాక్టర్ల తమ తమ విభాగమైన ఆ కుర్చీ కూర్చుండేందుకు తీరిక లేకుండా పోతుంది. ఒకవైపు రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశాలు జారీ చేస్తుంటే నిజామాబాద్ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రులు మాత్రం పెద్ద డాక్టర్ల పనితీరు ఇష్ట రాజ్యాంగా మారింది. మేమే పెద్ద డాక్టర్లము మాకు ఎవరు అడుగుతారని.... ప్రశ్నిస్తారు... మేము చెప్పిందే వేదం... మేము పెన్ను పెట్టకుంటే వైద్యమే జరగదు.... రోగి బంధువులు చికిత్స చేయాలని ప్రశ్నించిన.... ఎదురించిన తిక్కతిక్క మాట్లాడితే అందరు డాక్టర్లు ఆసుపత్రిలో వైద్య సేవలతో పాటు విధులు బహిష్కరించి. పోలీసులకు కంప్లైంట్ చేసి నిరసన కార్యక్రమం చేపడతామని భయాందోళన గురి చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం.. అంతేకాకుండా నిజామాబాద్ ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ లో వైద్యులకు తిరగబడితే నిజామాబాద్ జిల్లా నే కాకుండా హైదరాబాద్లోని ఏ ఆసుపత్రిలో కూడా మీకు వైద్యం జరగకుండా చూసే దమ్ము మాకు ఉందని రోగి బంధువులకు ఘాటుగా వైద్యులు సమాధానం చెప్పడంతో రోగులు రోజు బంధువులు ఎక్కడ మాకు వైద్యం అందకుండా ఈ వైద్యులు చేస్తామని కరుకొండ గా చెప్పడంతో ఏమి పెద్ద డాక్టర్లైన ప్రొఫెసర్,అసిస్టెంట్ ప్రొఫెసర్,అసోసియేట్ ప్రొఫెసర్లు, తమ విభాలకు సంబంధించిన గదులకు హెచ్ ఓ డి లు అని తమ పేరుతో కూడుకున్న పలకలు బ్రహ్మాండంగా బిగిస్తున్నారు. ఏ ఒక్కరోజు కూడా ఆ గదులను తెరిచి కూర్చున్న దాఖలాలు లేవు. వారానికి ఒకసారి ఇలా రావడం రిజిస్టర్లు అన్ని సంతకాలు ఒకటే రోజు చేయడం అలా వెళ్ళిపోవడం జరుగుతుందని విశ్వసనీయ సమాచారం. ముఖ్యంగా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో అత్యవసర సమయంలో శస్త్ర చికిత్సలు, మెరుగైన వైద్య సేవలు అందుతాయని ఆసుపత్రికి వస్తే మాత్రం రోగులకు రోగి బంధువులకు నిరాశే మిగులుతుంది.. ఇదే ఆస్పత్రిలో గతంలో ప్రైవేట్ ఆస్పత్రికి దీటుగా అన్ని రకాల శస్త్ర చికిత్సలు జరిగిన దాఖలాలు ఉంటే ప్రస్తుతం మాత్రం ఇక్కడ అలాంటి ఆపరేషన్లు జరగడంలేదని,, ఆ శస్త్ర చికితకు సంబంధించిన ఆధునిక పరికరాలు అందుబాటులో లేవని, అంతేకాకుండా ప్రత్యేక నిపుణులైన వైద్యులు నియామకం చేయలేదని, రోగి బంధువులకు సమాధానం ఇస్తూ చేతులు దులుపుకుంటున్నారు. మీకు ఇలాంటి శస్త్ర చికిత్సలు జరుపుకోవాలని ఉంటే హైదరాబాద్లోని ఉస్మానియా హాస్పిటల్ గాంధీ హాస్పిటల్, లేదా నిమ్స్ హాస్పిటల్ కు వెళ్లాలని సలహాలు సూచనలు ఇస్తున్నారు. మీ దగ్గర డబ్బులు ఉంటే మాత్రం ఎలాంటి ఆలస్యం చేయకుండా ప్రైవేట్ ఆస్పత్రికి మెరుగైన వైద్యం అందాలంటే అది ఒకటే మార్గమని కరఖండుగా ప్రభుత్వ ఆసుపత్రులు వైద్యులు చెబుతున్నారు.

ఇలాంటి శస్త్రత చికిత్సలు చేయడానికి అవకాశం ఉన్నప్పటికీ ప్రత్యేక నిపుణులైన వైద్యులు అందుబాటులో లేకపోవడంతో నిజామాబాద్ మెడికల్ కళాశాలకు అనుబంధం ఉన్న ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ఉన్నత వైద్య శిక్షణ పొందుతున్న ఎస్సార్లు, మెడికో వైద్య విద్యార్థులు మాత్రం వారికి తోచినంత వైద్య పరిజ్ఞానంతో వైద్య చికిత్సలు అందజేస్తున్నారు. అందులో కొందరైతే ఎస్ ఆర్ లు, జూనియర్ డాక్టర్లు రోగులకు సరైన రీతిలో స్పందితకపోవడంలో పూర్తిగా నిర్లక్ష్యం చేస్తూ ఇష్టం వచ్చినట్లు మాట్లాడడం రోగులతో పాటు రోగి బంధువులపై పై ఆగ్రహం వ్యక్తం చేయడం వంటి సంఘటనలు జరుగుతున్నాయి. పెద్ద డాక్టర్లే ఆ తిరుగు ఉంటే నేను చేసేది ఏమైనా ఉందా అని ఈరోజు ఇక్కడ ఉంటాం మా ట్రైనింగ్ కాలం ముగిసిన తర్వాత ఎక్కడికో వెళ్ళిపోతాం నీతోటి మాకు సంబంధం ఏంది అని ఎస్ ఆర్ లాంటి వైద్యులు ఘాటుగా సమాధానం ఇస్తూ రోగుల తోపాటు రోగి బంధువులపై ఒక డాక్టర్ వృత్తిలో ఉండి రౌడీలాగా వ్యవహరించడం జరుగుతుంది. మీరు ఏం చేసుకుంటారో చేసుకోండి.....మేము ఇంతే.... మేము ఇలాగే ఉంటాం... అంత మా ఇష్టమే. ట్రీట్మెంట్ చేసుకుంటే చేసుకోండి లేకుంటే వెళ్లిపోండి అని ఎస్సార్ వైద్యులతో పాటు జూనియర్ డాక్టర్ల మాట తీరు రోగితో తో పాటు రోగి బంధువులకు చాలా ఇబ్బందికరంగా మారుతుంది. ఎవరైనా ఆవేదనతో ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సూపర్డెంట్ గాని సంబంధిత అధికారులకు గాని ఫిర్యాదు చేయడానికి పోతే పట్టించుకునే నాధుడే లేడు. ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో పెద్ద వైద్యులతో పాటు చిన్న చిన్న వైద్యులు కూడా ఇష్టం వచ్చినట్లు రోగులతో గొడవలకు దిగుతుంటే ఇక రోగులకు మెరుగైన వైద్య సేవలు ఎక్కడ అందుతాయని రోగులు నిరాశ చెందుతున్నారు. ఇంత పెద్ద ఆస్పత్రి అయిన ఏ ఒక్కరోజు కూడా జిల్లా మంత్రి గానీ, జిల్లా ఎంపీ, అర్బన్ ఎమ్మెల్యే తో పాటు జిల్లా కలెక్టర్ కూడా ఆకస్మిక తనిఖీలు చేయకపోతే పెద్దపెద్ద డాక్టర్ల ఇష్టం వచ్చినట్లుగా డ్యూటీలు చేస్తూ 30 రోజులు పూర్తి కాగానే విధులకు హాజరు కాకపోయినా చివరి చివరి రోజు విధులకు హాజరై రిజిస్టర్లలో నెలరోజుల సంతకాలు ఒకేరోజు చేసి లక్షల రూపాయలు వేతనాన్ని దర్జాగా అందుకుంటున్నట్లు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలోని వైద్య సిబ్బంది తోపాటు కిందిస్థాయి సిబ్బంది చర్చించుకుంటున్నారు. మరికొందరైతే పెద్దపెద్ద డాక్టర్ల పని తీరుపై సామెతలుగా పేరుకే పెద్ద డాక్టర్..... ఏ ఒక్క రోజు కూడా పని చేయడు...... పుణ్యానికి జీతం అయితే తీసుకుపోతాడు అని బహిరంగానే ప్రభుత్వ ఆసుపత్రిలోని ప్రతి ఒక్కరు సంభాషించుకుంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి సంబంధం కలిగి ఉన్న మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ గాని, జిల్లా కలెక్టర్, జిల్లా మంత్రి తోపాటు ఎంపీ ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి వైద్యుల పనితీరుపై దృష్టి సారించి రోగులకు సకాలంలో మెరుగైన వైద్య సేవలు అదే విధంగా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

# సెర్ప్ లక్ష్యాల సాధనకు కట్టుదిట్టమైన చర్యలు

- **పంచాయతీరాజ్ కార్యదర్శి**

కామారెడ్డి, మార్చి 27 (మనంప్రతినిధి): సెర్ప్ సంస్థ నిర్దేశించుకున్న లక్ష్యాల సాధనకు కట్టుదటమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ కార్యదర్శి లోకేష్ కుమార్ అన్నారు. గురువారం రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ కార్యదర్శి, సెర్ప్ కార్యక్రమాల పై సెర్ప్ సీఈఓ డి. దివ్య తో కలిసి జిల్లా కలెక్టర్ లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ కార్యదర్శి మాట్లాడుతూ., యాసంగి మార్కెటింగ్ సీజన్ లో సెర్ప్ ద్వారా ఏర్పాటు చేయబోయే ఐకెపి కొనుగోలు కేంద్రాల సంఖ్య గణనీయంగా పెంచాలని రాష్ట్ర ముఖ్య మంత్రి నిర్ణయించారని తెలిపారు. ప్రస్తుతం 33 శాతం ఉన్న ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఈ సీజన్ నుంచి 50 శాతానికి పెంచేలా ప్రతిపాదనలు తయారు చేయాలని అన్నారు. జిల్లాలలో ఇతర శాఖల ద్వారా ఏర్పాటు చేసే కొనుగోలు కేంద్రాలు చేయలేని పక్షంలో ఆ కేంద్రాలను ఐకెపి లకు బదిలీ చేయాలని, అదనపు వరి ధాన్యం దిగుబడి నేపథ్యంలో నూతన కేంద్రాల ఏర్పాటు సైతం స్వశక్తి మహిళా సంఘాలచే ప్రారంభించాలని కలెక్టర్ లకు తెలిపారు. ఐకెపి కొనుగోలు కేంద్రాలకు అవసరమైన తేమ శాతం యంత్రాలు, ప్యాడి క్లీనర్లు, వేయింగ్ యంత్రాలు, ఇతర సామాగ్రి అందించాలని అన్నారు. నూతనంగా ఏర్పాటు చేసే కొనుగోలు కేంద్రాల మహిళా సంఘాల సభ్యులకు అవసరమైన శిక్షణ అందించాలని అన్నారు. కొనుగోలు కేంద్రాల ఏర్పాటు చేసినందుకు పౌరసరఫరాల శాఖ నుంచి రావాల్సిన కమీషన్ మహిళా సంఘాలకు అందడం లేదని దీనిపై జిల్లా స్థాయిలో కలెక్టర్లు సమీక్ష నిర్వహించి పెండింగ్ కమీషన్ చెల్లింపులు పూర్తయ్యేలా చూడాలని, గన్ని బ్యాగులు రీకన్సిలేషన్ ప్రక్రియ చేపట్టాలని అన్నారు. స్వశక్తి మహిళా సంఘాలచే రైస్ మిల్లుల ఏర్పాటు ప్రణాళికలు తయారు చేయాలని అన్నారు. పౌర సరఫరాల శాఖ, సెర్ప్ సమన్వయంతో భారత ఆహార సంస్థకు బియ్యం సరఫరా చేసే దిశగా కార్యాచరణ తయారు చేసుకోవాలని అన్నారు. దివ్యాంగులకు యూ.డి.ఐ.డి. కార్డుల జారీ ప్రక్రియ వేగవంతం చేయాలని అన్నారు. జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా సమీక్షించి దివ్యాంగులకు నిర్ధారణ పరీక్షల నిర్వహణ కోసం స్లాట్ బుకింగ్ ప్రక్రియ




ప్రారంభించాలని అన్నారు. నిర్ధారణ క్యాంపుల నిర్వహణ కోసం ఆసుపత్రిలో అవసరమైన సదుపాయాల కల్పనకు ప్రతిపాదనలు సమర్పించాల ని కలెక్టర్ లకు సూచించారు. దివ్యాంగులకు ప్రభుత్వ కార్యాలయాల్లో అవసరమైన వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని, అవసరమైన నిధులు విడుదల చేయడం జరుగుతుందని అన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ మాట్లాడుతూ., కామారెడ్డి గతంలో 27 కొనుగోలు కేంద్రాలు ఉండగా, ప్రస్తుతం మరో 156 కేంద్రాలను ప్రభుత్వ ఆదేశాల మేరకు పెంచడం జరుగుతుందని తెలిపారు. ఆయా కొనుగోలు కేంద్రాలకు కావలసిన ఎక్విప్మెంట్ సమకూర్చాలని తెలిపారు. పెట్రోల్ బంక్ ఏర్పాటుకు అనువైన భూములను గుర్తించాలని రెవిన్యూ, గ్రామీణాభివృద్ధి అధికారులను కలెక్టర్ ఆదేశించారు. తొలుత ఒక పెట్రోల్ బంక్ ఏర్పాటుకు సత్వర చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ (రెవిన్యూ) వి.విక్టర్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సురేందర్, ఎల్డీఎం రవికాంత్, జిల్లా సహకార అధికారి రామ్ మోహన్, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ రాజేందర్, జిల్లా పౌరసరఫరాల అధికారి మల్లికార్జున్ బాబు, మెప్మా పిడి శ్రీధర్ రెడ్డి, గ్రామీణాభివృద్ధి, శిశు సంక్షేమం, జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్, తదితరులు పాల్గొన్నారు.

# ఏప్రిల్ 11లోగా అసెంబ్లీ ఆవరణలో పూలే విగ్రహాన్ని ఏర్పాటు చేయండి

- **యూపీఎఫ్, తెలంగాణ జాగృతి నాయకులతో కలిసి స్పీకర్ ప్రసాద్ కుమార్ కు ఎమ్మెల్సీ కవిత వినతి**

నిజామాబాద్,మార్చి 27(మనం ప్రతినిధి): రాష్ట్ర అసెంబ్లీ ఆవరణలో మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ కు బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విజ్ఞప్తి చేశారు. వచ్చే నెల 11న పూలే జయంతిలోగా విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని విగ్రహాలను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. కాబట్టి అలాంటి దారిలో సమానత్వ స్ఫూర్తిని అనునిత్యం చట్టసభల స్మృతిపథంలో నిలిపే సదుద్దేశంతో పూలే విగ్రహం ఏర్పాటు కూడా అసెంబ్లీ ప్రాంగణంలో ఏర్పాటు చేయడం అవసరమని, గత ఏడాది జనవరి 21న కూడా లేఖ ఇచ్చామని గుర్తు చేశారు. అసెంబ్లీలో పూలే విగ్రహం ఉండాలన్నది వివిధ సామాజిర సంస్థలు, బీసీ సమాజపు చిరకాల కోరిక అని, ఈ విగ్రహ ఏర్పాటు ప్రజాస్వామ్య స్ఫూర్తిని మరింత ఇనుమడింపజేయగలదని స్పష్టం చేశారు. కాబట్టి వెంటనే విగ్రహ ఏర్పాటుకు అవసరమైన చర్యలను



కోరారు. తద్వారా పూలేకి గొప్ప నివాళి అర్పించినట్లవుతుందని అభిప్రాయపడ్డారు.ఈ మేరకు పలువురు బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు, యూనైటెడ్ పూలే ఫ్రంట్, తెలంగాణ జాగృతి నాయకులతో కలిసి గురువారం శాసన సభలో స్పీకర్ ప్రసాద్ కుమార్ కు ఎమ్మెల్సీ కవిత వినతి పత్రం అందించారు. వెనుకబడిన వర్గాల పట్ల వివక్షకు ముగింపు పలకాలనీ ఈ దేశ సామాజిక సమానత్వానికి బాటలు వేసి దార్శనికులు పూలే అని కొనియాడారు. బడుగుల జీవితాలలో అక్షర వెలుగులు నింపి ఎంతో మంది మంది సంఘ సంస్కర్తలకు వేగుచుక్కగా నిలిచి దారి చూపారని కీర్తించారు. ఉదాత్తమైన భావాలు చట్టసభల్లో నిరంతరం ప్రతిఫలించడానికి మహోన్నత వ్యక్తుల మొదలుపెట్టాలని కోరారు. తెలంగాణ జాగృతి పోరాటాలతో ఉమ్మడి రాష్ట్రంలో అసెంబ్లీ ఆవరణలో అంబేద్కర్ విగ్రహం నెలకొల్పిన విషయాన్ని వినతి పత్రంలో ఎమ్మెల్సీ కవిత గుర్తు చేశారు.స్పీకర్ ను కలిసిన వారిలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వివేకానంద గౌడ్, కాలేరు వెంకటేశ్, మర్రి రాజశేఖర్ రెడ్డి, బండారు లక్ష్మా రెడ్డి , యునైటెడ్ పూలే ఫ్రంట్ కో కన్వీనర్ బొల్ల శివ శంకర్ , జాగృతి నాయకులు శ్రీధర్ రావు, యునైటెడ్ పూలే ఫ్రంట్ నాయకులు అలకుంట హరి ,కొట్టాల యాదగిరి, ఆర్వీ మహేందర్ , కుమారస్వామి, విజయేందర్ సాగర్ , బాలకృష్ణ రాచమల్ల, కృష్ణమ చారి , ప్రవీణ్ కుమార్, సలవ చారి, గోపు సదానందం పాల్గొన్నారు.

## ప్యాకేజ్ 21 (ఎ) పనులు వేగవంతంగా పూర్తి చేయాలి

నిజామాబాద్,మార్చి 27(మనంప్రతినిధి): శాసన సభ సమావేశాల్లో భాగంగా ఈ రోజు జీరో అవర్ లో బాల్కొండ నియోజకవర్గం ఇరిగేషన్ శాఖ కు పలు సమస్యలను సభలో లేవనెత్తి ప్రభుత్వం



దృష్టికి ప్యాకేజ్ 21 (ఏ) పనులు వేగవంతంగా పూర్తి చేసి రైతాంగానికి సాగు నీరు ఇవ్వాలి. మాజీ మంత్రి బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి డిమాండ్ చేశారు.బాల్కొండ, నిజామాబాద్ రూరల్, ఆర్మూర్, మెటపల్లి నియోజకవర్గాల్లో సుమారు 2,12,000 ఎకరాలకు సాగు నీరు ఇవ్వడానికి నిర్దేశించిన ప్రాజెక్ట్ ప్యాకేజ్ 20,21,21(ఏ)4800 కోట్లతో మొదలు పెట్టి గత ప్రభుత్వ హయాంలోనే 70 శాతం పనులు పూర్తి చేసి సుమారు 3300 కోట్లు ఖర్చు చేశారు.మిగతా పనులు కూడా తొందరగా పూర్తి చేయాలనీ,ముఖ్యంగా ప్యాకేజ్ 21 (ఏ) మెట్పల్లి సేగ్మెంట్ లో బాల్కొండ నియోజవర్గంలో భీంగల్, వేల్పూర్, కమ్మర్పల్లి, మోర్తాడ్ మండలాలకు కలిపి 80 వేల ఎకరాలు, నిజామాబాద్ రూరల్ జక్రాన్ పల్లి మండలంలో 28000 ఎకరాలు, ఆర్మూర్ నియోజక వర్గంలో 6000 ఎకరాలు మరియు మెట్ పల్లి నియోజకవర్గంలో 12000 ఎకరాలు సాగు నీరు అందించవచ్చు. అని వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. ప్యాకేజ్ 21 (ఏ) మెటపల్లి సెగ్మెంట్ లో దాదాపు 80 శాతం పనులు పూర్తి అయ్యాయనీ,హెడ్ వర్క్స్, పంప్ హౌజ్ లు,మెయిన్ డిస్ట్రిబ్యూటరి లైన్, మెయిన్ లైన్ పూర్తి అయ్యింది. ఒక డిస్ట్రిబ్యూటరి లైన్ వేయాల్సి ఉందనీ,ఇది పైప్ ఇరిగేషన్ ప్రాజెక్ట్. దీనికి నిధుల కొరత లేదు,బ్యాంక్ తో లింక్ అయ్యి ఉందనో బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి సూచించారు. ప్యాకేజ్ 21(ఏ) మిగతా 20 శాతం పనులు పూర్తి చేసినట్లయితే 6 నెలల్లోనే 1,20,000 ఎకరాలకు సాగు నీరు అందించవచ్చు కావున పనులు వేగవంతం చేయాలని ప్రభుత్వాన్ని ఎమ్మెల్యే కోరారు.

## జాతీయం- అంతర్జాతీయం

### పాక్ జైలులో భారత మత్స్యకారుడు ఆత్మహత్య..!

కరాచీ,మార్చి 27: పాకిస్థాన్ జైల్లో ఉన్న ఒక భారత మత్స్యకారుడు ఆత్మహత్య చేసుకున్నాడు. బాత్రూంలో ఉరి వేసుకొని ప్రాణాలు తీసుకున్నాడు. ఆ జైలు సూపరింటెండెంట్ ఈ విషయాన్ని వెల్లడించినట్లు మీడియా కథనాలు పేర్కొన్నాయి.

భారత్- పాకిస్థాన్ జల సరిహద్దులపై సరిగా అవగాహన లేకుండా చేపల వేటకు వెళ్లి అక్కడి అధికారులకు చిక్కినవారు ఎంతోమంది ఉన్నారు. అదేవిధంగా భారత్‌కు చెందిన మత్స్యకారుడు గౌరవ్‌రామ్ ఆనంద్‌ను (52) 2022లో అదుపులోకి తీసుకున్నారు. అతడిని అరెస్టు చేసి కరాచీ జైల్లో ఉంచారు. నాటినుంచి అతడు అక్కడి కారాగారంలోనే మగ్గిపోతున్నాడు. అయితే.. మంగళవారం రాత్రి బాత్‌రూంలోకి వెళ్లిన మత్స్యకారుడు తాడుతో బలవన్మరణానికి పాల్పడ్డాడు. అతడు ఎంతసేపటికి బయటకి రాకపోవడంతో అనుమానించిన జైలు అధికారి లోపలికి వెళ్లి చూడగా అప్పటికే అతడు ప్రాణాలు కోల్పోయాడు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేయడంతో విషయం తాజాగా వెలుగులోకి వచ్చింది. చట్టపరమైన ప్రక్రియ పూర్తి చేసేంతవరకు మృతదేహాన్ని కోల్ స్టోరేజ్‌లో ఉంచనున్నట్లు పాక్ అధికారులు తెలిపారు. కాగా.. గత నెలలో తమ కారాగారంలో ఉన్న 22 మంది మత్స్యకారులను పాక్ ప్రభుత్వం విడుదల చేసిన సంగతి తెలిసిందే. వారి శిక్షాకాలం పూర్తికావడంతో కరాచీలోని మాలిర్ కారాగారం నుంచి విడుదల చేసింది. మత్స్యకారులు సరిహద్దులను సరిగా గుర్తించకపోవడంతో ఇరువైపులా ఈ అరెస్టులు జరుగుతున్నాయి. ఇదిలాఉంటే.. జనవరి 1న ఇరుదేశాల ఖైదీల జాబితా మార్పిడి జరిగింది. పాకిస్థాన్‌లో 266 మంది భారత ఖైదీలు ఉన్నారు. భారత జైళ్లలో మొత్తం 462 మంది పాకిస్థానీయులు ఉన్నట్లు మన దేశ జాబితా పేర్కొంది.

### అమెరికా ప్రయోజనాలకు భంగం కలిగించేందుకు చేతులు కలిపారో.. జాగ్రత్త..!

**ఐరోపా సమాఖ్య, కెనడాలకు ట్రంప్ హెచ్చరిక**


వాషింగ్టన్, మార్చి 27: తమ దేశ ఆర్థిక ప్రయోజనాలను దెబ్బతీయడానికి ఐరోపా సమాఖ్య, కెనడా చేతులు కలిపితే మరింత భారీగా టారిఫ్లను విధిస్తానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్ హెచ్చరించారు. ప్రస్తుతం ప్రకటించిన మొత్తం కంటే చాలా ఎక్కువగా ఉంటాయని పేర్కొన్నారు. అమెరికా దిగుమతి చేసుకొనే ఆటోమొబైల్స్పై 25శాతం సుంకాన్ని ఆయన ప్రకటించిన విషయం తెలిసిందే. ఇక ట్రంప్ నిర్ణయంపై ఐరోపా సమాఖ్య అధ్యక్షురాలు ఉర్సులా వాన్డెర్ లెయెన్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ''ఈ నిర్ణయం వ్యాపారాలకు ఏమాత్రం మంచిదికాదు.. వినియోగదారుల కోణంలో దారుణమైంది'' అని విమర్శించారు. మరోవైపు కెనడా ప్రధాని మార్క్ కార్నీ కూడా ట్రంప్ నిర్ణయాన్ని తప్పుపట్టారు. కెనడా కార్మికులపై ప్రత్యక్షదాడిగా పేర్కొన్నారు. దీనికి సంబంధించి ప్రతీకార చర్యలను తాము పరిశీలిస్తున్నామని



పేర్కొన్నారు. మరోవైపు ఐరోపా సమాఖ్య తన ప్రతిఘటన నిర్ణయాలను ఏప్రిల్ మధ్య వరకు వాయిదా వేసింది. వీటిల్లో అమెరికా బర్బన్‌పై 50శాతం సుంకాల విధింపు కూడా ఉంది. ఈ నిర్ణయం అమలు చేస్తే.. తాము ఐరోపా వైన్లు, ఆల్కహాల్‌పై 200శాతం పన్ను విధిస్తామని ట్రంప్ హెచ్చరించారు. ఏప్రిల్ 3వ తేదీ నుంచి ఆటోమొబైల్స్ దిగుమతులపై అదనపు సుంకాల నిర్ణయం అమల్లోకి రానుంది. దీంతో అమెరికాలోకి దిగుమతి అయ్యే కార్లు, తేలికపాటి ట్రక్కుల ధరలు పెరగనున్నాయి.

# భారత్, చైనా సంబంధాలు.. కేంద్రమంత్రి జైశంకర్ కీలక వ్యాఖ్యలు

ఢిల్లీ, మార్చి 27: సమీప భవిష్యత్తులో భారత్-చైనాల మధ్య కొన్ని సమస్యలు ఉంటాయని భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ అన్నారు. భారత్-చైనా సరిహద్దులో దశాబ్దాలుగా ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. రాబోయే కాలంలోనూ రెండు దేశాల మధ్య కొన్ని సమస్యలు ఉంటాయని మంత్రి ఎస్.జైశంకర్ అంచనా వేశారు. అయితే వాటిని పరిష్కరించే మార్గాలు కూడా ఉన్నాయని వ్యాఖ్యానించారు. 2020 గల్వాన్ లోయ సంఘర్షణ గురించి మాట్లాడుతూ అది సరైనది కాదని పేర్కొన్నారు. 2020లో తూర్పు లద్దాఖ్‌లోని గల్వాన్ లోయలో భారత్, చైనా సైన్యాల మధ్య జరిగిన ఘర్షణతో రెండు దేశాల సంబంధాలు దిగజారిపోయాయి. ఆనాడు వాస్తవాధీన రేఖ వెంబడి యథాతథ స్థితిని మార్చడానికి డ్రాగన్ ప్రయత్నించడమే అందుకు కారణం. ఆ ఘటనతో దాదాపు 5 దశాబ్దాల తర్వాత రెండు దేశాల సరిహద్దుల్లో తొలిసారిగా ప్రాణ నష్టం సంభవించింది. మనవైపు 20 మంది సైనికులు వీరమరణం పొందారు. దాంతో దేశంలో చైనా వ్యతిరేక సెంటిమెంట్ భగ్గుమంది. దీనిని ఉద్దేశించి ఆసియా సొసైటీ సంస్థ నిర్వహించిన కార్యక్రమంలో జైశంకర్ మాట్లాడారు. అది సమస్యలను పరిష్కరించే తీరు కాదని తేల్చిచెప్పారు. ''2024 అక్టోబర్ నుంచి రెండు దేశాల సంబంధాల్లో కాస్త పురోగతి కనిపించింది. 2020లో జరిగిన నష్టం నుంచి బయటకు వచ్చేందుకు దశలవారీగా ప్రయత్నాలు చేస్తున్నాం'' అని మంత్రి తెలిపారు. ఆ తర్వాత ఇరువర్గాల మధ్య పలు దశల్లో మిలిటరీ, దౌత్యపరమైన చర్చలు జరిగాయి. వాటి ఫలితంగా ఉద్రిక్తతలకు ముగింపు పలుకుతూ గత అక్టోబర్‌లో ఇరుదేశాలు కీలక గస్తీ ఒప్పందం కుదుర్చుకున్నాయి. దీని ప్రకారం.. 2020 నాటి యథాస్థితి ఎల్‌ఏసీ వెంబడి ఇక



కొనసాగనుంది. ఇరు దేశాల సైనికులు 2020లో గస్తీ నిర్వహించిన పెట్రోలింగ్ పాయింట్లకు ఇక స్వేచ్ఛగా వెళ్లొచ్చు. ఇక.. సరిహద్దుల్లో సహకారం పునరుద్ధరణ, సమర్థ నిర్వహణ, నదుల సమాచారం ఇచ్చిపుచ్చుకోవడం, కైలాస్-మానససరోవర్ యాత్ర వంటి అంశాలపై భారత్-చైనా ఇటీవల బీజింగ్‌లో తాజాగా చర్చించాయి. ఇరుదేశాల సరిహద్దు వ్యవహారాలపై సంప్రదింపులు, సమన్వయంపై వర్కింగ్ మెకానిజం ఫ్రేమ్‌వర్క్(డబ్ల్యూఎంసీసీ) సమావేశంలో పలు అంశాలు ప్రస్తావనకు వచ్చాయి. డిసెంబరులో జరిగిన ప్రత్యేక ప్రతినిధుల చర్చల్లో భాగంగా జాతీయ భద్రతా సలహాదారు అజీత్ డోభాల్, చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ తీసుకున్న నిర్ణయాలను సమర్థంగా అమలుపరిచేందుకు తీసుకోవలసిన చర్యలపై ప్రతిపాదనలు వాటిలో ఉన్నాయి.

ఒకవైపు చర్చలు జరుపుతూనే మరోవైపు డ్రాగన్ తన కుయుక్తులను ప్రదర్శిస్తోంది. మరోసారి కవ్వింపులకు పాల్పడింది. లద్దాఖ్ భూభాగంలోని కొన్ని ప్రాంతాల్లో కౌంటీలను ఏర్పాటుచేస్తోంది. ''చైనా రెండు కొత్త కౌంటీలను ఏర్పాటుచేస్తున్న విషయం మా దృష్టికి వచ్చింది. ఆ కౌంటీల్లోని కొన్ని భాగాలు లద్దాఖ్ పరిధిలోకి వస్తాయి. భారత భూభాగాలను ఆక్రమించడాన్ని మేం ఎన్నటికీ అంగీకరించబోం. భారత సార్వభౌమాధికారానికి సంబంధించి మా దీర్ఘకాల, స్థిరమైన వైఖరిపై ఈ కౌంటీల ఏర్పాటు ఎలాంటి ప్రభావం చూపించదు. ఈ చర్యలు.. చైనా చేపడుతున్న బలవంతపు ఆక్రమణలకు చట్టబద్ధతను కల్పించలేవు'' అని కేంద్రం స్పష్టం చేసింది. సరిహద్దుల్లో మౌలిక సదుపాయాల పురోగతిపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపింది.

## 'డీప్‌ఫేక్'ను తేలిగ్గా తీసుకోవద్దు: లోక్‌సభలో హేమామాలిని

ఢిల్లీ,మార్చి 27 : 'డీప్‌ఫేక్' టెక్నాలజీని దుర్వినియోగం చేయడంపై బీజేపీ ఎంపీ హేమమాలిని ఆందోళన వ్యక్తంచేశారు. సెలబ్రిటీలను లక్ష్యంగా చేసుకుని డీప్‌ఫేక్ సాంకేతికత దుర్వినియోగంపై సినీ నటి, బీజేపీ ఎంపీ హేమమాలిని లోక్‌సభలో మాట్లాడారు. ఈ అంశాన్ని అంత తేలికగా తీసుకోరాదని.. ఇది సెలబ్రిటీల ప్రతిష్ఠను దెబ్బతీయడమే కాకుండా వారి మానసిక ఆరోగ్యంపైనా ప్రభావం చూపుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. లోక్‌సభలోని జీరో అవర్‌లో ఈ అంశాన్ని లేవనెత్తిన హేమమాలిని కృత్రిమ మేధ, డీప్‌ఫేక్ టెక్నాలజీ ప్రపంచాన్ని కమ్ముకుంటున్నాయన్నారు. ఈ టెక్నాలజీతో అనుకూలతలు చాలా వరకు ఉన్నప్పటికీ.. సినీ పరిశ్రమకు చెందిన సెలబ్రిటీలను సైతం లక్ష్యంగా చేసుకొని దుర్వినియోగం చేయడంపై హేమమాలిని ఆందోళన వ్యక్తం చేశారు. సెలబ్రిటీల వ్యక్తిగత జీవితాలపై దారుణమైన కామెంట్లు చేయడం, తమకు నచ్చినట్లుగా మాట్లాడుతూ వాస్తవాలను వక్రీకరించేందుకు సామాజిక మాధ్యమాలను దుర్వినియోగపరుస్తుండటాన్ని ఆమె లోక్‌సభ దృష్టికి తీసుకొచ్చారు.

# టీజీవో సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో ఇఫ్తార్ విందు

నిజామాబాద్ కలెక్టరేట్, మార్చి 27(మనం న్యూస్): రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని తెలంగాణ గజిటెడ్ అధికారుల సంఘం నిజామాబాద్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (కలెక్టరేట్) లో ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ ముస్లిం ఉద్యోగులు, టీజీవో ప్రతినిధులతో కలిసి ఇఫ్తార్ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎంతో



పవిత్రమైన రంజాన్ మాసంలో ముస్లిం సోదరులు నియమనిష్టలతో ఉపవాస దీక్షలు, ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తారని అన్నారు. వారి ప్రార్థనలు ఫలించి నిజామాబాద్ జిల్లా సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. గజిటెడ్ అధికారుల సంఘం ఏ కార్యక్రమం చేపట్టినా ఎంతో ప్రణాళికాబద్ధంగా నిర్వహిస్తుందని, ఇతరులకు మార్గదర్శకంగా నిలుస్తారని అభినందించారు. ముందు ముందు ఇదే తరహా స్ఫూర్తిని కనబరచాలని సూచించారు. టీజీవో సంఘం జిల్లా అధ్యక్షుడు అలుక కిషన్ మాట్లాడుతూ, అన్ని మతాలకు సమ ప్రాధాన్యతను ఇస్తూ తమ సంఘం ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతోందన్నారు. అందులో భాగంగానే రంజాన్ సందర్భంగా ముస్లిం ఉద్యోగుల కోసం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశామని అన్నారు. కాగా, రంజాన్ మాసం పవిత్రత' ప్రాశస్త్యం గురించి ముస్లిం మత పెద్ద మౌలానా హఫీజ్ మొహమ్మద్ అబ్దుల్ ఖదీర్ తెలియజేశారు. ఇఫ్తార్ విందులో టీజీవో ల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అమృత్ కుమార్, జిల్లా వ్యవసాయ అధికారి వాజిద్ హుస్సేన్, లేబర్ ఆఫీసర్ యోహన్, డిసిఒ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేట్,కార్పొరేట్ కళాశాలల అక్రమ అడ్మిషన్లు, ఫీజుల దోపిడి ని అరికట్టాలి

- అవినీతి అక్రమాలకు పాల్పడుతున్న ఆర్ఐఓ ను సస్పెండ్ చేయాలి
- ఫిర్యాదు చేసేందుకు వెళ్లిన ఏఐఎస్ఎఫ్ నాయకులను దుర్భాషలాడం సిగ్గుచేటు
- ఆర్ఐఓ దిష్టిబొమ్మ దహనాన్ని అడ్డుకున్న పోలీసులు
- ఆర్ఐఓ ను తొలగించకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహిస్తాం
- ఇది ప్రజాస్వామ్యమా లేక పోలీస్ రాజ్యమా
- ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్




కర్నూలు మార్చి27మనం న్యూస్: అవినీతి,అక్రమాలకు పాల్పడుతున్న ఇంటర్మీడియట్ బోర్డ్ అధికారి, కర్నూలు ఆర్ఐఓ గురువయ్య శెట్టిని తక్షణమే సస్పెండ్ చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు డి. సోమన్న, ఎస్. షాబీర్ భాష డిమాండ్ చేశారు. గురువారం స్థానిక కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి, ప్రైవేట్,కార్పొరేట్ కళాశాలలు అక్రమంగా ముందస్తు అడ్మిషన్లు నిర్వహిస్తున్నారని అన్నారు. అదేవిధంగా ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా రంగురంగుల కరపత్రాలు, భారీ హోర్డింగ్ లు పెట్టి ప్రచారాలు,ప్రసారాలు చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రులను మభ్యపెడుతున్నారని, అడ్మిషన్ ముందు ఒక ఫీజు, అడ్మిషన్ తర్వాత ఇంకొక ఫీజు వసూలు చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రులను మోసం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వీటన్నిటినీ అరికట్టాల్సిన ఇంటర్మీడియట్ బోర్డు అధికారి, ఆర్ఐఓ నిమ్మకు నీరత్తినట్లు వ్యవహరిస్తూ, ప్రైవేట్ కార్పొరేట్ కళాశాలలు ఇచ్చే కాసులకు కక్కుర్తి పడి, వాటి వైపు కన్నెత్తి చూడని పరిస్థితి ఉందని అన్నారు. గురువయ్య శెట్టి ఆర్ఐవో బాధ్యతలను స్వీకరించినప్పటి నుంచి జిల్లాలో ఇంటర్మీడియట్ విద్యావ్యవస్థను నాశనం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. కావున ఇంటర్మీడియట్ బోర్డ్ అధికారులు స్పందించి, అవినీతి అక్రమాలకు పాల్పడుతున్న ఆర్ఐఓ ను సస్పెండ్ చేసి, ఆయన అవినీతి అక్రమాలపై సిబిఐ,సిఐడి లతో విచారణ జరిపించి, ప్రైవేట్,కార్పొరేట్ కళాశాలల ముందస్తు అడ్మిషన్లు అరికట్టాలని, ఫీజుల దోపిడీని నియంత్రించాలని వారు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో జిల్లావ్యాప్తంగా ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనకు సిద్ధంగా ఉన్నామని వారు హెచ్చరించారు. అనంతరం ఆర్ఐఓ గురువయ్య శెట్టి దిష్టిబొమ్మ దహనం చేస్తుండడంతో పోలీసులు అడ్డగించి, ఏఐఎస్ఎఫ్ నాయకులను అరెస్టు చేసి, మూడవ పట్టణ పోలీస్ స్టేషన్ కు తరలించడం జరిగింది. అక్రమ అరెస్టులతో ఉద్యమాలని ఆపలేరు ఆర్ ఐ ఓ తొత్తుగా మారిన పోలీస్ యంత్రాంగం నశించాలని వారు అన్నారు. శాంతియుతంగా ఆందోళన చేస్తున్నటువంటి విద్యార్థి సంఘ నాయకులపై మీ పోలీసుల ప్రతాపం చూపించడం కాదు, జిల్లాలో కర్ణాటక మద్యం ఏరులై పారుతుంది, గుట్కా మరియు మట్కా, క్రికెట్ బెట్టింగ్స్ చేసేటి వాళ్ళపైన మీ ప్రతాపం చూపించండి అని అన్నారు .అనంతరం ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.శరత్ కుమార్, నగర అధ్యక్ష,కార్యదర్శులు అభి,అశోక్, గరల్స్ కన్వీనర్ అక్షర,నాయకులు :ముని,నాని,శ్రీను, వీరెష్, మోహన్, కుమార్, వరుణ్, సందీప్, రాము, హరి తదితరులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా పేదలకు అండగా ఉంటున్నాం

- రాష్ట్ర మంత్రి టీజీ భరత్
- 17 మందికి రూ.13,44,175 సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన మంత్రి టీజీ భరత్



కర్నూలు, మార్చి 27(మనం న్యూస్)ః ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా పేదలను ఆదుకుంటున్నామని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. కర్నూలు నగరంలోని ఆయన కార్యాలయంలో 17 మందికి ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన చెక్కులను ఆయన అందజేశారు. మల్లెపూరివీరనారాయణకు రూ. 27493, నాటువ వీరాంజనేయులుకు రూ.75,000, ఉమావతి అనే మహిళ కూతురికి రూ.71,922, ఇండ్ల వెంకటరామయ్యకు రూ.32,324, నాగరకట్ట అబీదా బీకి రూ.81,000, వడ్ల యశోదకు రూ. 48,000, వి. ప్రసాద్కు రూ.23,420, ఏ.శోభారాణికి రూ.1,22,403, యం. హారిక రెడ్డికి రూ.52,833, షేక్ సుఫియాన్కి రూ.21,316, మరాఠి షిండే శ్రీనివాస రావుకి రూ.30,000, కనీజ్ ఫాతీమాకి రూ.1,27,786, పింజరి బషీర్ అహ్మద్కి రూ.50,933, నారా లీలావతికి రూ.2,30,000, అడ్డేకుల శాంతారాజుకి రూ.29,162, జూటూరు పరమేశ్వరప్పకి రూ.1,20,583, పి. వెంకట సుబ్బయ్యకి రూ. 2,00,000ల చెక్కులను మంత్రి టీజీ భరత్ బాధితులకు అందజేశారు. మొత్తం రూ.13,44,175ల చెక్కులు అందించినట్లు వివరాలు తెలిపారు. ఆపద సమయంలో నియోజకవర్గ ప్రజలను ఆదుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు మంత్రి టీజీ భరత్ కృతజ్ఞతలు తెలిపారు. చెక్కులు అందుకున్న వారు సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి టీజీ భరత్ ల మేలు మరిచిపోలేమని సంతోషం వ్యక్తం చేశారు.

# అక్రమానికి గురైన రోడ్డును కాపాడండి



- సర్పంచ్ కు సుజయాంధ్ర నగర్ వాసుల వినతి

మంత్రాలయం, మార్చి 27(మనం న్యూస్) : మంత్రాలయంలో అక్రమానికి గురైన రోడ్డును కాపాడాలని సుజయాంధ్ర నగర్ కాలనీ వాసులు గురువారం పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్యకు, ఈఓఆర్డి ప్రభావతి కి వినతిపత్రం సమర్పించారు. గత కొన్ని రోజుల క్రితం గుర్తు తెలియని వ్యక్తులు సుజయాంధ్ర నగర్ లో రోడ్డుకు అడ్డంగా బండలు పాతి కబ్జా చేశారని, ఇంతకు ముందు ముందు కూడా రోడ్డు అక్రమణపై అధికారులకు ఫిర్యాదు చేశామని వాపోయారు. కాలనీలో రోడ్డుకు అడ్డంగా బండలు పాతడంతో కాలనీ వాసులు ఇబ్బందులకు గురి అవుతున్నారని అధికారులు తక్షణమే స్పందించి రోడ్డుకు అడ్డంగా అక్రమంగా పాతిన బండలను తొలగించాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# మాదకద్రవ్యాల సమూల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించండి

- జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్




నంద్యాల, మార్చి 27మనం న్యూస్ః జిల్లాలో మాదకద్రవ్యాల సమూల నియంత్రణకు అన్ని ప్రభుత్వ శాఖలు సహకరించి పటిష్ట చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాల్లో మాదకద్రవ్యాల జిల్లా స్థాయి కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. అడిషనల్ ఎస్పీ యుగంధర్ బాబు, డిఆర్ఓ రాము నాయక్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్ మాట్లాడుతూ మాదకద్రవ్యాల నియంత్రణ అంశాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్న నేపథ్యంలో జిల్లాలో మాదకద్రవ్యాల నియంత్రణకు అన్ని ప్రభుత్వ శాఖలు సహకరించి పటిష్ట చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మాదకద్రవ్యాల నివారణ రవాణాను అరికట్టేందుకు ప్రణాళిక బద్ధంగా సమన్వయంతో పని చేయాలన్నారు. జిల్లాలోని అన్ని విద్యాసంస్థలలోని విద్యార్థులకు మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై విస్తృత అవగాహన కల్పించాలన్నారు. ప్రతి కాలేజీలో మాదకద్రవ్యాల నియంత్రణకు కళాశాల సిబ్బంది పని చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలోని ఫ్యాక్టరీలలో ఇతర రాష్ట్రాల నుండి వచ్చిన కార్మికులు పనిచేస్తున్నారని...గంజాయి ఇతర మాదక ద్రవ్యాలను ఫ్యాక్టరీల్లోకి అక్రమంగా తరలించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే సంబంధిత కార్మికులు మాదకద్రవ్యాలను సేవించకుండా ఫ్యాక్టరీల యజమానులు పక్కాగా తనిఖీలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో ఉన్న మెడికల్ దుకాణాల్లో డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండా నిద్ర మాత్రలను విక్రయించకుండా చర్యలు తీసుకోవాలని డ్రగ్ కంట్రోలర్ ను కలెక్టర్ ఆదేశించారు. మిర్చి సాగులో గంజాయి పండించే ప్రమాదం ఉందని వీటిని అరికట్టేందుకు సంబంధిత వ్యవసాయం ఉద్యాన వనాధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. జిల్లాలో ఉన్న పర్యాటక కేంద్రాలకు బయటి రాష్ట్రాల నుంచి వచ్చే యాత్రికుల నుండి మాదకద్రవ్యాలను రవాణా అయ్యే ప్రమాదం వుందని అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో 8 జాతీయ రహదారులు అనుసంధానం కావడం వల్ల జిల్లాకు సందర్శకుల తాకిడి ఎక్కువగా ఉంటుందన్నారు వీటి ద్వారా సరఫరా అయ్యే రవాణాను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. జిల్లాలో మాదకద్రవ్యాల నియంత్రణకు అన్ని శాఖల సహకారంతో పటిష్ట చర్యలు తీసుకోనున్నట్లు జాయింట్ కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో సెబ్ సూపర్డెంట్ రవికుమార్, నంద్యాల, ఆత్మకూర్ ఆర్డీవోలు విశ్వనాథ్ సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# జిల్లా ప్రజా పరిషత్ కో ఆప్టెడ్ సభ్యునిగా మదర్ఖాన్ ఇలియాజ్ ఖాన్ ఏకగ్రీవంగా ఎన్నిక



- ఎన్నికల ప్రిసైడింగ్ అధికారి మరియు జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా

కర్నూలు, మార్చి 27మనం న్యూస్:- జిల్లా ప్రజా పరిషత్ కో ఆప్టెడ్ సభ్యునిగా మదర్ఖాన్ ఇలియాజ్ ఖాన్ ఏకగ్రీవంగా ఎన్నిక అయినట్లు ఎన్నికల ప్రిసైడింగ్ అధికారి మరియు జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా తెలిపారు. గురువారం స్థానిక జిల్లా పరిషత్ సీఈఓ ఛాంబర్ లో జిల్లా ప్రజా పరిషత్ కో ఆప్టెడ్ మెంబర్ ఎన్నిక కి సంబంధించి మదర్ఖాన్ ఇలియాజ్ ఖాన్ నుండి ఎన్నికల ప్రిసైడింగ్ అధికారి మరియు కలెక్టర్ నామినేషన్ పత్రాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎన్నికల ప్రిసైడింగ్ అధికారి మరియు కలెక్టర్ మాట్లాడుతూ స్టేట్ ఎలెక్షన్ కమిషన్ వారి ఆదేశాల మేరకు షెడ్యూల్ ప్రకారం జిల్లా ప్రజా పరిషత్ కో ఆప్టెడ్ మెంబర్ ఎన్నుకోవడానికి నోటిఫికేషన్ ఇవడం జరిగిందన్నారు.. అందులో భాగంగా ఈరోజు ఉదయం 10 గంటల లోపు నామినేషన్లు తీసుకోవాల్సి ఉందన్నారు.. 10 గంటల లోపు కేవలం 1 నామినేషన్ మాత్రమే రావడం జరిగిందన్నారు..సంబంధిత నామినేషన్ ను స్క్రూటినీ చేసి వాలిడ్ నామినేషన్ గా డిక్లేర్ చేయడం జరిగిందన్నారు..పోటీ ఏమి లేనందున జిల్లా ప్రజా పరిషత్ కో ఆప్టెడ్ మెంబర్ గా మదర్ఖాన్ ఇలియాజ్ ఖాన్ ను ఏకగ్రీవంగా ప్రకటించడం జరిగిందన్నారు... అనంతరం ఎన్నికల ప్రిసైడింగ్ అధికారి మరియు కలెక్టర్ మదర్ఖాన్ ఇలియాజ్ ఖాన్ కి డిక్లరేషన్ ఫామ్ అందచేసి ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ సీఈఓ నాసర రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# అనుమతి లేకుండా నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవు



- కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు

మంత్రాలయం, మార్చి 27(మనం న్యూస్)ః మంత్రాలయంలో అక్రమ నిర్మాణాలపై కుడా అధికారులు కొరడా జులుపించారు. గురువారం జిల్లా కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు మంత్రాలయంలో పర్యటించారు. పంచాయతీ, 'కుడా' అనుమతులు లేనివాటిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక రామచంద్ర నగర్, సుజయాంధ్ర నగర్ తదితర ప్రాంతాల్లో అక్రమ కట్టడాలను పరిశీలించారు. గ్రామ పంచాయతీ పరిధిలోని భవన నిర్మాణానికి జీ+2వరకు అనుమతి ఉండగా, అనగా (గ్రౌండ్ ఫ్లోర్ తో కలిపి పైన రెండు భవనాల వరకు) తదుపరి నిర్మాణ పనులు చేపట్టిన వారు జిల్లాలోని కుడా అనుమతి తప్పనిసరి తీసుకోవాలని సూచించారు.అనుమతులు లేకుండా అక్రమంగా నిర్మాణాలు చేపట్టిన వారికి నోటీసులు జారీ చేశారు. ప్రతి భవనానికి అనుమతి తీసుకుంటే వాటికి విపత్తుల సమయంలో ప్రభుత్వం అండగా ఉంటుందని చెప్పారు. ఇంతవరకు మంత్రాలయంలో అనుమతులు లేకుండా అక్రమంగా హోం స్టే లు, లాడ్జీలు నిర్వహించారని మండిపడ్డారు. ఇప్పటికైనా లాడ్జీలు నిర్మించే వారు కింద పార్కింగ్ చేసుకోవాలని తప్పకుండా ప్రభుత్వ అనుమతి తీసుకోవాలని అన్నారు. అనుమతులు లేకుండా ఇప్పటి వరకు నిర్వహించిన వాటికి నోటీసు జారీ చేశారు.సంబధిత ఇంజనీర్ లతో భవనాలకు సంబంధించిన ప్లాన్ తో పాటు అప్రవోలు చేయించి సక్రమ మార్గంలో భవనాలు నిర్మించు కోవాలన్నారు. ఇప్పటికే ప్రభుత్వ ఖజానా ఖాళీ అయిందని ప్రతి ఒక భవన నిర్మాణ యజమానులు ప్రభుత్వానికి సహకరిస్తే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని తెలిపారు. అనుమతులు లేని లేవుట్లపై తనిఖీ చేసి అధికారికంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కుడా లైనింగ్ అధికారి విజయభాస్కర్, ప్లానింగ్ అధికారి గోపాలకృష్ణ , పంచాయతీ కార్యదర్శి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# ఉగాది బ్రహ్మోత్సవాలకు పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు

- భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా విధులు నిర్వహించండి
- నిరంతరం అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వహించాలి
- ఎస్పీ అదిరాజ్ సింగ్ రాణా



శ్రీశైలం మార్చి 27మనం న్యూస్ః శ్రీశైలం మహా పుణ్య క్షేత్రం ఉగాది బ్రహ్మోత్సవాలకు భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ అది రాజ్ సింగ్ రానా తెలిపారు. ఉగాది ఉత్సవాలకు నంద్యాల, కర్నూలు, కడప, అన్నమయ్య జిల్లాలు నుండి 6 మంది డిఎస్పి లు, 40 మంది సిఐ లు, 100 మంది ఎస్ఐలు, సుమారు 1500 మంది సివిల్ పోలీసులు, 200 మందిన ఆర్మడ్ పోలీసులు, 200 మంది ఏపీఎస్పీ పోలీసులు మరియు 100 మంది స్పెషల్ పార్టీ పోలీసు లను బందోబస్తు విధులలో ఉన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సాంకేతిక పరిజ్ఞానాన్నిఉపయోగించి సుమారు 800 సీసీ కెమెరాలు మరియు 3 డ్రోన్ లతో పరిసర ప్రాంతాలపై నిఘా ఏర్పాటు చేసి దొంగతనాలు జరగకుండా ఉండేందుకు క్రైమ్ పోలీసు లను ఏర్పాటు చేశారు. ఈ సమావేశం లో నంద్యాల ఏ ఆర్ అడిషనల్ ఎస్పీ చంద్రబాబు, ఆత్మకూర్ డిస్పి రామంజి నాయక్, శ్రీశైలం 1 టౌన్ సిఐ ప్రసాదరావు పాల్గొన్నారు.

# బీసీలు సామాజిక సేవలో ముందుండాలి

కర్నూలు మార్చి 27మనం న్యూస్ః సామాజిక సేవలో ముందుండాలని బీసీ రిజర్వేషన్ల పోరాట సమితి జాతీయ ప్రధాన కార్యదర్శి బత్తుల లక్ష్మీకాంతయ్య అన్నారు. కర్నూల్ నగరంలోని బిర్లా కాంపౌండ్ శశికాంత్ ప్లాజాలో బీసీ రిజర్వేషన్ల పోరాట సమితి కార్యాలయంలో. సామాజిక సేవా రంగంలో సేవలందించిన కర్నూల్ నగరమునకు చెందిన. జె చంద్రకళా భాయ్ కి పాండి చ్చేరిలోని యూనివర్సిటీ వారు.. డాక్టరేట్ ఇవ్వడం సందర్భంగా బీసీ నేతలందరూ చంద్రకళా భాయ్ ని సన్మానించడం జరిగింది..... . పేదరిక నిర్మూలనకు.. విద్యాభివృద్ధికి... సమాజంలోని అన్ని వర్గాల ప్రజలకు ప్రతిఫలం ఆశించకుండా స్వచ్ఛందంగా సేవ చేస్తుంటే.. ప్రజల్లో మంచి పేరు ప్రఖ్యాతలు వస్తాయన్నారు.. ఈ కార్యక్రమంలో సీనియర్ బీసీ నేత.. గడ్డం రామకృష్ణ.. సిహెచ్ మద్దయ్య.. అయ్యన్న యాదవ్. చంద్రశేఖర్ యాదవ్.. బోయ శ్రీనివాసులు.. ఉయ్యాలవాడ శీను. తదితరులు పాల్గొన్నారు.




# సొంత విషయాలు కూటమి ప్రభుత్వంపై రుద్దటం సమంజసం కాదు



జూపాడుబంగ్లా, మార్చి 27 (మనం న్యూస్): జూపాడు బంగ్లా మండల కేంద్రంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మండల కన్వీనర్ వెంకటేశ్వర్లు యాదవ్ ఆధ్వర్యంలో మండల టిడిపి నాయకుల సమక్షంలో పత్రిక సమావేశం నిర్వహించడం జరిగినది, ఈ సందర్భంగా మండల కన్వీనర్ వెంకటేశ్వర యాదవ్, మాట్లాడుతూ గత నిన్నటి దినమున జరిగిన పొలం తగాదా ఘర్షణకు సంబంధించి వ్యక్తిగత విషయాలకు పార్టీకి ఎలాంటి సంబంధం లేదని, మహేష్ 2004వ సంవత్సరంలో 80 బన్నూరు పొలిమేర లో ఉన్నటువంటి 769 /జె లో సర్వే నెంబర్లు గల 16 ఎకరాల 54 సెంట్లు భూమి. అదేవిధంగా 769/జీ సర్వేనెంబర్ లో గల ఐదు ఎకరాల 34 సెంట్లు భూమి గత 30 సంవత్సరముల నుంచి బేడ బుడగ జంగాల కు చెందినటువంటి రైతులు గత ప్రభుత్వంలో పేదవారై నందు వల్ల వీళ్లకు బతకడానికి 2004లో వీళ్లకు భూమిని స్వాధీనం చేసినట్లు పట్టాలు ఇవ్వడం జరిగిందని, కానీ ఈరోజు రాజకీయ స్వార్థంతో తెలుగుదేశం పార్టీపై బురద చల్లడానికి అనవసరంగా లేనిపోని అబండాలు వేస్తూ గొడవకు పక్కా ప్లాన్ తో పి లింగాపురం గ్రామ సర్పంచ్ నాగార్జున రెడ్డి, ఒక ట్రాక్టర్ రెండు ఆటోలు ఒక జీపుతోపాటు కట్టెలు రాడ్లు తీసుకుని దాదాపు 100 మందితో దాడి చేయడానికి ప్రయత్నించడంతో బేడ బుడగ జంగాలకు చెందిన వారు తిరగబడడం జరిగిందని ఇందులో ఎలాంటి రాజకీయ ఉద్దేశం లేదు అని గత ప్రభుత్వంలో వైయస్సార్ పార్టీ ఐదు సంవత్సరాల కాలంలో కూడా ఇలాంటి గొడవలు లేవు ఈ రోజు కేవలం రాజకీయ లబ్ధి కోసం ఈ అరాచకానికి దిగజారారని మండల తెలుగుదేశం పార్టీ నాయకులు ముక్తకంఠంతో వైసీపీ రాజకీయం చేస్తున్నారు అని ఖండిస్తూ బుడగ జంగాల వర్గీ లకు అండగా నిలుస్తూ న్యాయం చేయవలసిందిగా పత్రిక విలేకరుల ముందు తెలియజేశారు, ఈ సందర్భంగా బేడ బుడగ జంగాల కులానికి చెందిన మోతే పెద్దన్న మాట్లాడుతూ, ఆ భూమికి సంబంధించిన పాస్ బుక్, లు పట్టా కాగితాలు, రైతుకు సంబంధించిన బ్యాంకు నుండి తీసుకున్న అప్పుకు సంబంధించినటువంటి డాక్యుమెంట్స్, అదేవిధంగా అడంగల్, వన్ బి, పొలంలో వేసి నటువంటి బోర్లకు గాను వాటికి సంబంధించినటువంటి కరెంటు బిల్లులు అన్ని విధములైన భూమికి సంబంధించిన ఆర్ ఓ ఆర్ లను పత్రిక విలేకరులకు చూపిస్తూ గత 30 సంవత్సరాల నుంచి ఏ విధమైన పొలం తగాదాలు లేకుండా గుంతలుగా ఉన్న పొలాన్ని గత 30 సంవత్సరాలుగా సాగు చేస్తూ గుంతలన్నీ సొంత ఖర్చులతో ఒక పూట తినక ఒక పూట తిని కష్టపడి పొలాన్ని సాగుచేసి ఇన్నేళ్లు సాగు చేస్తూ వస్తూ ఉండగా ఇప్పుడు కేవలం వైసీపీ నాయకుడు పీ లింగాపురం గ్రామ సర్పంచ్ అయినటువంటి నాగార్జున రెడ్డి, ఎలాగైనా సరే టిడిపి ప్రభుత్వం పై బురద చల్లాలని ఉద్దేశంతో ఈ విధమైన గొడవలు తేవడం సిగ్గుచేటని ఆయన తెలపడం జరిగినది. కార్యక్రమంలో క్లస్టర్ ఇంచార్జ్ గిరీశ్వర్ రెడ్డి, జి మోహన్ రెడ్డి, వి శివరాంరెడ్డి, పిక్కిలి శ్రీనివాసులు, లింగాపురం వేణుగోపాల్ రెడ్డి, లింగాపురం నాగిరెడ్డి, రవికాంత్, కృష్ణారెడ్డి, మందాడి నారాయణరెడ్డి, కే రవికుమార్ యాదవ్, హనుమంత రెడ్డి, రామ్మోహన్ రెడ్డి, పారుమంచాల దేవ సహాయం, ఎం శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాదవశాత్తు కారు దగ్ధం

### త్రుటిలో తప్పిన ప్రమాదం



చేవెళ్ల, మార్చి 27(మనం న్యూస్): ప్రమాదవశాత్తు కారు దగ్ధమైన సంఘటన చేవెళ్ల మండల పరిధిలో ని కందవాడ స్టేజి సమీపంలో గురువారం చోటుచేసుకుంది. చేవెళ్ల పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కేసారం గ్రామానికి చెందిన కవ్వగూడం రాజశేఖర్ రెడ్డి మధ్యాహ్నం 12 గంటల సమయంలో కారు(టీఎస్ 07జెజె3335)కేసారం నుండి హైదరాబాద్ కు వెళ్తున్నాడు. మార్గమధ్యలో కందవాడ గేటు సమీపాన తన కారు డాష్ బోర్డులో మంటలు రాగా వెంటనే అతను రోడ్డు పక్కకి కారు ఆపి కారులో నుండి దిగారు. ఫైర్ ఇంజన్ కి కాల్ చేయగా అప్పటికే తన కారు మొత్తం మంటలు వచ్చి కాలి బూడిదయింది. ఈ ప్రమాదంలో ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగలేదు తెలిపారు.



IPL-2025



## సీఎస్కేతో జాగ్రత్త: ఆర్సీబీని హెచ్చరించిన వాట్సన్

ఐపీఎల్ 2025 సీజన్ ను రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు విజయంతో మొదలుపెట్టింది. కోల్‌కతాను ఈడెన్ గార్డెన్స్ లోనే ఓడించింది. ఇక చెపాక్ వేదికగా శుక్రవారం చెన్నై సూపర్ కింగ్స్తో తలపడనుంది. ఇది సీఎస్కే సొంత మైదానం. ఈ క్రమంలో చెన్నైతో అత్యంత జాగ్రత్తగా ఉండాలని.. ఏ ఒక్క పొరపాటు చేసినా ఓటమి తప్పదని ఆర్సీబీని మాజీ క్రికెటర్ షేన్ వాట్సన్ హెచ్చరించాడు. వాట్సన్ కు గతంలో చెన్నై, బెంగళూరు జట్లతో కలిసి ఆడిన అనుభవం ఉండటం గమనార్హం.



''చెపాక్ లో ఆర్సీబీకి పెను సవాల్ తప్పదు. సీఎస్కే జట్టులో నాణ్యమైన బౌలర్లు ఉన్నారు. చెన్నైకి దీటుగా సమాధానం ఇవ్వాలంటే బెంగళూరు కూడా సరైన కూర్పుతో బరిలోకి దిగాలి. చెపాక్ బౌలర్లకు స్వర్గధామం. సీఎస్కేను చూస్తుంటే.. ఆ జట్టులో ముగ్గురు స్పిన్నర్లు అశ్విన్, జడేజా, నూర్ అహ్మద్ అద్భుతంగా బౌలింగ్ చేస్తున్నారు. ఈ పిచ్ పై వారిని ఎదుర్కోవడం తేలికేం కాదు. ముంబయిపై నూర్అహ్మద్ తీవ్ర ప్రభావం చూపించాడు. ప్రతి బంతి వికెట్ ఇచ్చేలా విసిరాడు. వికెట్ తీసేందుకు ఆ ముగ్గురు ఎప్పుడూ సిద్ధంగా ఉంటారు. ఈ విషయంలో ఆర్సీబీకి సవాల్ తప్పదు. చెన్నై బ్యాటింగ్ లైనప్ కూడా బలంగా ఉంది'' అని వాట్సన్ వెల్లడించాడు.

రాజస్థాన్ బ్యాటర్లు ఇబ్బందిపడుతున్నారు..

''ఈసారి ఐపీఎల్ లో రాజస్థాన్ వరుసగా రెండు మ్యాచుల్లో ఓడింది. ఆ జట్టు బ్యాటర్లు ఇబ్బందిపడుతున్నట్లు అనిపిస్తోంది. కోల్ కతాతో జరిగిన పోరులో వరుణ్ చక్రవర్తి, మొయిన్ అలీని ఎదుర్కోలేకపోయారు. అదే సమయంలో రాజస్థాన్ బౌలర్లు మాత్రం ప్రత్యర్థిని కట్టడి చేయడంలో విఫలం కావడం చూశాం. లోతైన బౌలింగ్ లేకపోవడమూ నష్టం చేసింది. కేకేఆర్ ఓపెనర్ క్వింటన్ డికాక్ ఏ సమయంలోనూ ఒత్తిడికి గురికాకుండా తన జట్టును గెలిపించాడు. మొదట్లో ఆచితూచి ఆడి.. అవసరమైనప్పుడు బ్యాట్ ను ఝుళిపించాడు'' అని వాట్సన్ వెల్లడించాడు. రాజస్థాన్ 2008లో విజేతగా నిలిచినప్పుడు వాట్సన్ కూడా ఆ జట్టు సభ్యుడే.



## డికాక్ సెంచరీ కాకపోవడానికి ఆర్చరే కారణమా?

ఐపీఎల్ 18వ సీజన్ లో కోల్ కతా నైట్ రైడర్స్ అద్భుతమైన విజయం సాధించింది. కేకేఆర్ ఓపెనర్ క్వింటన్ డికాక్ (97₹) చివరి వరకూ క్రీజ్ లో ఉండి జట్టును గెలిపించాడు. తొలుత బ్యాటింగ్ చేసిన రాజస్థాన్ 151/9 స్కోరు చేసింది. అనంతరం లక్ష్య ఛేదనలో కోల్ కతా 17.3 ఓవర్లలోనే రెండు వికెట్లను మాత్రమే కోల్పోయి విజయం సాధించింది. ఈక్రమంలో రాజస్థాన్ బౌలర్ జోఫ్రా ఆర్చర్ పై సోషల్ మీడియాలో తీవ్ర విమర్శలు వస్తున్నాయి. క్రీడాస్ఫూర్తికి విరుద్ధంగా వ్యవహరించాడంటూ కామెంట్లు చేస్తున్నారు. అసలేం జరిగిందంటే?

ఆరంభంలో కాస్త ఆచితూచి ఆడిన డికాక్.. కీలక సమయంలో వేగం పెంచాడు. 35 బంతుల్లో హాఫ్ సెంచరీ మార్క్ ను తాకిన అతడు 17 ఓవర్లు ముగిసేసరికి 58 బంతుల్లో 81 పరుగులకు చేరాడు. అప్పటికి కోల్ కతా స్కోరు 135/2. ఇంకా కేవలం 17 పరుగులు మాత్రమే చేయాలి. 18వ ఓవర్ ను జోఫ్రా ఆర్చర్ వేశాడు. మొదటి బంతిని ఫోర్ గా మలిచిన డికాక్.. రెండో బంతికి సిక్స్ కొట్టాడు. దీంతో అతడు 91 పరుగులకు చేరాడు. మరో తొమ్మిది కొడితే అతడి సెంచరీ పూర్తయ్యేది. జట్టు విజయానికి ఏడు పరుగులు చాలు. అయితే, ఆర్చర్ మాత్రం వరుసగా రెండు వైడ్లు సంధించాడు. దీంతో సమీకరణం 5కి చేరింది. మూడో బంతిని డికాక్ మళ్లీ సిక్స్ గా మలిచాడు. కోల్ కతా విజయం సాధించింది. కానీ, డికాక్ పరుగులు మాత్రం 97 అయ్యాయి. ఒకవేళ ఆర్చర్ ఆ రెండు వైడ్లు వేయకుండా ఉండుంటే కనీసం ఒక్క బౌండరీ బాది డికాక్ సెంచరీ పూర్తి చేసేవాడని క్రికెట్ అభిమానులు కామెంట్లు చేస్తున్నారు. ''ఇదేనా క్రీడా స్ఫూర్తి. జోఫ్రా ఆర్చర్ చేసిన పని సరైంది కాదు. ఓవైపు శతకం చేసేందుకు దగ్గరగా వచ్చిన బ్యాటర్ కు అవకాశం ఇవ్వకుండా వైడ్లు వేయడం సమంజసమేనా? రాజస్థాన్ రాయల్స్ వంటి ఫ్రాంచైజీ నుంచి ఇలాంటివి వస్తాయని అస్సలు ఊహించలేదు''

''జోఫ్రా ఆర్చర్ షేమ్ లెస్. కావాలనే అతడు బౌలింగ్ చేసినట్లు అనిపిస్తోంది. డికాక్ సెంచరీ కాకుండా అడ్డుకొనేందుకే ఇలా చేశాడు. డికాక్ నీ సూపర్ ఇన్నింగ్స్ కు హ్యాట్సాఫ్. నిజమైన క్రీడాస్ఫూర్తి ఎప్పుడూ వెలుగులు అందిస్తూనే ఉంటుంది. ఆర్చర్ తీరు మాత్రం సరైంది కాదు''

## రెండో మ్యాచ్ లోనే భారీ రికార్డు పట్టాడు..!

కేకేఆర్ తరఫున తన రెండో మ్యాచ్ లోనే క్వింటన్ డికాక్ ఓ భారీ రికార్డు సాధించాడు. నిన్న (మార్చి 26) రాజస్థాన్ రాయల్స్ తో జరిగిన మ్యాచ్ లో 61 బంతుల్లో 97 పరుగులు చేసిన అతడు.. కేకేఆర్ తరఫున విజయవంతమైన ఛేదనల్లో అత్యధిక స్కోర్ చేసిన ఆటగాడిగా రికార్డు నెలకొల్పాడు. గతంలో ఈ రికార్డు మనీశ్ పాండే పేరిట ఉండేది. మనీశ్ 2014 సీజన్ ఫైనల్లో పంజాబ్ పై 94 పరుగులు చేశాడు.

## విజయవంతమైన లక్ష్య ఛేదనల్లో కేకేఆర్ తరఫున అత్యధిక వ్యక్తిగత స్కోర్లు

97* - క్వింటన్ డికాక్ VS RR, గౌహతి, 2025
94 - మనీశ్ పాండే VS PBKS, బెంగళూరు, 2014 ఫైనల్
93* - క్రిస్ లిన్ VS GL, రాజ్ కోట్, 2017
92 - మన్వీందర్ బిస్లా VS CSK, చెన్నై, 2013
90* - గౌతమ్ గంభీర్ VS SRH, హైదరాబాద్, 2016



## దంచికొట్టిన పూరన్, మార్ష్.. హైదరాబాద్ ఓటమి

ఐపీఎల్ 18లో లఖ్‌నవూ బోణీ కొట్టింది. హైదరాబాద్ తో జరిగిన మ్యాచ్ లో ఆ జట్టు 5 వికెట్ల తేడాతో గెలుపొందింది. 191 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్ చేసిన లఖ్ నవూ 16.1 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి ఛేదించింది. పూరన్ (70: 26 బంతుల్లో 6 ఫోర్లు, 6 సిక్సు) ఆకాశమే హద్దుగా విరుచుకుపడ్డాడు. మరో బ్యాటర్ మిచెల్ మార్ష్ (52: 31 బంతుల్లో 7 ఫోర్లు, 2 సిక్సు) చెలరేగాడు. వీరి దూకుడుతో లఖ్నవూ వడవడిగా విజయంవైపు వెళ్లింది. చివర్లో అబ్దుల్ సమద్ (22*) దూకుడుగా ఆడాడు. ఎస్ఆర్హెచ్ బౌలర్లలో కమిన్స్ 2, షమీ, జంపా, హర్షల్పటేల్ ఒక్కో వికెట్ తీశారు. తొలుత బ్యాటింగ్ చేసిన హైదరాబాద్ 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 190 పరుగులు చేసింది. ట్రావిస్ హెడ్ (47), నితీశ్ రెడ్డి (32), అనికేత్ (36) క్లాసెన్ (26) రాణించారు.

## RC16 ఫస్ట్ లుక్..

## ఊహించని లెవెల్లో గ్లోబల్ స్టార్ ఊరమాస్

ప్రస్తుతం మన టాలీవుడ్ లో ఉన్నటువంటి బిగ్గెస్ట్ మాస్ హీరోస్ లో ఒకరైన గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ పుట్టినరోజు సందర్భంగా అభిమానులు అటు సోషల్ మీడియాలో ఇటు ఆఫ్ లైన్ లో కూడా గ్రాండ్ గా తమ హీరోకి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్నారు. ఇలా ఇక తన నెక్స్ట్ సినిమా తన కెరీర్ 16వ చిత్రం నుంచి అవైటెడ్ ఫస్ట్ లుక్ పోస్టర్ ని మేకర్స్ కన్ఫర్మ్ చేసిన సంగతి తెలిసిందే. జస్ట్ ప్రీ లుక్ పోస్టర్ తోనే గట్టి హైప్ అందుకున్న ఈ చిత్రం నుంచి మొత్తానికి ఫస్ట్ లుక్ పోస్టర్ ఇపుడు వచ్చేసింది.

మరి మేకర్స్ ఒకటి కాదు రెండు ఫస్ట్ లుక్ పోస్టర్స్ ని రిలీజ్ చేసారు. ఇక ఈ పోస్టర్స్ లో మాత్రం రామ్ చరణ్ ఊహించని లుక్ లో అదరగొట్టేసాడు అని చెప్పి తీరాలి. ఒక లుక్ లో బీడీ కాలుస్తూ ఇంకో లుక్ లో బ్యాట్ పట్టుకొని ఊరమాస్ లుక్స్ తో చరణ్ దర్శనం ఇవ్వడం అభిమానులని గట్టిగా ఎగ్జైట్ చేస్తుంది. దీనితో ఫస్ట్ లుక్ తోనే మేకర్స్ సిక్సర్ కొట్టారని చెప్పవచ్చు. ఇక ఈ భారీ చిత్రానికి ఏ ఆర్ రెహమాన్ సంగీతం అందిస్తుండగా వృద్ధి సినిమాస్, మైత్రి మూవీ మేకర్స్ నిర్మాణం వహిస్తున్నారు.

**చరణ్ ఖాతాలో మరో ఐకానిక్ రోల్ పడబోతుందా!**

టాలీవుడ్ మెగాస్టార్ చిరంజీవి నట వారసుడు రామ్ చరణ్ టాలీవుడ్ లోకి ఎంట్రీ ఇచ్చిన కొన్నేళ్ల లోనే భారీ ఫేమ్ ని అందుకున్నాడు. ఇలా గ్లోబల్ స్టార్ గా ఎదిగిన తాను నటుడుగా కూడా కేవలం ఈ కొన్ని సినిమాల్లోనే చూపించిన ఇంపాక్ట్ అంతా ఇంతా కూడా కాదు. రెండో సినిమా మగధీర లోనే ఎంతో పరిణితి కనబరిచిన చరణ్ అక్కడ నుంచి రంగస్థలంలో చిట్టి




బాబుగా ఒక లైఫ్ టైం రోల్ ని చేసి ఫ్యాన్స్ కి గిఫ్ట్ ఇచ్చాడు.

దానికి నేషనల్ అవార్డు కూడా వస్తుంది అని చాలా మంది అనుకున్నారు కానీ అది నెరవేరలేదు. ఇక రీసెంట్ గా గేమ్ ఛేంజర్ సినిమాలో అప్పన్న పాత్రతో చరణ్ మరోసారి అందరికీ షాకిచ్చాడు. చిట్టి బాబుని మించిన నటుడు తనలో ఉన్నాడని అద్భుతంగా చేసి చూపించాడు. ఇక ఇపుడు ఈ రెండు పాత్రలు తర్వాత మరో ఐకానిక్ పాత్ర తన లేటెస్ట్ చిత్రం పెద్దితో పడబోతున్నట్టు అనిపిస్తుంది.

వచ్చిన ఫస్ట్ లుక్ పోస్టర్స్ తో సాలిడ్ హైప్ ని తాను అందుకోగా తన మాస్ అండ్ రగ్గడ్ లుక్స్ తో తన పెర్ఫామెన్స్ కూడా సినిమాలో అదిరిపోతుంది అని ఇపుడు తెలుస్తుంది. దీనితో పెద్ది కూడా చరణ్ కెరీర్లో ఒక ఐకానిక్ పాత్రగా నిలిచిపోతుంది అని ఇపుడు నుంచే టాక్ మొదలైంది. మరి ఆ రేంజ్ లోనే ఉంటుందా లేదా దర్శకుడు బుచ్చిబాబు ఎలా ప్లాన్ చేసాడో అనేది వేచి చూడాలి.

## అలియాకు నేషనల్ అవార్డు.. అసూయపడ్డాను : సారా

బాలీవుడ్ హీరోయిన్ అలియా భట్కు నేషనల్ అవార్డు వచ్చినప్పుడు తనకు అసూయ కలిగిందన్నారు నటి సారా అలీఖాన్. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆమె అలియా జీవితం ప్రస్తుతం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ''అలియా ఎంతో ఆనందంగా ఉంది. సినిమాల విషయంలోనే కాదు.. వ్యక్తిగతంగానూ ఆమె సంతోషంగా జీవిస్తున్నారు.




ఈ స్థాయికి రావడం కోసం ఆమె ఎంతో కష్టపడింది. ఎన్నో సవాళ్లను ఎదుర్కొంది. కానీ.. ఆమెకు జాతీయఅవార్డు వచ్చినప్పుడు ఒక నటిగా నేను అసూయ పడ్డాను. అలాంటి సినిమాలో నాకు అవకాశం ఎందుకు రాలేదనిపించింది. ఎదుటివారిని చూసి అసూయపడడం సహజం. దాని వెనక ఎంత కష్టం ఉంటుందో ఎవరికీ అర్థం కాదు. ఆ కష్టాన్ని ఎవరూ చూడరు. అవార్డును మాత్రమే చూస్తారు. నేనూ అలానే భావించాను'' అని సారా అలీఖాన్ చెప్పారు. ఇక 'గంగూబాయి కాఠియావాడి'లో వేశ్య పాత్రకు గాను అలియా భట్ కు నేషనల్ అవార్డు వచ్చిన విషయం తెలిసిందే. ప్రస్తుతం అలియా 'లవ్ అండ్ వార్'లో నటిస్తోంది. రణ్ బీర్ కపూర్ తో కలిసి ఇందులో సందడి చేయనుంది.





## పవన్ కళ్యాణ్ క్రేజ్ ముందు పాన్ ఇండియా సినిమాలు జూజుబి!

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా నటిస్తున్న లేటెస్ట్ చిత్రాల్లో దర్శకుడు హరీష్ శంకర్ తో చేస్తున్న సాలిడ్ మాస్ చిత్రం ఉస్తాద్ భగత్ సింగ్ కూడా ఒకటి. మరి పవన్ కళ్యాణ్ ఇచ్చిన కొన్ని రోజుల వ్యవధిలోనే సాలిడ్ కంటెంట్ ని మేకర్స్ చేసేసి ఆశ్చర్య పరిచారు. దీనితో ఈ సినిమాపై కూడా మంచి అంచనాలు నెలకొన్నాయి. అయితే ఈ సినిమాపై నిర్మాత రవి శంకర్ కామెంట్స్ మంచి వైరల్ గా మారాయి.కళ్యాణ్ గారి క్రేజ్ ముందు ఏ పాన్ ఇండియా సినిమా కూడా పనికిరాదు అన్నట్లుగా వ్యాఖ్యానించారు. నితిన్ రాబిన్ హుడ్ ప్రమోషన్స్ లో చేసిన లేటెస్ట్ కామెంట్స్ వైరల్ గా మారాయి. పవన్ డేట్స్ కోసం తాము ఎదురు చూస్తున్నాము అని వచ్చే ఏడాది ఎలాగైనా సినిమా రిలీజ్ చేస్తామని పవన్ ఫ్యాన్స్ కి క్రేజీ కిక్ ని వారు అందించారు. దీనితో ఈ సాలిడ్ స్టేట్మెంట్ మంచి వైరల్ గా చక్కర్లు కొడుతోంది.



Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises D.No:3-88, Gosala village, Penamaluru Mandal, Krishna District 521151(AP), And Published at H.No.23-3-46, 1st Floor, Katamaraju vari Veedhi, Amaravathi Road, Naidupet Guntur(District) AP-522002. EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.APTEL/2016/73939.